RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు | 27-09-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 190 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

# పర్యాటక రంగానికి కొత్త కళ

▪ రూ.50 వేల కోట్ల పెట్టుబడులు ▪ 5 లక్షల మందికి ఉపాధి లక్ష్యం

**తొలి ఏడాదే రూ.22,174 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు**
**పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిర పర్యాటకాభివృద్ధికి పిలుపు**
**గిరిజనుల కోసం 'రివర్స్ టూరిజం'**



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వుదయం) :** తెలంగాణను దేశంలోనే అగ్రశ్రేణి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శిల్పారామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. నూతన పర్యాటక విధానం ద్వారా రాష్ట్రంలో భారీగా నిధులను ఆకర్షించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

రాష్ట్రంలో ఉన్న చారిత్రక సంపద, రామప్ప వంటి ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన పుణ్యక్షేత్రాలు, నల్లమల అడవులు, జలపాతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు.

**ఐదేళ్ల ప్రణాళిక – తొలి ఏడాదే రూ.22,174 కోట్ల ప్రతిపాదనలు**

పర్యాటక విధానం ద్వారా తొలుత అనుకున్న లక్ష్యాల కన్నా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని మంత్రి వివరించారు.

పెట్టుబడుల కేటాయింపు: ప్రారంభంలో రూ.15 వేల కోట్లు ఆకర్షించాలని భావించినప్పటికీ, ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని, తద్వారా 5 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

తొలి ఏడాది పురోగతి: విధానం అమల్లోకి వచ్చిన మొదటి ఏడాదే రూ.22,174 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. ప్రభుత్వ రంగానికి తోడుగా భాగస్వామ్య పద్ధతుల్లో ఈ ప్రాజెక్టులను త్వరలోనే పట్టాలెక్కిస్తాం.

**సాంకేతికతతో వినూత్న సేవలు –**

**'రివర్స్ టూరిజం'కు శ్రీకారం**

ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన 'కృత్రిమ మేధ, డిజిటల్ విప్లవంతో పర్యాటకరంగ పునర్నిర్మాణం'కు అనుగుణంగా రాష్ట్ర పర్యాటక శాఖ పలు మార్పులు చేపట్టింది.

నూతన అంతర్జాల వేదిక (వెబ్‌సైట్): పర్యాటకులకు ప్యాకేజీలు, దర్శనీయ స్థలాలు, కార్యక్రమాల సమాచారాన్ని సులభంగా అందించేలా ఆధునిక అంతర్జాల వేదికను అందుబాటులోకి తెచ్చాం. బహుభాషా సహాయం, వర్చువల్ అనుభూతుల కోసం కృత్రిమ మేధను విస్తృతంగా ఉపయోగిస్తున్నాం.

అడవి బిడ్డలకు నగర సందర్శన: సరికొత్త ఆలోచనతో 'రివర్స్ టూరిజం'ను ప్రారంభించాం. ఇందులో భాగంగా ములుగు జిల్లాకు చెందిన 100 మంది గిరిజన సోదరులను నగరానికి ఆహ్వానించి, ఇక్కడి చారిత్రక, ఆధునిక ప్రాంతాలను ప్రత్యక్షంగా చూపించే ఏర్పాటు చేశాం.

సుస్థిర అభివృద్ధి: అడవులు, జలవనరులు, పర్యావరణ పరిరక్షణను దెబ్బతీయకుండా పర్యాటకాన్ని విస్తరిస్తాం. స్థానిక కళాకారులు, మార్గదర్శకులు (గైడ్లు), రవాణా నిర్వాహకులకు ఆర్థికంగా తోడ్పాటు అందించి ప్రతి పర్యాటక కేం

# కొత్త ఓటర్ల నమోదుకు మళ్లీ అవకాశం

**సుప్రీంకోర్టు ఉత్తర్వులకు లోబడే ఓటర్ల నమోదు డిక్లరేషన్**
**ముగిసిన 20 రాష్ట్రాల సమగ్ర సవరణ – నమోదు దరఖాస్తులకు ఆహ్వానం**
**క్యాబినెట్ కార్యదర్శి లేఖపై ఎన్నికల సంఘం క్లారిటీ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (ఎఎంఎస్) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, రేగిన వివాదాలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. సవరణ నోటీసులు అందుకున్న పౌరులు అత్యవసర పరిస్థితిల్లో మినహా స్వయంగా విచారణాధికారుల ముందుకు రావలసిన అవసరం లేదని స్పష్టం చేసింది. దరఖాస్తులతో పాటు ఇచ్చే ప్రమాణ పత్రాన్ని అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) సమర్థించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. న్యూఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిల భాగస్వామ్యంతో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశం అనంతరం ఎన్నికల సంఘం ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. తదుపరి నమోదుకు అవకాశం: బీహార్, పశ్చిమ బెంగాల్ సహా ఇరవై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సవరణ ప్రక్రియ ఇప్పటికే పూర్తయినట్లు తెలిపింది. జాబితాలో పేర్లు పొందుపరచని వారు, నూతనంగా ఓటు హక్కు పొందే యువత నిరంతర ప్రక్రియ ద్వారా నమోదు దరఖాస్తులు అందజేయవచ్చని, దీనికోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది.

అధికారిక పత్రం వివాదంపై స్పష్టత: కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి రాసిన లేఖకు సంబంధించి వ్యాపిస్తున్న ప్రచారాన్ని ఎన్నికల సంఘం ఖండించింది. ఇది విధానపరమైన అంశాల గురించిన లేఖ కాదని, ప్రతినిధిత్వ హోదాలో వచ్చిన ఒక అధికారి పనితీరుకు సంబంధించిన అంతర్గత వ్యవహారమని వెల్లడించింది. ఏకగ్రీవ ఆమోదంతోనే నిర్ణయం: గతేడాది జూన్ 24న జారీ చేసిన ఆదేశాలన్నీ ఎన్నికల కమిషనర్లందరి ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయని, సర్వోన్నత న్యాయస్థానం కూడా దీనిని సమర్థించిందని తెలిపింది.

దేశ ఆర్థిక రూపురేఖలను మార్చిన

# జాతిరత్న మన్మోహన్

**మన్మోహన్ సింగ్‌కు 'భారత రత్న' ఇవ్వాలి**
**శాసనసభ వేదికగా, విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు పిలుపు**
**తెలంగాణ ఆత్మగౌరవ ప్రదాత మన్మోహన్ సింగ్**
**హైదరాబాద్‌లో విగ్రహావిష్కరణ చేసిన ముఖ్యమంత్రి**





**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వుదయం) :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నిజం చేసి, ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఢిల్లీ నగరంలో ఒక ప్రత్యేక 'విజ్ఞాన కేంద్రం' ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్థిక కార్యకలాపాల కేంద్రం (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) పరిధిలోని విప్రో కూడలిలో ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ప్రయోజనాల దృష్ట్యా కొన్ని విషయాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మౌనమునిలా ఉంటూనే దేశ ఆర్థిక వ్యవస్థను అగ్రపథంలో నిలిపిన మహోన్నత వ్యక్తి మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఈ విషయాన్ని జాతీయ కాంగ్రెస్ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్లమెంట్ వేదికగా ప్రస్తావించాలని రాజ్యసభ సభ్యులకు సూచించారు.

ఆర్థిక విప్లవానికి నాంది - తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర

రిజర్వు బ్యాంకు అధిపతిగా, ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా ఏ బాధ్యత చేపట్టినా ఆ పదవులకు మన్మోహన్ సింగ్ పూర్వ వైభవం తెచ్చారని ముఖ్యమంత్రి కొనియాడారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు: 1991లో దివంగత ప్రధాని పి.వి.నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ తెచ్చిన ఉదారవాద, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలే దేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాయని గుర్తుచేశారు. చారిత్రక ఘట్టాలు: హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసిన ఘనత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్‌లదైతే... సుదీర్ఘ కాలపు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్‌లకే దక్కుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రకటనపై ఆయన చేసిన సంతకాన్ని ఇక్కడ ప్రత్యేకంగా భద్రపరిచామని తెలిపారు. ప్రజానుకూల చట్టాలు: విద్యా హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2013 భూసేకరణ మరియు పునరావాస చట్టాలను తెచ్చి పేదలకు, భూమి లేని కూలీలకు సైతం చట్టబద్ధమైన నష్టపరిహారం లభించేలా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి




**న్యూఢిల్లీ, సెప్టెంబర్26 (వుదయం ప్రతినిధి):** దేశ రాజధానిలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భవన్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ శశాంక్ గోయల్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ విముక్తి పోరాటంలో ఆమె ప్రదర్శించిన తెగువ, పోరాట పటిమను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రాయోజిత పథకాల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్‌తో పాటు తెలంగాణ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆమెకు పుష్పాంజలి ఘటించారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు విపక్షాల పట్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (ఎఎంఎస్) :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నిజం చేసి, ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఢిల్లీ నగరంలో ఒక ప్రత్యేక 'విజ్ఞాన కేంద్రం' ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్థిక కార్యకలాపాల కేంద్రం (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) పరిధిలోని విప్రో కూడలిలో ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

# ప్రజల గుండెల్లో కేసీఆర్ భద్రం

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వుదయం) :** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రసంగించారు. ప్రజలు ప్రతి నిత్యం పొందుతున్న సంక్షేమ ఫలాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూపం ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసినా, ఏ పండుగ వేడుకల్లోనైనా ప్రజల నోట కేసీఆర్ పేరే వినిపిస్తోందని తెలిపారు. శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమల్లోకి రాకపోవడంతో ప్రజలు గత ప్రభుత్వ పాలనను, కేసీఆర్ నిర్ణయాలను గుర్తుచేసుకుంటున్నారని కేటీఆర్ వివరించారు.



సంక్షేమం – రైతు సంక్షేమంపై కేటీఆర్ వ్యాఖ్యలు

**కళ్యాణ లక్ష్మి సాయం:** పేదింటి ఆడబిడ్డ పెళ్లికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని, చెక్కు అందుకున్న ప్రతిసారీ తల్లిదండ్రులు ఆయనను సొంత మేనమామలా గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు.

తాగునీటి సౌకర్యం: ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు అందించి, మహిళల నీటి తిప్పలను తప్పించారని.. ఆ నీటి బొట్టులో కేసీఆర్ కనబడుతున్నారని ఆడబిడ్డలు దీవిస్తున్నారని పేర్కొన్నారు.

**చేయూత పింఛన్లు:** గతంలో ఉన్న రెండు వందల రూపాయల పింఛనును రెండు వేల రూపాయలకు పెంచి నలభై ఆరు లక్షల మంది లబ్ధిదారులకు ఆసరాగా నిలిచారని తెలిపారు.

**సాగునీటి ప్రాజెక్టులు:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మళ్లించి మహబూబాబాద్, డోర్నకల్, సూర్యాపేట, కోదాడ వరకు సాగునీరు అందించిన తీరును రైతాంగం స్మరించుకుంటోందన్నారు.


> **"రైతు బంధు నిధులు సమయానికి జమ కాకపోవడంతో నాట్లు వేసే సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సరైన సమయానికి ఖాతాల్లో డబ్బులు పడే విధానాన్ని రైతులు గుర్తుచేసుకుంటున్నారు."**
> — కేటీఆర్

ప్రస్తుత ప్రభుత్వం అరకొర సాయం చేస్తూ పెద్ద ఎత్తున సభలు నిర్వహిస్తూ, కేవలం విమర్శలకే పరిమితమవుతోందని కేటీఆర్ మండిపడ్డారు.

## ఇరాన్ శాంతి ప్రతిపాదన తిరస్కరణ

**ఇరాన్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. కాల్పుల విరమణ దిశగా ఇరాన్ పంపిన శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చినట్లు సమాచారం. నవంబరులో జరగనున్న మధ్యంతర ఎన్నికల అనంతరం ఇరాన్ లక్ష్యాలపై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అగ్రరాజ్యం ప్రణాళికలు రచిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి.

## ఇంతే కదా...!








## ప్రభుత్వ పథకాలకు రైతు ఫార్మర్ ఐడి: ఏఈఓ రవినాయక్

**పూడూరు సెప్టెంబర్ 27, (వుదయం )**

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని తుర్క ఎంకేపల్లి గ్రామములో సర్పంచ్ వెంకటేష్ఆధ్వర్యంలోరైతులకు శనివారం రోజున రైతు రిజిష్ట్రేషన్( ఫార్మర్ ఐడి )నమోదు చేసిన ఏఈఓ రవి నాయక్ , ఈనెల 22 నుండి 30 తారీఖు వరకు ప్రతి రైతు ఏఈఓ ల దగ్గర రైతు రిజిస్ట్రేషన్(ఫార్మర్ ఐడి )పంట నమోదు చేసుకోవాలని అన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పంటలు వేసినట్టు అయితే ఫార్మర్ సిస్టర్ చేసుకుంటే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చని, రైతులకు సరిపడే విధంగా ఎరువులు అందుతాయి, అదేవిధంగా బ్యాంకుల ద్వారా ఏ పంటకు ఎంత రుణం అనేది బ్యాంకు రుణాలు పొంద వచ్చు అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సేవలు ఇతర ప్రయోజనాలు పొందడానికి ఉపయోగ పడుతుందని అన్నారు ప్రతి గ్రామంలో రైతు రిజిష్ట్రేషన్ క్యాంపస్లు నిర్వహించ బడుతున్నవి అందరు రైతులు తప్పనిసరిగా చేయించు కోవాలని, వీలు కానీ రైతులు మీ దగ్గరలో ఉన్న మీసేవ సెంటర్లో అయినా చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవినాయక్ తో పాటు తుర్కఎంకేపల్లి గ్రామా రైతులు పాల్గొన్నారు.

## రాజీవ్ ఆరోగ్యశ్రీలో అరుదైన ఆపరేషన్



- **దుబ్బాక ఏరియా ఆసుపత్రిలో 6 కిలోల ఫైబ్రాయిడ్ గడ్డ తొలగింపు**
- **ఒకేరోజు 15 ఆపరేషన్లు చేసిన వైద్యులు**

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 26, వుదయం :**

సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యులు మరో అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లా ఫారిద్ పేట గ్రామానికి చెందిన కవిత (44) గత కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ దుబ్బాక ఏరియా ఆసుపత్రికి వచ్చారు. వైద్య పరీక్షల అనంతరం ఆమె కడుపులో ఫైబ్రాయిడ్ ఉన్నట్లు గుర్తించారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో శనివారం వైద్యులు ఆపరేషన్ చేసి సుమారు 6 కిలోల 100 గ్రాముల ఫైబ్రాయిడ్ గడ్డను తొలగించారు. ప్రస్తుతం బాధితురాలి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నేడు ఆసుపత్రిలో మొత్తం 15 ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యులు విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహించినట్లు వెల్లడించారు. రోగుల బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఆపరేషన్ లో మత్తు వైద్యులు ప్రేమ్ కిషోర్, అస్మా, పూజ, గైనకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమం



- **పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**హైదరాబాద్ /సంగారెడ్డి వుదయం :**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా భూమి, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటాన్ని, ఆమె ధైర్యసాహసాలను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్మరించుకున్నారు.తెలంగాణ చరిత్రలో ఆమె పోరాటం చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

**బీసీ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

అనంతరం తెలంగాణ అసెంబ్లీలో నిర్వహించిన బీసీ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. సమావేశంలో బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో వారికి మరిన్ని అవకాశాలు కల్పించే అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

- **జిల్లా కో కన్వీనర్ ప్రహ్లాదచారి.**
- **మహాసభ గోడపత్రిక విడుదల.**

**బొంరాస్ పేట్, సెప్టెంబర్ 26**

నేడు వికారాబాద్ జిల్లా కేంద్రంలో టియూడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే జర్నలిస్ట్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కో కన్వీనర్ ప్రహ్లాదాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, ఉపాధిహామీ రాష్ట్ర సభ్యులు నర్సిములు గౌడ్, పిపిసిఎస్ చైర్మన్ జయకృష్ణ, మల్లికార్జున్, నర్సిములు నాయుడు, చెరుపు కృష్ణ జిల్లా మహాసభ వాల్ పోస్టర్ ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ప్రహ్లాదచారి మాట్లాడుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని శివకేశవ బంకెట్ హాల్ లో ఉదయం 11 గంటలకు నిర్వహించే మహాసభకు కొడంగల్ నియోజకవర్గం నుండి జర్నలిస్ట్ లు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు మల్లయ్య గౌడ్, అశోక్ గౌడ్, అనంతయ్య, హన్మంత్,చంద్ర శేఖర్,రమేష్, అమ్మతయ్య తదితరులు పాల్గొన్నారు.
ఫోటో రైటప్ :
1.జిల్లా మహాసభ వాల్ పోస్టర్ ను విడుదల చేస్తున్న నాయకులు.

# దొరల గద్దెలను ఊపేసిన పౌరుషాల ఐలమ్మ

- **భూమి.. భుక్తి.. ఆత్మగౌరవ సమరానికి నిలువెత్తు శంఖారావం**
- **వెట్టిచాకిరి సంకెళ్లు తెంచిన వీరనారికి బిజ్వారంలో అశేష ప్రజానీకం ఘన నివాళి**

**మల్దకల్ సెప్టెంబర్ 26 (వుదయం బ్యూరో)**



నిజాం నవాబుల అణచివేతకు, గడీల దొరల గజగజలకు బెదరక ఎదురొడ్డి నిలిచిన తెలంగాణ సాయుధ పోరాట నారీమణి చాకలి ఐలమ్మ అని మాజీ ఎంపీపీ వై. రాజారెడ్డి కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన పోరాటం నేటికీ, ఏటికీ అమరస్ఫూర్తిగా నిలిచిపోతుందని నినదించారు. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో ఐలమ్మ రజక కమిటీ ఆధ్వర్యంలో శనివారం చాకలి ఐలమ్మ 131వ జయంత్యుత్సవాలు జరిగాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎంపీపీలు వై. సత్యారెడ్డి, వై. రాజారెడ్డి ఐలమ్మ చిత్రపటా నికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిం చారు. అన్యాయానికి తలవంచని తెగువ.. ప్రపంచాన్ని దాటిన పౌరుషం! ఈ సందర్భంగా మాజీ ఎంపీపీలు రాజారెడ్డి, సత్యారెడ్డిలతో పాటు దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. తిరుమలేష్ మాట్లాడుతూ — "దోపిడీదారుల అధికార బలగాలను తుంగలో తొక్కి, నడుము బిగించి గర్జించిన ఐలమ్మ పోరాట పటిమ తెలంగాణ పౌరుషాన్ని నలుదిశలా చాటిచెప్పిందని" పేర్కొన్నారు. వెట్టిచాకిరి సంకెళ్లను తెంచుకుని హక్కుల సాధన కోసం గళమెత్తిన ఆమె జీవితం ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసాన్ని రగిలిస్తుందని తెలిపారు. "అన్యాయాన్ని సహించొద్దు.. హక్కుల కోసం గళమెత్తాలి" అనే అమూల్యమైన సందేశాన్ని ఐలమ్మ సమాజానికి ఇచ్చారని, సమతా సమాజ స్థాపన, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.
ఘనంగా సన్మాన గ్రహీతలు కార్యక్రమం అనంతరం ఐలమ్మ రజక కమిటీ నాయకులు, వివిధ రంగాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఐలమ్మ పోరాట గాథను స్మరిస్తూ పలువురు ప్రసంగించారు. ఈ వేడుకల్లో గ్రామ ఉపసర్పంచ్ చాపకండ్ల కర్రెన్న, వార్డు సభ్యుడు బి. హరిన్ కుమార్, ఐలమ్మ రజక కమిటీ అధ్యక్షుడు సి. నర్సింహులు, ఉపాధ్యక్షుడు అమరేష్, సలహాదారు సిద్దు, బీసన్న, కృష్ణ, వీరేష్, వెంకట్రాములు, లక్ష్మన్న, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, చిన్న ఆశన్న, మండల సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రంగన్న, భీమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గోపాల కృష్ణ, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు రిజిస్ట్రీ ప్రత్యేక క్యాంపెయిన్ నమోదు తప్పనిసరి

**( వుదయం, మహబూబ్ నగర్ )**



వ్యవసాయ శాఖ సంచాలకులు మరియుజిల్లా కల్లెక్టర్ గారి ఆదేశాల మేరకు జరుపబడుతున్న రైతురిజిస్ట్రీ ప్రత్యేక క్యాంపెయిన్ సెప్టెంబర్ 30వ తేదీతోము గుస్తుంది కావున రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోని రైతు ఐడి పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ.కె. గోవింద్ నాయక్ గారు తెలియచేసారు.
*దేశంలోని ప్రతిరైతుకు ఆధార్ తరహాలో ఒక ప్రత్యేకమైన రైతు గుర్తింపు నంబరు ఇవ్వాలనే
ఊదేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అగ్రి స్టాక్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రీ విధానాన్ని తీసుకువచ్చింది.
ప్రయోజనాలు
1.ఆ రైతు పేరు మీద వున్న భూములన్నీ ఒకే చోట కనిపిస్తాయి.
2.నిజమైన రైతులను గుర్తించడం సులభం.
3.ఎరువుల యఫ్ (FFS)ద్వారా ఎరువుల కొనుగోలుకు ఉపయోగపడుతుంది.
4. బ్యాంకుల ద్వారా పంట ఋణాలు పొందేందుకు ఉపయోగం.
5.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ,సేవలు పొందేందుకు వీలు కలుగుతుంది.
6. వరి,పత్తి,మొక్కజొన్న,కంధి వంటి పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే సమయంలో రైతులను గుర్తించడానికి ఉపయోగపడుతుంది.
7.రైతు సేవలు సబ్సిడీలతో పాటు ఇతర వ్యవసాయ సేవలకు భవిష్యత్తులో ఉపయోగపడుతుంది.
8.ఇప్పటికే నమోదు చేసుకొన్న వారు ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్ సైట్ లింక్ ద్వారా తమ ID తెలుసుకోవచ్చు.
ఫార్మర్ రిజిస్ట్రీకి అవసరమైన పత్రాలు ఆధార్ కార్డ్ జిరాక్స్ , పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ మరియు ఆధార్ లింక్ అయిన మొబైల్ నెంబర్ .
ఇంతవరకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకొని రైతులు పైన తెలిపిన పత్రాలను తీసుకొని గ్రామాలలో నిర్వహించబడుతున్న ప్రత్యేక క్యాంపెయిన్ లో సంబంధీత వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి నమోదు చేసుకోని గుర్తింపు నంబరును పొంది ప్రభుత్వం అందచేసే వివిధ వ్యవసాయ సేవలను పొందవలసినదిగా కొరడమైనది. జిల్లా వ్యవసాయ అధికారి గారు హన్వాడ మండలం లోని అంబటోనిపల్లి మరియు మహబూబ్ నగర్ రూరల్ మండలం లోని బొక్కలోనిపల్లి గ్రామాలలో రైతు నమోదు ప్రక్రియను పరిశీలించి రైతు లంధరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవలసిందిగా కోరినరు.ఈ క్యాంపెయిన్ కు హాజరు కాలెని వారు తమకు దగ్గరలోని మీ సేవాకేంద్రం మరియు కామన్ సర్విస్ సెంటర్ (CSC) లలో కూడా నమోదు చేసుకోవచ్చుని తెలుపటమైనది. జిల్లా వ్యవసాయ అధికారి,మహబూబ్ నగర్.

# దుద్దెడ చేనేత సహకార సంఘ సర్వ సమేశం

- **చేనేతల హక్కులను కాపాడే బాధ్యత మాదే**
- **వెంటనే మాకు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేసిన నూతన అధ్యక్షులు శ్రీనివాస్**

**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి సెప్టెంబర్ 26**



మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో ఉన్న చేనేత సహకార,ఉత్పత్తి సంఘానికి సంబంధించిన ఎన్నికలను నిర్వహించి గత రెండూ నెలలకింద నూతన పాలక వర్గాన్ని ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం రోజు సహకార సంఘ 76వ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని నూతన అధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్ సంఘాన్ని ఉద్దేశించి మాట్లాడరు,సంఘం మనగడను కాపాడటానికి, చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించి నెలలు గడుస్తున్నా గత పాలకమండలి నుంచి నూతన వర్గానికి పూర్తిస్థాయిలో అధికార బాధ్యతలు, రికార్డులను అప్పగించకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడం వల్ల సంఘం అభివృద్ధి పనులు, కార్మికులకు నూలు సరఫరా, సంక్షేమ పథకాల అమలులో తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు.ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత పింఛన్ల దరఖాస్తు ప్రక్రియలో కూడా అర్హులైన ప్రతి కార్మికుడికి అండగా ఉండాలని ప్రయత్నించినా, అధికార బాధ్యతలు చేతికి రాకపోవడంతో పూర్తిస్థాయిలో సహాయం అందించలేకపోయామని విచారం వ్యక్తం చేశారు. సంఘం ఉనికిని దెబ్బతీసేలా సాగిన గత పాలకుల అవినీతి, అక్రమాలపై న్యాయబద్ధంగా పోరాడతామని, వందలాది చేనేత కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తి బాధ్యతలను నూతన పాలక వర్గానికి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా అధికారులు సంపూర్ణ మద్దతు తెలిపి సహకరించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలకు వెనుకాడబోమని హెచ్చరించారు.ఈ మహాసభలో సంఘ ప్రధాన కార్యదర్శి లగిశెట్టి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు గంగుల గణేష్, కోశాధికారి బొజ్జ నరేందర్, సహాయ కార్యదర్శి పులుగం కిష్టయ్య, డైరెక్టర్లు రాజగిరి వీరేశం, వైద్యుల లక్ష్మీనారాయణ, మేనేజర్ హనుమంతు, మాజీ చైర్మన్ వడ్లకొండ మల్లేశం,నందాల లక్ష్మీనరసు, రాజగిరి శ్రీనివాస్, గోనే శ్రీనివాస్, వైద్యుల నందకుమార్, గోనే రమేష్, బొజ్జ జగదీశ్వర్, మంగళపల్లి గోపాల్, లగిశెట్టి భాస్కర్, లగిశెట్టి సుధాకర్, హిమేందర్, చంద్రమౌళి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

- **సమాజ అభ్యున్నతికి ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్***

**సంగారెడ్డి, సెప్టెంబర్ 26:-వుదయం**



వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, శాసన సభ్యులు చింతా ప్రభాకర్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సామాజిక అన్యాయాలను ఎదురించి, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ఆమె ప్రదర్శించిన ధైర్యం, ఆత్మవిశ్వాసం, పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. వెనుకబడిన తరగతుల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, సహాయ అధికారులు అమర్ జ్యోతి, అమర్నాథ్, వసతి గృహ సంక్షేమ అధికారులు, టీఎన్జీవోస్ నాయకులు జావిద్ అలీ, రవి, రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్, జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ పాటిల్, జిల్లా రజక సంఘం అధ్యక్షులు నామాల నగేష్, యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కూర వేణుగోపాల్, వివిధ కుల సంఘాల నాయకులు ఆశన్న గౌడ్, ఇప్పపల్లి నరసింహులు, కుమ్మరి సాయిలు, మాణిక్యం, జై లాల్ నాయక్, గోరుకంటి రమేష్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు ఉన్న వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- **ప్రపంచ చెవిటి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరం**

**గద్వాల సెప్టెంబర్ 26 (వుదయం కరస్పాండెంట్)**

ప్రపంచ చెవిటి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవసరాలు ఉన్న వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించినట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సంధ్యా కిరణ్మయి తెలిపారు.జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో, సివిల్ జడ్జి నిషిక పోద్రుదే సమన్వయంతో శనివారం చెవిటి, మూగ విద్యార్థుల కోసం ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. జోగుళాంబ గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌లో ఈ శిబిరం జరిగింది. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన వైద్యురాలు డా. ప్రియాంకతో పాటు పారామెడికల్ సిబ్బంది శిబిరంలో పాల్గొని విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితిపై వైద్య సంప్రదింపులు అందించారు.



అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు, ఆరోగ్య సమస్యలను గుర్తించి తదుపరి వైద్య సేవలు పొందేందుకు సిబ్బంది తగిన సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

- **సర్పంచ్ స్వర్ణలత - సురేందర్ రెడ్డి**
- **తీగలకుంటపల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు**

**కోహెడ సెప్టెంబర్ 26 ( వుదయం ప్రతినిధి )**



తీగలకుంటపల్లి : తెలంగాణ వీరనారి, ధైర్యసాహసాలకు ప్రతీక, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను తీగలకుంటపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
రజక సంఘం అధ్యక్షులు జాలిగాం బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి, కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మ్యాకల స్వర్ణలత సురేందర్ రెడ్డి హాజరయ్యారు.

**ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..**

చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ముఖ్యంగా చాకలి/రజక సమాజం అభివృద్ధి, ఆత్మగౌరవం, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాగుల మహేష్, వార్డు సభ్యులు, రేవోజు శంకర్, మాజీ సర్పంచ్ మ్యాకల చంద్ర శేఖర్ రెడ్డి, రజక సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకు కిసాన్ సేవా సమితి తోడ్పాటు



- **దుబ్బాక జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉచిత బ్యాగుల పంపిణీ**
- **ముత్యంరెడ్డి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు**
- **జనవరి 1న కళాశాలకు కంప్యూటర్లు అందజేస్తానని హామీ**

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 26, వుదయం:**

విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకు చెరుకు ముత్యంరెడ్డి కిసాన్ సేవా సమితి తోడ్పాటునందిస్తుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు చెరుకు ముత్యం రెడ్డి జ్ఞాపకార్థం ఉచితంగా 583 బ్యాగులను పంపిణీ చేశారు. మాజీ మంత్రిగా ముత్యంరెడ్డి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, గ్రామీణ పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ కళాశాల బలోపేతానికి పాటుపడ్డారని కొనియాడారు. కళాశాలలో కంప్యూటర్లు, మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తన దృష్టికి తీసుకురావడంతో జనవరి 1న చెరుకు ముత్యంరెడ్డి జయంతి సందర్భంగా కళాశాలకు మౌలిక వసతులతో పాటు కంప్యూటర్లను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు

## చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నివాళులు



**సంగారెడ్డి వుదయం**

చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పక్కన ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి జగదీష్, నాయకులు రామప్ప, నగేష్ ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

## చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**మరికల్ సెప్టెంబర్ ( 26 వుదయం ప్రతినిధి)**

మరికల్ ధన్వాడ మండల కేంద్రంలో లో మరియు ఎలిగండ్లగ్రామంలో శనివారం వీరనారి చాకలి ఐలయ్య ఫోటోకు పూలమాలలు వేసి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు మరియు ధన్వాడలో నారాయణపేట ఎమ్మెల్యే సలహాదారుడు చిట్టెం మాధవ రెడ్డి సమావేశంలో మాట్లాడుతూ చాకలి ఐలమ్మ రైతన్న ఇది నుంచి పోరాటం చేసిందని ఆయన గుర్తు చేశారు నిజాం కాలంలో ముందు నుండి రజాకారుల కు వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి ఆయన అన్నారు తర్వాత అన్నదాన కార్యక్రమాలు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రజకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# చాకలి ఐలమ్మ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్

**సూర్యాపేట**
**సెప్టెంబర్ 26 వుదయం ప్రతినిధి**

చాకలి ఐలమ్మ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూల మాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. భూమి కోసం, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన వీరోచిత పోరాటం యావత్ సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

సామాజిక న్యాయం, సమానత్వం, ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆమె జీవితం భావి తరాలకు మార్గదర్శకమని, ఆమె చూపిన తెగువను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు అందరూ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హాజరైన అధికారులు డీఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి డి. విశాల్, డీఎం అండ్ హెచ్ఓ వెంకటరమణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, డీఐఈఓ సులోచన రాణి, జీఎం ఇండస్ట్రీస్ భారతి, ఇతర కుల సంఘాల సభ్యులు, నాయకులు, జిల్లా అధికారులు, ఐడీఓసీ సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోషకాహారంతోనే చిన్నారుల ఆరోగ్య విద్యా వికాసం



**మధిర, సెప్టెంబర్,26, వుదయం, ప్రతినిధి:**

మధిర మున్సిపాలిటీ పరిధిలోని 21 వార్డ్ లో ఉన్న ఆర్.సి.యం చర్చ్ అంగన్వాడి కేంద్రంలో శనివారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు 21వార్డ్ కౌన్సిలర్ రంగా రూపా, ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది . పోషణ మాసోత్సవాలు లో భాగంగా శనివారం పూర్వ బాల్య సంరక్షణ మరియు విద్య ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. అలాగే పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు ధాన్యాలు పండ్లు కూరగాయలు మొదలైనవి ప్రదర్శన చేయడం జరిగింది గర్భిణీలకు పోషక విలువలకు సంబంధించి అవగాహన కల్పించడం జరిగింది పూర్వ బాల్య సంరక్షణ మరియు విద్య యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ఆరు సంవత్సరాల పిల్లలు శారీరక మానసిక సామాజిక అభివృద్ధిని మరియు ఆటపాటల ద్వారా విద్యను ఎలా అందించాలి అనే విషయాలపై సవివరంగా తెలియజేయడం జరిగింది . కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తల్లులు, చిన్నారి బాలబాలికలు,అంగన్వాడీ టీచర్స్ ఎం .ప్రశాంతి, ఎన్ అమృత పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం

**ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు**
**అనంతగిరి సెప్టెంబర్ 26 వుదయం**



తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత, ధైర్యసాహసాలకు ప్రతీక సాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అనంతగిరి మండల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు.వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన తెగువ, ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక అసమానతలను రూపుమాపి సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ టి యు 80 వసంతాల వైభవోత్సవం పోస్టర్ ఆవిష్కరణ




**చిలుకూరు, సెప్టెంబర్,26:(వుదయం)**

హైదరాబాదులో నేడు జరిగే ఎస్ టి యు 80 వసంతాల వైభవోత్సవాలకి మండలానికి సంబంధించిన ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని మండల అధ్యక్షులు సురగాని లింగయ్య, శనివారం పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్రానికి పూర్వమే ఉపాధ్యాయుల హక్కుల కోసం ఏర్పడ్డ సంఘం ఎస్టీయూ అని..ఎస్టియు జరిపిన అనేక ఉద్యమాలతోనే ఉపాధ్యాయులకి మేలు జరిగే ఎన్నో జీవోలు పిఆర్సిలు డిఏలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమంలో, గుండు ఆదినారాయణ బాల బోయిన పవన్ ఎలగొండ శ్రీనివాస్ మాదా సామ్సన్ శ్యామ్ సుందర్ గురువారెడ్డి అనంత రామారావు కొండా రామాంజనేయులు రామ్ శెట్టి రామ నరసయ్య కంపసాటి కృష్ణ దొంగరీ శ్రీను కొండ ధనమూర్తి దొంగరి వీరబాబు డివిఎల్ ప్రసాద్ కొండా వీరబాబు తదితరులు పాల్గొన్నారు,

## కృష్ణ మందిరం గణపతి లడ్డూ రూ 1,40,116

**దక్కించుకున్న 13వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణి–హనుమంతు దంపతులు**
**సత్తుపల్లి సెప్టెంబర్ 26 ( వుదయం ప్రతినిధి )**



సత్తుపల్లి పట్టణంలోని 13వ వార్డు కృష్ణ మందిరంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలం పాటలో 13వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణి - ఉప్పు హనుమంతరావు దంపతులు రూ.1,40,116/– లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ కి మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ ను గణపతి లడ్డూ ప్రసాదాన్ని అందజేసిన 113వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణి – హనుమంతరావు గణనాథుడి ఆశీస్సులతో ఉప్పు నాగమణి–హనుమంతు రావు దంపతుల కుటుంబం మరియు 13వ వార్డు జవహర్ నగర్ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## గోదావరి పాయలో చిక్కుకున్న 130 మంది వ్యవసాయ కూలీలు



**అప్రమత్తమైన అధికారులు..**
**పడవలతో సురక్షితంగా తరలింపు**
**చర్ల, సెప్టెంబర్ 26: (వుదయం ప్రతినిధి)**

చర్ల మండల పరిధిలోని వీరాపురం గ్రామం వద్ద గోదావరి పాయలో సుమారు 130 మంది వ్యవసాయ కూలీలు చిక్కుకోవడంతో కొద్దిసేపు తీవ్ర ఆందోళన నెలకొంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం వర్షం తెరపివ్వడంతో వ్యవసాయ పనుల నిమిత్తం కూలీలు గోదావరి పాయ దాటి పొలాలకు వెళ్లారు. అకస్మాత్తుగా గోదావరి నీటిమట్టం పెరగడంతో తిరిగి రావడానికి వీలులేక పాయలోనే చిక్కుకుపోయారు. విషయం గ్రామస్తులకు తెలియడంతో వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన అధికారులు గ్రామస్తుల సహకారంతో పడవలను రప్పించి సహాయక చర్యలు చేపట్టారు. కూలీలను ఒక్కొక్కరినీ పడవల ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో కూలీల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

**హెచ్చరికలు ఉన్నా.. గోదావరి గడ్డపైకి వెళ్లడం ఆందోళనకరం**

భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు ముందస్తుగా హెచ్చరిస్తున్నప్పటికీ, వ్యవసాయ పనుల కోసం కూలీలు ప్రాణాలను పణంగా పెట్టి గోదావరి పాయలు దాటి పొలాలకు వెళ్లడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఉపాధి కోసం వెళ్లడం కూలీలకు సాధారణ విషయమే అయినప్పటికీ, వరద పరిస్థితుల్లో వారి భద్రత అధికారులకు పెద్ద సవాలుగా మారుతోంది. గతంలో కూడా ఇసుక లారీ డ్రైవర్లు గోదావరి వరదల కారణంగా ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయని . ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులకు ప్రజలు సహకరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సహాయక చర్యల్లో తహసీల్దార్ శ్రీనివాస్, సిఐ రాజువర్మ, యస్సై నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఇర్ప వసంత్, సామాజిక కార్యకర్త ఎడారి శ్రీను తో పాటు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**చైర్మన్ కోడి శ్రీనివాసులు**
**చండూరు, సెప్టెంబర్ 26(వుదయం):**



తెలంగాణ నేలపై సామాజిక అన్యాయం, భూస్వామ్య దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఎర్రజెండా నీడన ధైర్యంగా నిలబడి పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. శనివారం చండూరు పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఐలమ్మ జయంతి వేడుకలను పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం చైర్మన్ మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలనకు, దొరల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ పోరాట పటిమ, ఆత్మగౌరవ పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన కృషి అమూల్యమైనదని మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్రను ప్రపంచానికి చాటిచెప్పిన ధీరవనిత ఐలమ్మ అని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం, కౌన్సిలర్లు తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్, జెల్ల ధనమ్మ శ్రీనివాస్, కొన్రెడ్డి మధు, కోడి సుష్మ వెంకన్న, కటకం రమేష్, కో–ఆప్షన్ సభ్యులు షేక్ ఖలీల్, షేక్ సలీమా షరీఫ్ పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ మేనేజర్ జి. రాములు, సీనియర్ అసిస్టెంట్ ఏ. సాయిభారద్వాజ్, జూనియర్ అసిస్టెంట్ ఎ. జగన్, సీనియర్ అకౌంటెంట్ పి. శృతి, వార్డు అధికారులు జి. శ్రీరాములు, బి. సాయిరాం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెరువు నిండి అలుగు పారడంతో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**మధిర, సెప్టెంబర్,26:**

మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరువు నిండి అలుగు పారుతూ జలకళ సంతరించుకున్న సందర్భంగా గంగమ్మ తల్లి, కట్ట మైసమ్మ తల్లికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సభ్యులందరూ కలిసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి,సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించారు. ఈ సందర్భంగా సభ్యుడు వేలివేల శ్రీధర్ మాట్లాడుతూ చాలా రోజులుగా వర్షాలు లేక రైతులు ఆందోళనకు గురయ్యారని, ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు నిండటంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారని అన్నారు. ఇలాగే సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ స్విమ్మర్స్ అసోసియేషన్ తరపున గంగమ్మ తల్లి, కట్ట మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చుక్కా రాంబాబు, పల్లపోతు ప్రసాదరావు, జంగా శ్రీనివాస్ రెడ్డి, ఊటుకూరి భాస్కరరావు, శీలం శ్రీనివాసరెడ్డి, గండూరి రాంబాబు, రావూరి రాము, ఆదూరి అబ్రహం, ఉప్పెర సాంబశివ రెడ్డి, షేక్ సుకుర్, గొల్లపల్లి శ్రీనివాస చారి,ఎస్‌బీఐ రాజశేఖర్ రెడ్డి, యరమల సాంబశివరెడ్డి, గుర్రాల జనార్దన్ రెడ్డి, ఏలూరు దుర్గాప్రసాద్, ఇన్‌స్టెల్ రాము,మాచర్ల శ్రీనివాసరావు, పిల్లి నరసింహారావు, కంచిపోగు ఆదాం,ఒట్టే సైదులు, కొత్తూరు నరసింహారావు, కోలా ప్రసాద్, శాఖమూడి బ్రహ్మయ్య, ఆళ్ల ప్రసాద్, ఫైర్ పిచ్చిరెడ్డి, జనగాం వెంకన్న, లింగాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్26 (వుదయం ప్రతినిధి):**

దేశ రాజధానిలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భవన్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ శశాంక్ గోయల్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ విముక్తి పోరాటంలో ఆమె ప్రదర్శించిన తెగువ, పోరాట పటిమను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రాయోజిత పథకాల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్‌తో పాటు తెలంగాణ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆమెకు పుష్పాంజలి ఘటించారు.

## దుద్దెపూడిలో పోషణ మాసం, ఈసీసీఈ డే కార్యక్రమం



**సత్తుపల్లి సెప్టెంబర్ 26 ( వుదయం ప్రతినిధి)**

ఐసిడిఎస్ సత్తుపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని దుద్దెపూడిలో పోషణ మాసం ఈసీసీఈ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈసీసీఈ డే అనగా 1ఎర్లీ చైల్డ్ వుడ్ &కేర్ ఎడ్యుకేషన్ పాఠశాలకు వెళ్లేముందే పిల్లలకు ఆట, పాట, కథ, సృజనాతమాకత కార్యక్రమాలు చేయించుట శాస్త్రియాపరిజ్ఞనము గురించి పరిసయము చేయూట ఈ నెలలో పిల్లలతో చేయించిన కార్యక్రమాలు తల్లులకు చెప్పటం పుట్టిన 5 సంవత్సరాలు లోపు పిల్లలకు మైండ్ డవలప్ మెంట్ 90% ఉంటుంది పాటలు కథ భాషభిహూర్ధి మేధోశక్తి ఆటలు ద్వారా చిన్న కాండరాలు పెద్ద కాండరాలు అభివృద్ధి, పూర్వగణీత్, పూర్వపాఠానా నేర్చు కంటారని, సృజనతామాకాతా కార్యక్రమంలో భాగంగా పూసలు గుచ్చుటా వలన పిల్లవానికి కంటికి చేతికి సమన్వయము, శాస్త్రీయ పరిజ్ఞానంలో రెండు అద్దాలు ఎదురుగా పెట్టి పిల్లలను చూడమనాలి చూస్తే అనేక ప్రతిబింబాలు కనపడతాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత రాణి తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ అనసూయ ఉప సర్పంచ్ శ్రీధర్ తల్లులు, పిల్లలు, అంగన్వాడీ టీచర్స్ భారతి, రాణి, సుజాత, ఏఎన్ఎం సుమలత, ఆశ వర్కర్ పాల్గొన్నారు.



## వీధి కుక్కల బెడదకు చెక్ : కుక్కలను పట్టించిన గ్రామ సర్పంచ్

**చింతకాని, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి ):**

మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో గత కొన్ని రోజులుగా,ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వీధి కుక్కల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి , ఉపసర్పంచ్ గాదె రామారావు ప్రత్యేక చొరవ తీసుకుని, డాగ్ క్యాచర్స్ సహాయంతో గ్రామంలోని వీధి కుక్కలను పట్టించారు. ఇటీవల కాలంలో గ్రామంలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలపై, రాత్రి వేళల్లో ఇళ్లకు వెళ్లే వాహనదారులపై వీధికుక్కలు దాడులు చేస్తుండటంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు సర్పంచ్ దృష్టికి తీసుకరావడం జరిగింది. గ్రామ ప్రజల మేలుకోరి కుక్కల సమస్యను తీవ్రతను గుర్తించిన, సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రత్యేక సిబ్బందిని గ్రామానికి రప్పించారు. గ్రామ వీధుల్లో తిరుగుతున్న కుక్కలను సురక్షితంగా బంధించి, వాటిని సురక్షిత ప్రాంతానికి లేదా గ్రామాలకు దూరంగా తరలించాలని డాగ్ క్యాచర్స్ కి సూచించారు. సర్పంచ్ ఉప సర్పంచ్ గాదె నాగలక్ష్మి రామారావు లను గ్రామ ప్రజలు అభినందించారు.



## చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**చిలుకూరు సెప్టెంబర్ 26:(వుదయం)**

మండల కేంద్రంలో శనివారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ యొక్క కార్యక్రమం భాగంగా వృద్ధులకు వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పుట్టపాక అంజయ్య మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పి, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత.. చాకలి ఐలమ్మ అని మాట్లాడారు, ఈ కార్యక్రమములో ,బి సి హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య, ఉపాధ్యక్షులు సిరాపురపు శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా నాయకులు షేక్ సాయిబెల్లి, డాక్టర్ గంగాధర్, చిలువేరు ఆంజనేయులు.హుస్సేన్,ముత్తరెడ్డి,వెంకటి,సోమయ్య, ముక్క ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు,



## ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**మధిర, సెప్టెంబర్ ,26, వుదయం, ప్రతినిధి:**

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మధిరలోని ఆమె విగ్రహానికి మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, పేదల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్మరణీయమని, ఆమె ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఆమె చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణ గుప్తా, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, సాలిక సురేష్, కాంగ్రెస్ నాయకులు అల్లాడి గోపాల్రావు, మోదుగు బాబు, మైలవరపు చక్రి, దోర్నాల సునీల్, బాడిస రవి, గాలి ప్రసాద్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**మధిర, సెప్టెంబర్, 26, వుదయం, ప్రతినిధి:**

టివిఎం హైస్కూల్ లో మధిర మండల స్థాయి విద్యార్థుల క్రీడా పోటీలను మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయి పోటీలకు ఎంపికై మధిరకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జాకీర్ హుస్సేన్, మైలవరం చక్రి, దోర్నాల సునీల్, బాడిస రవి, గాలి ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు వై. చిన్ని, బి. చైతన్య, ఎం. జమలయ్య, వేణు, నరసింహారావు, షటిల్‌బ్యాడ్మింటన్ కోచ్ ఇన్‌చార్జి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**మర్రిగూడ, సెప్టెంబర్ 26(వుదయం):**



తెలంగాణ నేలపై సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం భూస్వామ్య వ్యవస్థకు ఎదురొడ్డి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మర్రిగూడ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను స్థానికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ... అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమ సమాజానికి నిరంతరం స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక రజక సంఘం నాయకులు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం పార్టీ నాయకులు వెంకటంపేట బాలయ్య, పగడాల లింగయ్య, యాదయ్య, రాందాస్, శ్రీనివాస్, పందుల రాములు గౌడ్, పాత్రోత్ రాజేంద్ర నాయక్, పిట్టల శ్రీనివాస్, మాస శేఖర్, పగడాల రఘులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మధిరకు అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులకు స్థల సేకరణ పరిశీలన

**మధిర, సెప్టెంబర్,26,వుదయం, ప్రతినిధి:**



మధిర పట్టణంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో మంజూరైన అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులకు సంబంధించి స్థల సేకరణ, ఇతర ప్రాథమిక పనులను మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు,సిబ్బంది, కౌన్సిలర్లు పరిశీలించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి శివాలయం వరకు, రాయపట్నం సెంటర్ నుంచి మసీదు వరకు, రాయపట్నం సెంటర్ నుంచి రైల్వే గేట్ సెంటర్ వరకు చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడంతో పాటు రహదారులపై విద్యుత్ వైర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కేబుల్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ, పనుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలను సేకరించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ రామకృష్ణ, ఏఈ వంశీ, మధిర ఏడీ అనురాధ, ఏఈ అనిల్ కుమార్, ఎల్ఐ నారాయణతో పాటు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మిర్యాల వెంకట రమణ గుప్తా, కౌన్సిలర్లు వెంకట్రావు, మోదుగు నాగలక్ష్మి , బాబు, రషీదుద్దీన్, నకిరికంటి రాజేశ్వరి, సాలిక సురేష్, మోదుగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి



**మున్సిపల్ చైర్ పర్సన్ సుజాత రామనాథం**
**మధిర, సెప్టెంబర్ 26, వుదయం, ప్రతినిధి:**

ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం ఆకాంక్షించారు. మధిర18 వవార్డు లడక బజార్ లో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన గణపతి అభిషేకాలు,గణపతి హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలగణేష్ యూత్ వారు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.13వ రోజు వినాయక విగ్రహం వద్ద వినాయక ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేయడంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణపతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యదేవర కోటేశ్వ రరావు,మట్టూరి రాజా, చేబ్రోలుభాస్కరరావు,కూరపాటి శ్రీను, ఎర్ర శ్రీనివాసరావు, గరీన నగేష్,మట్టూరి అరవింద్, బాహటం వెంకటేశ్వరరాజు, ముల్లంగిభాను,కాంతాల రవి పాల్గొన్నారు.




"ఓటుబ్యాంకు రాజకీయాల స్వార్థాన్ని వీడి, సమాజంలో సానుకూల మార్పులు తెచ్చే సామాజిక సంస్కరణల వైపే మన అడుగులు పడాలి. గ్రామీణ ఉపాధి, మహిళల స్వయం సమృద్ధి మరియు బలీయమైన మౌలిక వసతులే నవ భారత నిర్మాణానికి బలమైన పునాదులు.ఒకవైపు స్వదేశీ తయారీని, పెట్టుబడులను ప్రోత్సహించే 'మేక్ ఇన్ ఇండియా'తో ఆర్థిక పురోగతిని సాధిస్తూ... మరోవైపు గాంధీజీ చూపిన మార్గంలో సామాజిక దురాచారాలను తుడిచిపెట్టాలి. రాజకీయ ప్రయోజనాల కంటే దేశాభివృద్ధే పరమావధిగా ముందుకు సాగుదాం!"

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

## వే'మన' పద్యం

**అన్నమిడుటకన్న అధిక దానంబుల**
**నెన్ని చేయనేమి యెన్నబోరు**
**అన్నమెన్న జీవనాధారమగునయా**
**విశ్వదాభిరామ వినురవేమ.**



## సంపాదకీయం

# వికసిత్ భారత్ బ్యాంకుల పాత్ర

భారత ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థలో రాబోతున్న భారీ మార్పులు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ పరిణామాలు కోట్లాది మంది సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు, మధ్యతరగతి వర్గాలు మరియు చిన్నమధ్యతరహా పరిశ్రమల భవిష్యత్తుతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్నాయి. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యసాధనలో బ్యాంకింగ్ రంగం నిర్వర్తించాల్సిన పాత్రపై అధ్యయనం చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. దీనికి అనుగుణంగా నిర్వహించిన ఉన్నతాధికారుల సమావేశంలోనూ, అలాగే ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఐదు బ్యాంకుల్లో కనీసం ఒక్కటైనా భారతీయ బ్యాంకు ఉండాలంటూ ప్రధాని చేసిన ప్రసంగంలోనూ రాబోయే సంస్కరణల దిశ స్పష్టమైంది. అయితే, బ్యాంకుల పరిమాణాన్ని పెంచడం మరియు ఆర్థిక వ్యవస్థను విస్తరించడం ప్రాధాన్యంగా మారిన వేళ, సామాన్యుల పొదుపునకు భద్రత కల్పించడం, వ్యవసాయం మరియు చిన్న తరహా పరిశ్రమలకు చౌకగా రుణాలు అందించడం వంటి ప్రాథమిక లక్ష్యాలు పక్కకు పోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.సామాన్యుల పొదుపుపై దెబ్బ.. ఎన్‌బిఎఫ్‌సిల గుత్తాధిపత్యంప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉండే డిపాజిట్లలో అధిక భాగం సామాన్య ప్రజలు, ఉద్యోగులు మరియు విశ్రాంత ఉద్యోగులు తమ భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్మే. ప్రస్తుతం పొదుపు ఖాతాలపై బ్యాంకులు ఇస్తున్న వడ్డీ రేట్లు ద్రవ్యోల్బణం కంటే చాలా తక్కువగా ఉండటంతో సామాన్యుడి దాచినా డబ్బు విలువ రోజురోజుకూ క్షీణిస్తోంది. మరోవైపు ప్రాధాన్యతా రంగాలకు నేరుగా చౌక వడ్డీకి రుణాలు ఇవ్వాల్సిన బ్యాంకులు, ఆ నిధులను పెద్ద ఎత్తున నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు మళ్లిస్తున్నాయి. ఆ సంస్థలు అదే డబ్బును సామాన్యులకు, నిరుపేదలకు 20 నుండి 30 శాతం వరకు అత్యధిక వడ్డీలకు అప్పులుగా ఇస్తూ భారీగా లాభపడుతున్నాయి. బ్యాంకులే నేరుగా తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే అవకాశమున్నా, మధ్యవర్తిత్వ సంస్థలను ప్రోత్సహించడం వల్ల సామాన్య కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. దీనికితోడు ఖాతాల్లో కనీస నిల్వలు లేవనే నెపంతో నిరుపేద ఖాతాదారుల నుండి పెనాల్టీల రూపంలో వేల కోట్ల రూపాయలను వసూలు చేయడం తీవ్ర అన్యాయమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఉద్యోగాల భర్తీలో తీవ్ర నిర్లక్ష్యం.. పెరిగిన అభద్రత ప్రభుత్వ రంగ సంస్థలు ఇతర యాజమాన్యాలకు ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత ఉంది. కానీ ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులను నియమించకుండా తాత్కాలిక, కాంట్రాక్టు మరియు అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనులు కానిచ్చేస్తున్నారు. వీరికి సరైన వేతనాలు గానీ, ఉద్యోగ భద్రత గానీ లభించడం లేదు. బ్యాంకింగ్ రంగంలో లక్షలాది శాశ్వత ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దూరం అవుతున్నాయి. ఖాళీగా ఉన్న పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తే యువత కొనుగోలు శక్తి పెరిగి, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంది.కార్పొరేట్ రుణాల మాఫీ.. శ్రమదోపిడీకి చట్టబద్ధతమొండి బాకీలను సమర్థవంతంగా వసూలు చేస్తామని తీసుకొచ్చిన ఇన్సాల్వెన్సీ చట్టాలు, ట్రిబ్యునళ్లు చివరకు పెద్ద కంపెనీల రుణాలను రద్దు చేయడానికే ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బడా కార్పొరేట్ కంపెనీలు చెల్లించాల్సిన వేల కోట్ల రూపాయల బాకీలలో 90 శాతానికి పైగా రద్దు చేస్తూ, కేవలం స్వల్ప మొత్తాన్ని మాత్రమే వసూలు చేసుకుంటున్నాయి. ఇప్పటివరకు రద్దు చేసిన రూ.18 లక్షల కోట్ల మొండి బాకీలు ప్రజాధనమే తప్ప మరొకటి కాదు. సామాన్యుల పన్నుల సొమ్ము, బ్యాంకింగ్ సిబ్బంది శ్రమ వల్ల సమకూరిన లాభాలు ఈ విధంగా కార్పొరేట్ శక్తుల పాలవుతున్నాయి. అదే సొమ్మును వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమలకు ఇచ్చి ఉంటే దేశంలో ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థిక రంగం నిలకడగా అభివృద్ధి చెందేది.ప్రజా ప్రయోజనాలే పరమావధి కావాలి: బ్యాంకింగ్ రక్షణకు పిలుపుప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రైవేటు వ్యక్తుల ప్రాతినిధ్యం పెంచడం, విదేశీ పెట్టుబడుల పరిమితిని పెంచే దిశగా అడుగులు వేయడం దేశ ఆర్థిక స్థిరత్వానికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. విదేశీ పెట్టుబడులు ఎల్లప్పుడూ లాభాపేక్షతోనే పనిచేస్తాయి కాబట్టి, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు మారినప్పుడు ఆ పెట్టుబడులు వెనక్కి మళ్ళి వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. బ్యాంకులు కేవలం లాభాలు ఆర్జించే యంత్రాలు కావు, అవి ప్రజల ఆస్తులు. సంస్కరణల పేరుతో ప్రజల పొదుపును, దేశ వనరులను విదేశీ మరియు కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికిని, సామాన్యుల హక్కులను కాపాడుకోవడానికి బ్యాంకు ఉద్యోగ సంఘాలు చేపడుతున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాల్సిన సమయం ఆసన్నమైంది.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పేజీకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# పైకి డప్పులు...లోన అప్పులు

రియాలిటీలో భారత్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకపోయినా.. ఊహల్లో మాత్రం తామే 'సూపర్ పవర్' అని నిరూపించుకోవడానికి పాకిస్థాన్ పడే తాపత్రయం చూస్తే ఎవరికైనా నవ్వాగదు. తాజాగా పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ (పీఏఎఫ్) తమ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసిన ఒక వీడియో చూసి నెటిజన్లు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకుంటున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మైండ్ బ్లాంక్ అయిన పాక్ దళాలు, ఇప్పుడు వాస్తవ యుద్ధ రంగాన్ని వదిలేసి 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) లోకం వైపు అడుగులు వేశాయి.

ఆ వీడియోలో పాక్ క్రియేటివిటీ మామూలుగా లేదు. ఏకంగా 32 భారత వైమానిక దళ (ఐఏఎఫ్) స్థావరాలపై దాడులు చేసినట్లు రెండు అత్యాధునిక S400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లను పేల్చేసినట్లు చివరకు భారత పార్లమెంట్ భవనాన్ని కూడా ధ్వంసం చేసినట్లు ఓ రేంజ్‌లో గ్రాఫిక్స్ రూపొందించారు. హాలీవుడ్ రేంజ్ లో సీన్లు క్రియేట్ చేసినప్పటికీ అవి నిజమైన దృశ్యాలు కావు అని.. ఏఐ జనరేటెడ్ వీడియోలని పసిగట్టడానికి నెటిజన్లకు ఎక్కువ సమయం పట్టలేదు.

ఈ ఆర్టిఫిషియల్ డ్రీమ్స్ పై భారత నెటిజన్లు సెటైర్ల వర్షం కురిపిస్తున్నారు. "రియల్ లైఫ్‌లో గెలవలేక డిజిటల్ లైఫ్‌లో సర్దుకుంటున్నారు" అని ఒకరంటే "పాకిస్థాన్ తమ పగటి కలలను కూడా ఏఐ టెక్నాలజీతో రమోట్ చేసుకుంటోంది" అని మరొకరు కామెంట్ చేశారు.

రియల్ లైఫ్‌లో గెలవలేక డిజిటల్ లైఫ్‌లో సర్దుకుంటున్నారు" అని ఒకరంటే "పాకిస్థాన్ తమ పగటి కలలను కూడా ఏఐ టెక్నాలజీతో ప్రమోట్ చేసుకుంటోంది" అని మరొకరు కామెంట్ చేశారు.

మరోపక్క పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్‌కు యూఏఈ షాకిచ్చింది. తమ దగ్గర తీసుకున్న అప్పును పూర్తిగా, అది కూడా వెంటనే చెల్లించాలని కోరింది.

దీంతో ఈ నెలలోనే యూఏఈ అప్పు తీర్చేందుకు పాక్ సిద్ధమైంది. మొత్తం 3.5 బిలియన్ డాలర్ల అప్పును యూఏఈకి పాకిస్తాన్ ఈ నెలలోనే చెల్లించబోతుంది.

మ రో ప క్క పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్‌కు యూఏఈ షాకిచ్చింది. తమ దగ్గర తీసుకున్న అప్పును పూర్తిగా, అది కూడా వెంటనే చెల్లించాలని కోరింది. దీంతో ఈ నెలలోనే యూఏఈ అప్పు తీర్చేందుకు పాక్ సిద్ధమైంది. మొత్తం 3.5 బిలియన్ డాలర్ల అప్పును యూఏఈకి పాకిస్తాన్ ఈ నెలలోనే చెల్లించబోతుంది. ఒకవైపు అంతర్జాతీయ రిజర్వ్స్ తక్కువగా ఉన్నా, మరోవైపు ఐఎంఎఫ్ నుంచి ఒత్తిడి ఉన్నా.. పాక్ తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు తీర్చేయబోతుంది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్‌కు యూఏఈ షాకిచ్చింది. తమ దగ్గర తీసుకున్న అప్పును పూర్తిగా, అది కూడా వెంటనే చెల్లించాలని కోరింది. దీంతో ఈ నెలలోనే యూఏఈ అప్పు తీర్చేందుకు పాక్ సిద్ధమైంది.

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్‌కు యూఏఈ షాకిచ్చింది. తమ దగ్గర తీసుకున్న అప్పును పూర్తిగా, అది కూడా వెంటనే చెల్లించాలని కోరింది. దీంతో ఈ నెలలోనే యూఏఈ అప్పు తీర్చేందుకు పాక్ సిద్ధమైంది. మొత్తం 3.5 బిలియన్ డాలర్ల అప్పును యూఏఈకి పాకిస్తాన్ ఈ నెలలోనే చెల్లించబోతుంది. ఒకవైపు అంతర్జాతీయ రిజర్వ్స్ తక్కువగా ఉన్నా, మరోవైపు ఐఎంఎఫ్ నుంచి ఒత్తిడి ఉన్నా.. పాక్ తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు తీర్చేయబోతుంది. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం కారణంగా యూఏఈ కూడా ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటుంది. దీంతో తమ బాకీ చెల్లించాలని పాక్‌ను కోరింది. దీనికి పాకిస్తాన్ కూడా అంగీకరించింది. ఈ నెల 11న 450 మిలియన్ డాలర్లు, 17న 2 బిలియన్ డాలర్లు, 23న బిలియన్ డాలర్లను పాక్ చెల్లించేందుకు అంగీకరించింది. సెంట్రల్ బ్యాంకుకు చెందిన 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వల నుంచి ఈ నిధులను పాక్ చెల్లించబోతుంది. ఈ అప్పుల్లో మూడు దశాబ్దాల నాటి అప్పు కూడా ఉండటం విశేషం. 199697లో పాకిస్తాన్ 450 మిలియన్ డాలర్లను అప్పుగా తీసుకుంది. అప్పట్లో ఒక సంవత్సర కాల పరిమితితో ఈ అప్పు తీసుకుంది. అయితే, ఇంతవరకు చెల్లించలేదు. ఈసారి మాత్రం చెల్లించబోతుంది. నిజానికి పాకిస్తాన్‌కు ఇచ్చిన అప్పు కాల పరిమితిని పొడిగించాలని ఇటీవల యూఏఈ నిర్ణయించింది. దీనిపై ఇంకా సంప్రదింపులు జరుగుతున్నాయి. కానీ, ఈలోగానే ఇరాన్ యుద్ధం ప్రారంభమవ్వడంతో యూఏఈ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. డబ్బులు చెల్లించాలని పాక్‌ను కోరింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్తాన్‌కు యూఏఈ సహా అమెరికా, చైనా, సౌదీ అరేబియా వంటి దేశాలు సహాయం అందిస్తున్నాయి. ఐఎంఎఫ్ నుంచి పాకిస్తాన్‌కు నిధులు అందేలా చూస్తున్నాయి. ఆయ దేశాలు కూడా అప్పులు ఇస్తున్నాయి. పాక్ ఆర్టిఫిషియల్ డ్రీమ్స్ పై ఇక సోషల్ మీడియా ట్రోలర్స్ అయితే ఒక అడుగు ముందుకేసి, "వీడియో క్రియేట్ చేయడానికి వాడిన ఏఐ టూల్స్ క్రెడిట్ల కోసం కూడా తుర్కియేనో, సౌదీ అరేబియానో వెళ్లి అప్పు తెచ్చుకున్నారా?" అంటూ మీమ్స్‌తో ఆడుకుంటున్నారు.



నండూరి రవిశంకర్
సీనియర్ జర్నలిస్ట్,
9912483642

# భూమాత జీవనాడులు జీవనదులు

భూగ్రహ జీవనాడులుగా జీవనదులు భూమాత ఉపరితలంపై నిరంతరం ఏరులై పారుతూనే ఉన్నాయి. పర్యావరణంలో అతి ప్రధానమైన వనరులుగా జీవ నదులు ప్రాణికోటికి విశిష్ట సేవలను అందిస్తున్నాయి. నదులు ప్రవహించే జలాలు మాత్రమే కాదు, భూమండల గుండె సవ్వడులు. ఈ పుణ్య నదులు ధరణికే ప్రాణమిచ్చే వరాలు. పృథ్వీపై నెలకొన్న సహజ నదులు దేవుడిచ్చిన అపూర్వ వరప్రసాదాలు. జీవనదులు బిలియన్ల మానవాళికే కాదు సకల జీవకోటికి అవసరాలకు తాగు నీటిని, ఆహారాన్ని, జీవనోపాధులను కల్పిస్తున్నాయి. నదీ తీరాలు మానవ వికాస కేంద్రాలు, ఆవాస క్షేత్రాలు. ప్రపంచవ్యాప్త జీవవైవిధ్య పునరుద్ధరణతో పాటు సంరక్షణ భాధ్యతలను తీసుకుంటున్నాయి. సువిశాల భారత దేశ పుణ్య భూమిపై ప్రవహిస్తున్న గంగా, గోదారి, యమున, నర్మద, సింధు, మహానది, కావేరి లాంటి జీవనదులు దేవతలుగా పూజించబడుతున్నాయి.

**నదీజలాల ప్రాధాన్యం:**

నదీజలాలు పరమ పవిత్రం, దైవంతో సమానం. నదీజలాలు ఒక సాధారణ సహజ వనరులు మాత్రమే కాదని, అవి ప్రకృతి బహుకరించిన ప్రాణాలు నిలిపే పవిత్ర సంపద అని నమ్మాలి. ఏ దేశంలోనైనా నదులు జీవకోటికి తాగు నీటిని ఇవ్వడమే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు, ఉపరితల రవాణా రంగాలకు ఊపిరిగా నిలుస్తున్నాయి. నీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'జల శక్తి మంత్రిత్వ శాఖ'ను కూడా ఏర్పాటు చేసి పలు నదుల పరిరక్షణ చర్యలను తీసుకుంటున్నాయి. గత ఐదు దశాబ్దాలుగా మంచి నీటి వనరుల్లో జీవించే జీవరాశుల్లో దాదాపు 83 శాతం వరకు కనుమరుగా అయ్యాయని తెలుస్తున్నది. నేటి డిజిటల్ యుగంలో మారుతున్న జీవనశైలి, జీవన విలువల నడుమ నదుల పరిరక్షణ యజ్ఞానికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. నదీ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల తలనొప్పి, నదీజలాల దుర్వినియోగం, అర్థరహిత డ్యామ్‌ల నిర్మాణం, జలాల అక్రమ తరలింపు, వాతావరణ ప్రతికూల మార్పులు, స్వార్థానికి నదీమతల్లిని వెన్నుపోటు పొడవడం, అక్రమ మైనింగ్, అడవుల నరికివేత, ఆహార అభద్రత, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం, ప్రణాళిక రహిత పట్టణీకరణ, నదీజలాల పరిరక్షణ చట్టాల ఉల్లంఘనలు లాంటి కార్యకలాపాలతో నదీజలాలు పలుచబడడం లేదా గరళ కేంద్రాలుగా మారడం కొనసాగుతున్నది.

**ఆరోగ్యకరమైన నదులు, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు:** నదీ జలాల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడానికి ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు 1980 నుంచి ప్రతి ఏట సెప్టెంబర్ నాలుగవ ఆదివారం, అనగా 27 సెప్టెంబర్ 2026 రోజున ప్రపంచవ్యాప్తంగా "ప్రపంచ నదుల దినం" లేదా "వరల్డ్ రివర్స్ డే" వేడుకలను నిర్వహించడం జరుగుతున్నది. 2026 ప్రపంచ నదుల దినం ఇతివృత్తంగా "నదులు లేనిదే అడవులు, నీరు, జీవరాశులు లేవు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించుట జరుగుతోంది. నీటి కాలుష్య కట్టడి, నీటిని వ్యాపారంగా మార్చే ప్రైవేట్ రంగాల రెక్కలు విరవడం, నదీ జలాల దుర్వినియోగాలను అరికట్టడం, వ్యర్థాలను నదుల్లో కలుగకుండా అడ్డుకట్ట వేయడం, శుద్ధ జలాల సంరక్షణ, నదీ తీరాల దురాక్రమణలను వ్యతిరేకించడం, వాటర్ షెడ్ నిర్మాణాలు చేపట్టడం, నదుల జీవవైవిధ్యాలను కాపాడడం లాంటి చర్యలు తీసుకోవడం ద్వారా నదుల పునరుద్ధరణ జరిగి పూర్వపు శుద్ధ జలాలు తిరిగి జరజరా వాగులై, ఏరులై, నదులై నవ్వుతూ ప్రవహిస్తాయి. భూమిని ఒక పవిత్ర సహజ పుట్టినిల్లుగా చూసుకోవడం మనందరి కనీస కర్తవ్యం. నదుల పరిరక్షణతో సుస్థిరాభివృద్ధి ముడిపడి ఉంటుంది. ప్రపంచ మానవాళి ఐక్యతతో మానవ హారం పడితేనే శుద్ధ నదీజలాల పునర్వైభవం సుసాధ్యం అవుతుంది. నదుల పరిరక్షణ అంటే మానవాళి మనుగడను కాపాడుకోవడమే అని భావించాలి. కాలుష్య నదీజలాలు మానవ జాతికే కాకుండా జీవకోటి ఉనికికే పెను ప్రమాదాలని గుర్తుంచుకోవాలి. ప్రపంచ నదుల దినం వేదికగా నదీ జలాల శుద్ధి, అక్రమ డ్యామ్‌ల నిర్మాణాలను వ్యతిరేకించడం, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, నదుల అంశంలో పోటీల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు లాంటివి పెద్ద ఎత్తున నిర్వహించి రాబోయే తరానికి సరైన తాగు నీటి వనరులను అమూల్య బహుమతులుగా అందిద్దాం, పవిత్ర నది మాతలకు నిత్యం ప్రణమిల్లుదాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# ధర్మపురిలో గుబాళించిన భక్తి భావ పరిమళాలు

దక్షిణ కాశీగా, హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న పుణ్యభూమి ధర్మపురిలో తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మిక పీయూష ధారలు వెల్లువెత్తాయి. పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసిన ఈ ప్రాచీన క్షేత్రం నిత్యమూ వేదఘోషలు, ప్రణవ నాదాలు, మంత్రోచ్చారణలు, మంగళ తూర్యవాయిద్యాల సమ్మేళనంతో సనాతన సంస్కృతికి ప్రతీకగా భాసిల్లుతోంది. త్రేతాయుగంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన లింగమూర్తిగా ప్రశస్తి గాంచిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో, శ్రీ శారదా మహిళా మండలి మరియు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమద్భాగవత సప్తాహ పురాణ ప్రవచనాలు భక్తజన హృదయాలను భక్తిరస తరంగాలలో ఓలలాడించాయి. సంస్కృతాంధ్ర పండితులు, వ్యాకరణ వేదాంత విశారదులు, ప్రసిద్ధ పౌరాణికులు బ్రహ్మశ్రీ నీలకంఠ శర్మ సనాతన ఆర్ష సంప్రదాయ రీతిలో భాగవత పురాణాన్ని ప్రవచించగా, ఉదయం, సాయంత్రం వేళల్లో జరిగిన ఈ ఆధ్యాత్మిక సదస్సులకు పరిసర గ్రామాల నుండి సైతం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి శ్రద్ధాభక్తులతో శ్రవణం చేశారు.

భారతీయ జ్ఞాన విజ్ఞాన సర్వస్వంలో పురాణ వాఙ్మయానికి అత్యున్నత స్థానం ఉంది. వేదాలు ప్రభుసమ్మితాలుగా ఆజ్ఞాపిస్తే, స్మృతులు మిత్రసమ్మితాలుగా హితవు పలికితే, పురాణాలు కాంతాసమ్మితంగా రమణీయమైన కథారూపంలో మానవ హృదయాలకు పరమోన్నత ధర్మ సూక్ష్మాలను చేరవేస్తాయి. వేదవ్యాస భగవానుడు మహాభారత రచనానంతరం కూడా చిత్తశాంతి లభించక పరితపిస్తున్న వేళ, నారద మహర్షి ఉపదేశంతో ఆవిర్భవించిన పరమ పవిత్ర గ్రంథ రాజమే శ్రీమద్భాగవతం. అష్టాదశ పురాణాలలో తిలకం వంటిదై, పన్నెండు స్కంధాలు, మూడు వందల ముప్పై అయిదు అధ్యాయాలు, పద్దెనిమిది వేల శ్లోకాలతో అలరారే ఈ దివ్య ప్రబంధం భక్తి, జ్ఞాన, వైరాగ్యాల త్రివేణీ సంగమంగా విరాజిల్లుతోంది. 'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్న ఆర్యోక్తి ప్రకారం పండితుల పాండిత్యానికి, సాధకుల పరిపక్వతకు భాగవతమే గీటురాయిగా నిలుస్తుంది. భగవంతుని లీలావిశేషాలు, దివ్యావతారాల పరమార్థం, శరణాగతి తత్త్వం మేళవించిన భాగవతం కేవలం గ్రంథం కాదు, అక్షరరూప పరబ్రహ్మ స్వరూపమని సనాతన విశ్వాసం.

పురాణ ప్రవచనాలకు ధర్మపురి క్షేత్రంలో ఒక విశిష్టమైన చారిత్రక, సాంస్కృతిక వైభవం ఉంది. పూర్వం నుండి ఈ గడ్డ వేద విద్యాపీఠాలకు, మీమాంస శాస్త్ర చర్చలకు నిలయంగా నిలిచింది. పురాణ పారాయణం, ప్రవచనం కేవలం ఒక కళ మాత్రమే కాక, ప్రజల జీవన విధానాన్ని సన్మార్గంలో నడిపించే మహత్తర ప్రక్రియగా ఇక్కడి పండిత పరంపర కాపాడుకుంటూ వస్తోంది. ఆ ఉజ్జ్వల సంప్రదాయాన్ని పుణికిపుచ్చుకున్న బ్రహ్మశ్రీ నీలకంఠ శర్మ, తమ స్వక్షేత్రమైన ధర్మపురిలోనే ప్రప్రథమంగా భాగవత సప్తాహాన్ని



నిర్వహించి ఆబాలగోపాలాన్ని భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. తొమ్మిది రోజుల పాటు సాగిన ఈ ప్రవచనామృతంలో ప్రథమ స్కంధం మొదలుకొని ద్వాదశ స్కంధం వరకు గల తాత్త్విక సారాంశాన్ని ఆయన రసోచితంగా వివరించారు. పరీక్షిత్తు మహారాజు శుకమహర్షిని ఆశ్రయించి ముక్తి మార్గాన్ని అన్వేషించిన విధం, మరణభయాన్ని అధిగమించేందుకు భాగవత శ్రవణం ఎంతటి దివ్యౌషధమో నిరూపించిన ఘట్టాలను శర్మ గారు హృద్యంగా ఆవిష్కరించారు.

భాగవతంలోని ప్రతి ఘట్టం మానవ జీవన వికాసానికి దిక్సూచి వంటిది. సంసార చక్రంలో కొట్టుమిట్టాడే అజామిళుడు అంత్యకాలంలో నారాయణ నామోచ్చారణ మాత్రంచేతనే ముక్తిని పొందిన వృత్తాంతం ద్వారా భగవన్నామ సంకీర్తన మహత్యాన్ని ప్రవచనకర్త విశ్లేషించారు. కఠిన ప్రతికూలతలు, హిరణ్యకశిపుని వంటి క్రూర రాక్షసుని ఆటంకాలు ఎదురైనా 'హరియే సర్వోన్నతుడు' అని చాటిన ప్రహ్లాదుని నిశ్చల భక్తి, ఆత్మసమర్పణ నేటి సమాజానికి ఆదర్శప్రాయమని ఉద్ఘాటించారు. సంసార సంకెళ్లలో చిక్కుకున్న గజేంద్రుడు సర్వశక్తులూ క్షీణించిన వేళ చేసిన 'లావొక్కింతయు లేదు' అన్న ఆర్త ప్రార్థన, దానికి స్పందించి వైకుంఠం నుండి పరుగున వచ్చిన శ్రీమహావిష్ణువు లీలావైభవం భక్తుల చేత కంటతడి పెట్టించాయి. పట్టుదలకు, నిశ్చల తపోదీక్షకు ప్రతీకగా నిలిచే ధ్రువుని చరిత్ర, బలి చక్రవర్తి త్యాగనిరతి, వామనావతార వైశిష్ట్యం మానవుని అహంకారాన్ని పటాపంచలు చేసే దివ్య సందేశాలుగా వివరించబడ్డాయి.

దశమ స్కంధంలో ఆవిష్కృతమైన శ్రీకృష్ణ పరమాత్మ లీలలు, బాల్య చేష్టలు, గోపికల నిష్కల్మషమైన అనురాగం, ఉద్ధవునికి ప్రబోధించిన జ్ఞానయోగం లౌకిక వాసనలను దూరం చేసి ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదపడతాయని విశదీకరించారు. గోపికా భక్తి అనేది శారీరకమైన మోహం కాదని, అది జీవాత్మ పరమాత్మతో లీనమయ్యే పరమప్రేమ స్వరూపమని తత్త్వవిచారణ గావించారు. సప్తాహ ప్రవచనాల పరాకాష్ఠగా శ్రీ రుక్మిణీ కల్యాణ ఘట్టాన్ని దేవస్థాన వేదపండితులు బ్రహ్మశ్రీ పాలెపు ప్రవీణ్ శర్మ, పురోహితులు బ్రహ్మశ్రీ మధురామ శర్మ, దేవస్థాన అర్చకులు దేవళ్ల సాయి శర్మ తదితర వైదిక బృందం ఆగమోక్తంగా, వేదమంత్రాల ఘోష నడుమ కమనీయంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, బాజాభజంత్రీలు, మహిళల మంగళహారతులు, భక్తుల 'గోవింద' నామస్మరణలతో శ్రీరామలింగేశ్వర ప్రాంగణం గోకుల బృందావనాన్ని తలపించింది.

సప్తాహ ముగింపు మహోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో పౌరాణికులు బ్రహ్మశ్రీ నీలకంఠ శర్మను భక్తులు అశేష జనవాహిని నడుమ ఘనంగా ఊరేగించి, సత్కరించారు. అనంతరం నీలకంఠ శర్మ దంపతుల ఉదార సౌజన్యంతో విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించి వేలాది మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ పౌరాణిక దంపతులను స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, దివ్య చిత్రపటంతో ఘనంగా సత్కరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సూపరింటెండెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీ శారదా మహిళా మండలి అధ్యక్షురాలు మధ్వాచారి విజయలక్ష్మి, కార్యదర్శి రాజేశ్వరి, ప్రతినిధులు రమాదేవి, శోభ, పద్మ తదితరులు పౌరాణికులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. గాయత్రి బ్రాహ్మణ నిత్యాన్న సత్ర సంఘ అధ్యక్షులు పాలెపు దత్తాత్రేయ శర్మ, అన్నపూర్ణ సేవా సమితి నిర్వాహకులు పెద్దంపట్ల నరేందర్ శర్మతో పాటు వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రముఖులు, పురప్రముఖులు, అసంఖ్యాక భక్తజనం హాజరై దక్షిణ తాంబూలాలు సమర్పించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

సాంకేతిక యుగంలో మానవుడు భౌతిక సుఖాల వెంట పరుగులు తీస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి, నైతిక పతనానికి లోనవుతున్న ప్రస్తుత తరుణంలో పురాణ శ్రవణం మానసిక ప్రశాంతతకు దివ్యౌషధంగా నిలుస్తుంది. కేవలం కథలను విని ఆనందించడమే కాకుండా, అందులోని ధర్మం, దయ, సత్యం, త్యాగం, కర్తవ్యనిష్ఠ వంటి జీవన మూల్యాలను ఆచరణలో పెట్టినప్పుడే పురాణ శ్రవణం సార్థకమవుతుంది. యువతరానికి సనాతన సంస్కృతి ఔన్నత్యాన్ని తెలియజేస్తూ, వారిలో మానవీయ విలువలను పెంపొందించేందుకు ఇటువంటి ప్రవచనాలు వారధులుగా ఉపయోగపడతాయి. తొమ్మిది రోజుల పాటు గోదావరి తరంగాల సాక్షిగా, భక్తిప్రపత్తుల పరిమళాల నడుమ సాగిన ఈ శ్రీమద్భాగవత పురాణ సప్తాహం ధర్మపురి క్షేత్ర ఆధ్యాత్మిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఒక అపురూప సాంస్కృతిక ఘట్టంగా ముగిసింది.

భారతీయ జ్ఞాన విజ్ఞాన సర్వస్వంలో పురాణ వాఙ్మయానికి అత్యున్నత స్థానం ఉంది. వేదాలు ప్రభుసమ్మితాలుగా ఆజ్ఞాపిస్తే, స్మృతులు మిత్రసమ్మితాలుగా హితవు పలికితే, పురాణాలు కాంతాసమ్మితంగా రమణీయమైన కథారూపంలో మానవ హృదయాలకు పరమోన్నత ధర్మ సూక్ష్మాలను చేరవేస్తాయి. వేదవ్యాస భగవానుడు మహాభారత రచనానంతరం కూడా చిత్తశాంతి లభించక పరితపిస్తున్న వేళ, నారద మహర్షి ఉపదేశంతో ఆవిర్భవించిన పరమ పవిత్ర గ్రంథ రాజమే శ్రీమద్భాగవతం. అష్టాదశ పురాణాలలో తిలకం వంటిదై, పన్నెండు స్కంధాలు, మూడు వందల ముప్పై అయిదు అధ్యాయాలు, పద్దెనిమిది వేల శ్లోకాలతో అలరారే ఈ దివ్య ప్రబంధం భక్తి, జ్ఞాన, వైరాగ్యాల త్రివేణీ సంగమంగా విరాజిల్లుతోంది. 'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్న ఆర్యోక్తి ప్రకారం పండితుల పాండిత్యానికి, సాధకుల పరిపక్వతకు భాగవతమే గీటురాయిగా నిలుస్తుంది. భగవంతుని లీలావిశేషాలు, దివ్యావతారాల పరమార్థం, శరణాగతి తత్త్వం మేళవించిన భాగవతం కేవలం గ్రంథం కాదు, అక్షరరూప పరబ్రహ్మ స్వరూపమని సనాతన విశ్వాసం. ఉంది. ఆబాలగోపాలాన్ని భక్తిపారవశ్యంలో ముంచెత్తారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్



# జాతీయం-అంతర్జాతీయం





## జాతీయ విజేత ఆకస్మిక మృతి

అటు చదువు.. ఇటు క్రీడల్లో రాణిస్తోన్న ఓ 14 ఏళ్ల బాలిక అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయింది. 12వ అంతస్తు నుంచి పడి మరణించింది. రోప్ స్కిప్పింగ్‌లో జాతీయస్థాయిలో ఇటీవలే పతకాలు సాధించిన ఆమె.. తన భవిష్యత్ గురించి కలలుకంటోన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..
ఉత్తర్‌ప్రదేశ్ లోని గాజియాబాద్‌కు చెందిన

**14 ఏళ్ల బాలిక ప్రాచి.. 9వ తరగతి చదువుతోంది.**

శుక్రవారం రాత్రి సమయంలో ఆరేసిన దుస్తులు తీస్తుండగా.. 12వ అంతస్తులో ఉన్న బాల్కనీ నుంచి పడిపోయింది. శబ్దం వినిపించడంతో అపార్ట్‌మెంట్ వాసులంతా కిందికి వచ్చి చూడగా.. ప్రాచి రక్తపుమడుగులో కనిపించింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది.

**అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయిందని వైద్యులు నిర్ధరించారు.**

ఆమె కిందపడిపోవడానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. పోలీసులు సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తున్నారు.

**రీల్స్ చేస్తే.. రియల్‌గా దోచేశారు**

మహారాష్ట్రలో సెప్టెంబర్ 17 నుంచి 20 మధ్య 'సీబీఎస్ఈ నేషనల్ గర్ల్స్ రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్2026' జరిగింది. ఈ పోటీల్లో ప్రాచి రెండు బంగారు పతకాలు దక్కించుకొని.. ఇటీవలే ఇంటికి తిరిగివచ్చింది. ఆమె విజయంతో కుటుంబమంతా సంతోషంలో ఉండగా.. ఈ ఘటన చోటుచేసుకోవడం విషాదాన్ని నింపింది ఘటన సమయంలో మిగిలిన కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉన్నారు.

## సిఇసి ఏకపక్ష నిర్ణయాలపై స్వతంత్ర దర్యాప్తు

- సుప్రీం రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్ లేదా సిట్
- జ్ఞానేశ్ కుమార్, మనీష్ గార్గ్, సీమా ఖన్నాను ప్రాసిక్యూట్ చేయాలి
- సుప్రీంకోర్టులో పిటిషన్

**న్యూఢిల్లీ**



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలపై స్వతంత్ర దర్యాప్తు చేయాలని సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి సిఇసి జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. విధి నిర్వహణలో వైఫల్యం, నిర్లక్ష్యానికిగాను 1950నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 32 కింద సిఇసి జ్ఞానేశ్ కుమార్, సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మనీష్ గార్గ్, డైరెక్టర్ జనరల్ (ఐటి) సీమా ఖన్నాను ప్రాసిక్యూట్ చేయాలని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో సిఇసి జ్ఞానేష్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా లేదా మెజారిటీ అభిప్రాయానికి విరుద్ధంగా తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్ణయాలు, మార్గదర్శకాలు, ఆదేశాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తినప్పుడు మెజారిటీ అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలంటూ 2023 చట్టంలోని సెక్షన్ 18లో ఉన్న నిబంధనలను పిటిషన్ ప్రస్తావించారు.

**ఫారం6లో మార్పులపై అభ్యంతరాలు**

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం6లో మార్పులపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఆన్‌లైన్ పోర్టల్‌లో మార్పులు చేసినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. చట్టబద్ధంగా నిర్దేశించిన ఫారం6ను పునరుద్ధరించాలని సుప్రీంకోర్టును కోరారు. కీలక నిర్ణయాలను సిఇసి ఏకపక్షంగా తీసుకున్నారని పేర్కొన్నారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బిర్ సింగ్ సంధూ, వివేక్ జోషిని సంప్రదించకుండా సిఇసి జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలు తీసుకున్నారని, అలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు.

**13 కోట్ల ఓటర్ల తొలగింపుపై స్వతంత్ర దర్యాప్తు**

ఎస్ఐఆర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి తొలగించడంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని పిటిషన్‌లో కోరారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి, ఇసిఐనెట్, ఈఆర్ఓనెట్ వ్యవస్థలను ఫోరెన్సిక్‌గా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

**14 సందర్భాల్లో అభ్యంతరాల ప్రస్తావన**

ఎస్ఐఆర్, ఓటర్ల జాబితాల నిర్వహణకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి పది నెలల వ్యవధిలో కనీసం 14 సందర్భాల్లో లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఇటీవల వెలువడిన మీడియా నివేదికలను పిటిషనర్ ప్రస్తావించారు.

## కల్తీ మద్యం తాగి 19 మంది మృతి

**నాగాలాండ్ :**



నాగాలాండ్‌లో కల్తీ మద్యం అనుమానిత ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లో మద్యం సేవించిన తర్వాత 19 మంది మృతి చెందారు. మొకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు అదనపు ఎస్పీ ఐ.బంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది ? దాని సరఫరా వెనుక ఎవరున్నారు ? అనే కోణాల్లో సిట్ దర్యాప్తు చేపట్టింది. మద్యం నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం అధికారులు గువాహటికి పంపించారు. మరణాలకు అసలు కారణం ఏంటో పరీక్షల తర్వాత స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, అయితే దర్యాప్తు ప్రారంభ దశలో ఉండటంతో వివరాలు వెల్లడించలేమని సీనియర్ ఎస్పీ వెసుప్రా కెజో అన్నారు. మరణాల నేపథ్యంలో .... పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేసి 19 మందిని అరెస్టు చేశారు. దాదాపు 3 వేల మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. గుర్తుతెలియని, లేబుల్ లేని లేదా అనుమానిత అక్రమ మద్యాన్ని తాగవద్దని ప్రజలను పోలీసులు హెచ్చరించారు. మద్యం తాగిన తర్వాత తల తిరగడం, చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు. నాగాలాండ్‌లో 1990 నుంచి మద్య నిషేధ చట్టం అమల్లో ఉంది.

## కాంగోలో ఘోర విమాన ప్రమాదం.. 14 మంది మృతి



**కిన్షా సా:**

ఆఫ్రికాలోని కాంగోలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. విమానం కుప్పకూలడంతో ఇద్దరు సీనియర్ సైనిక అధికారులు సహా మొత్తం 14 మంది మృతి చెందారు. కిక్విట్ నుంచి రాజధాని కిన్షాసాకు తిరుగు ప్రయాణమైన విమానం కేంజ్ ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. విమానంలో ఉన్న వారిలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని కాంగో సైన్యం వెల్లడించింది. కాంగో సైన్యం తెలిపిన వివరాల ప్రకారం.. విమానంలో సైనిక ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు. ప్రయాణ సమయంలో విమానం అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోయి కేంజ్ ప్రాంతంలో కుప్పకూలింది. మృతుల్లో కాంగో మిలటరీ కోర్టు చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ముటోంబో కటలాయి టియెండే, సాయుధ దళాల ఆడిటర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ బకుమి లికులియా ఉన్నారు. వీరితో పాటు మరో 12 మంది ప్రతినిధులు, విమాన సిబ్బంది మృతి చెందినట్లు సైనిక ప్రతినిధి మేజర్ జనరల్ ఎఫోమి ఎకెంజె తెలిపారు. విమానం కిక్విట్ నుంచి కిన్షాసాకు బయలుదేరిన సమయంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు స్థానిక అధికారులు తెలిపారు. విమానం ఎందుకు నియంత్రణ కోల్పోయిందనే అంశంపై అధికారులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## పుతిన్ పార్టీకి మళ్లీ భారీ విజయం

- 450 స్థానాల్లో 349 సీట్లు కైవసం
- 60 శాతానికి పైగా పోలింగ్ నమోదు

**మాస్కో :**



రష్యా పార్లమెంటరీ ఎన్నికల తుది ఫలితాల్లో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కు చెందిన 'యునైటెడ్ రష్యా' పార్టీ భారీ విజయం సాధించింది. మొత్తం 450 స్థానాలున్న స్టేట్ డూమాలో ఆ పార్టీ 349 స్థానాలను గెలుచుకుంది. 58 శాతం ఓట్లు సాధించి మూడొంతుల మెజారిటీని దక్కించుకుంది. ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైన తర్వాత జరిగిన తొలి పార్లమెంటరీ ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది.

**మొత్తం 11 కోట్లకుపైగా ఉన్న ఓటర్లలో దాదాపు 60 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.**

గత పదేళ్లలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలతో పోలిస్తే ఇదే అత్యధిక పోలింగ్ కావడం గమనార్హం. మూడు రోజుల పాటు ప్రత్యక్ష ఓటింగ్‌తోపాటు కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ ఓటింగ్‌కు కూడా అవకాశం కల్పించారు. ప్రభుత్వానికి మద్దతుగా ఉండే పలు చిన్న పార్టీలకు చెందిన అభ్యర్థులు 97 స్థానాల్లో విజయం సాధించగా, నాలుగు స్థానాలను స్వతంత్ర అభ్యర్థులు గెలుచుకున్నారు.మరోవైపు ఎన్నికల సమయంలో రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులు జరిపింది. ఆదివారం రాత్రి రష్యా భూభాగంపైకి వచ్చిన 1,110 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. మాస్కోపై 450 డ్రోన్లతో దాడి జరిగినట్లు మేయర్ తెలిపారు. ఈ దాడుల్లో ఓ చమురు శుద్ధి కర్మాగారం, ఓ నివాస భవనం దెబ్బతిన్నాయి. మాస్కో పరిధిలో ముగ్గురు పౌరులు మరణించగా,

**38 మంది గాయపడ్డారు.**

ఉక్రెయిన్ దాడుల్లో ఆరుగురు పోలింగ్ సిబ్బంది మరణించారని,

**75 పోలింగ్ కేంద్రాలు ధ్వంసమయ్యాయని రష్యా ఎన్నికల సంఘం వెల్లడించింది.**

మాస్కో ఆధీనంలో ఉన్న ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలతోపాటు క్రిమియాలోనూ రష్యా ఎన్నికలు నిర్వహించడాన్ని ఉక్రెయిన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎన్నికల్లో తమ పార్టీ సాధించిన విజయాన్ని ప్రజల నుంచి తమ విధానాలకు లభించిన మద్దతుగా పుతిన్ పేర్కొన్నారు.

## ఇరాన్ శాంతి ప్రతిపాదన: ట్రంప్ నో

**వాషింగ్టన్:**



హర్మూజ్ జలసంధిలో సాధారణ నౌకాయానాన్ని పునరుద్ధరించేందుకు ఇరాన్ ప్రతిపాదించిన ఏడు రోజుల శాంతి ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. నవంబర్‌లో జరిగే అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై అమెరికా మళ్లీ వైమానిక దాడులు ప్రారంభించే అవకాశం ఉందని ట్రంప్ తన సహచరులతో చెప్పినట్లు ఆ కథనం వెల్లడించింది. అయితే, ఇరాన్ ప్రతిపాదనపై అమెరికా అధికారికంగా స్పందించిందా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు.ఖతార్ ద్వారా అమెరికాకు ఒక నిర్దిష్ట ప్రణాళికను పంపినట్లు ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ వెల్లడించారు. ఈ ప్రతిపాదన ప్రకారం.. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నావికాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, చమురు ఆంక్షలను సడలించడం, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం వంటి షరతులకు అంగీకరిస్తే.. ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచి, లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాల్లో ఘర్షణలను నిలిపివేస్తామని ఇరాన్ హామీ ఇచ్చింది. దీని తర్వాత అణు కార్యక్రమంపై విస్తృత చర్చలకు సిద్ధమని పేర్కొంది. అయితే, ఇరాన్ తన డిమాండ్లను నెరవేరుస్తుందనే నమ్మకం లేదని ట్రంప్ భావిస్తున్నట్లు 'వాల్ స్ట్రీట్' జర్నల్ కథనం పేర్కొంది. ఇరాన్‌ను అణుబాంబును సొంతం చేసుకోనివ్వనని శపథం చేసిన ఆయన, ఎన్నికల తర్వాత దాడులే సరైన మార్గమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హర్మూజ్ జలసంధిని 'ట్రంప్ స్ట్రెయిట్' అని లేబుల్ చేసిన చిత్రాన్ని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పంచుకోవడం గమనార్హం.

## ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి ఎఐ చొరబాటు

- ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి ఎఐ మోడళ్లు సైబర్ భద్రతపై పెరుగుతున్న ఆందోళనలు
- ఆందోళన కలిగిస్తున్న 'ఏజెంట్ గోయింగ్ రోగ్' వైఖరి

**వాషింగ్టన్ (అమెరికా) :**



ఓపెన్ ఎఐ (OpenAI) కి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఏజెంట్లు అమెరికా ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి అక్రమంగా ప్రవేశించినట్లు వెలువడిన కథనాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆస్ట్రేలియా ప్రభుత్వ ఆరోగ్య రక్షణ విభాగానికి చెందిన సైట్‌పై సైతం ఇదే తరహా దాడి జరిగినట్లు వెల్లడైన కొద్ది రోజుల్లోనే యుఎస్ లోనూ సైబర్ చొరబాటు ఘటన వెలుగుచూసింది. ఎఐ మోడళ్ల అసాధారణ ప్రవర్తనను పరిశీలిస్తున్న సమయంలో ఓపెన్ ఎఐ స్వయంగా ఈ విషయాన్ని గుర్తించింది. యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు చెందిన రెండు వెబ్‌సైట్లతో పాటు, యుఎస్ సెన్సస్ బ్యూరో వెబ్‌సైట్‌లోకి ఎఐ ఏజెంట్లు చొరబడినట్లు తేలింది. వీటిలోని పబ్లిక్ డేటాను మాత్రమే యాక్సెస్ చేసినట్లు అధికారులు స్పష్టం చేసినప్పటికీ, భద్రతా నియమాలను ధిక్కరించి ఈ హాకింగ్ జరగడం గమనార్హం.

**ఈ చొరబాటు వల్ల వెబ్‌సైట్లకు గానీ, డేటాబేస్‌కు గానీ ఎలాంటి నష్టం వాటిల్లనప్పటికీ,**

ఎఐ ఏజెంట్లు స్వతంత్రంగా లాగిన్ కావడానికి ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, కామర్స్ డిపార్ట్‌మెంట్లతో పాటు కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూయార్క్ వంటి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ వెబ్‌సైట్లలో కూడా ఇటువంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినట్లు 'ట్రాన్స్‌లూస్' నివేదించింది. "మిస్అలైన్డ్ మోడల్ యాక్టివిటీ"

**పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఈ అంశాలు బయటపడ్డాయి.**

దీనిపై సమగ్ర విచారణ కొనసాగుతోందని ఓపెన్ ఎఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ తెలిపారు.కలకలం రేపిన 'హగ్గింగ్ ఫేస్' ఘటన :ప్రముఖ ఎఐ స్టార్టప్ కంపెనీ 'హగ్గింగ్ ఫేస్' వెబ్‌సైట్‌పై జరిగిన దాడి ఈ విభాగంలోనే అతిపెద్దదిగా నిలిచింది. పెద్ద సంఖ్యలో ఎఐ ఏజెంట్లు ఒక్కసారిగా ఈ సైట్‌లోకి చొరబడటం గమనార్హం.మానవులు ఇచ్చే ప్రాథమిక ఆదేశాలను దాటి, తమ మార్గంలో వచ్చే అడ్డంకులను అధిగమించడానికి ఎఐ ఏజెంట్లు స్వయంగా

**హాకింగ్ పద్ధతులను ఉపయోగించడాన్ని సాంకేతిక పరిభాషలో "ఏజెంట్ గోయింగ్ రోగ్"**

గా వ్యవహరిస్తారు. ఓపెన్ ఎఐ, ఆంత్రోపిక్ లతో పాటు పలు అధునాతన మోడళ్లు కేవలం ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా.. ఇంటర్నెట్‌ను బ్రౌజ్ చేయడం, కంప్యూటర్లలోకి ప్రవేశించి సొంతంగా కోడింగ్ రన్ చేయడం వంటి 'ఆటోనామస్ ఏజెంట్' సామర్థ్యాలను కలిగి ఉంటున్నాయి. ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తే, దాన్ని సాధించడానికి ఎలాంటి అడ్డంకినైనా దాటడానికి ఇవి ప్రయత్నిస్తున్నాయి.

**ఈ క్రమంలోనే ఆంత్రోపిక్, క్లాడ్, జెమిని వంటి మోడళ్లపై ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. అయితే ఫ్రెంచ్,**

చైనా ఎఐ మోడళ్లపై ఇప్పటివరకు ఇటువంటి ఆరోపణలు రాలేదు. వాటికి కఠినమైన భద్రతా గోడలు (సారథ్యం) ఉండటమే కాకుండా, ల్యాంగ్వేజ్ మోడల్స్‌గా ప్రైవేట్ క్లౌడ్‌పై ఆధారపడకుండా డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించే విధానం కలిగి ఉండటం దీనికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

## పాక్ మోసానికి భారత్ కౌంటర్



దాయాది పాకిస్థాన్‌కు ఐరాస వేదికగా భారత్ గట్టి హెచ్చరికలు చేసింది సీమాంతర ఉగ్రవాదాన్ని ఇలాగే ప్రోత్సహిస్తే.. తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. భారత్‌లో అంతర్భాగమేనని పునరుద్ఘాటించింది.

**ఐరాస వంటి అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ చేస్తోన్న అబద్ధపు ప్రచారాన్ని..**

ప్రపంచం ఎప్పటికప్పుడు తిరస్కరిస్తూనే ఉందని పేర్కొంది.

**ఆ దేశ ఉగ్రవాద చర్యలు, మోసం అందరికీ కనిపిస్తూనే ఉన్నాయని యూఎన్‌లో భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ పెటల్ గహ్లోత్ పేర్కొన్నారు.**

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తన ప్రసంగంలో సింధూ జలాల ఒప్పంద ప్రస్తావన తీసుకురావడంతో భారత్ ఈ విధంగా కౌంటర్ ఇచ్చింది.''రెండుదేశాల మధ్య ఉద్రిక్తతలకు..

**పాకిస్థాన్ చాలా కాలంగా కొనసాగిస్తున్న సీమాంతర ఉగ్రవాదమే కారణం. ఉగ్రవాదులు పారిపోవడానికి,**

దాక్కోవడానికి ఎలాంటి చోటు ఉండదని మేం గతేడాది (ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశిస్తూ) నిరూపించాం. ఉగ్రవాదం నుంచి మా దేశాన్ని రక్షించుకునే హక్కు మాకుంది. పాక్ ప్రవర్తన ఇలాగే ఉంటే.. పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అంతర్జాతీయ వేదికలపై దాయాది అబద్ధపు ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఉగ్రవాదం, మోసం,

**కపటమైన చర్యల వల్ల ఆ దేశానికిగానీ, ప్రపంచానికి గానీ ప్రయోజనం ఉండదు. మతంపట్ల దురభిమానం,**

ద్వేషం వంటి చెడు లక్షణాల్లో సదీర్ఘ చరిత్ర కలిగిన ఆ దేశం.. భారత్‌పై నిందలేయడం విడ్డూరంగా ఉంది.

**'ఉగ్ర దేశమే ఆ ప్రశ్న అడుగుతోంది'పాకిస్థాన్ లో మైనారిటీలను ఎలా చూస్తారో యావత్ ప్రపంచానికి తెలుసు.**

తన సొంత ప్రజలకు వ్యతిరేకంగా తన రాజధాని నగరాన్ని పటిష్ఠం చేసుకుంటోన్న ఆ ప్రభుత్వం.. ప్రజాస్వామ్య హక్కులు, విలువల గురించి నీతిబోధలు చేస్తోంది. అక్కడ సైన్యానిదే సర్వాధికారం. కీలు బొమ్మలు వస్తారు.. పోతుంటారు.

**కానీ పెత్తనం ఎవరిదనే విషయంలో ఎలాంటి భ్రమలు అవసరం లేదు"**

అని పెటల్ గహ్లోత్ దుయ్యబట్టారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే. షెహబాజ్ షరీఫ్ దానిని ప్రస్తావిస్తూ.. పాకిస్థాన్‌కు కేటాయించిన వాటాను నిలిపివేయడానికి, అడ్డుకోవడానికి, మళ్లించడానికి చేసే ఏ ప్రయత్నాన్నైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని ప్రగల్భాలు పలికారు.

**ఇదిలా ఉండగా.. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టును నిరసిస్తూ ప్రతిపక్ష పీటీఐ పార్టీ మరోసారి ఆందోళనలకు సిద్ధమైంది.**

దీంతో ఇస్లామాబాద్ శివారుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## భాజపాకు మమత తీవ్ర సవాల్!

**పశ్చిమ బెంగాల్**



మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సెరాంపుర్‌లో జరగాల్సిన తన ర్యాలీకి వెళ్లకుండా తమ వర్గం నేతలను భాజపా గూండాలు అడ్డుకున్నారని ఆరోపించారు. కొందరిని గృహ నిర్బంధం చేశారని..మరికొందరిని దారిలో అడ్డుకొని, వాహనాలు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమ వేదికకు వెళ్లే మార్గాన్ని సైతం తమ ఆధీనంలోకి తీసుకొని.. కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా పోలీసులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. నిజంగా ధైర్యముంటే తమ నేతలను కాకుండా తనను అడ్డుకోవాలని దీదీ భాజపాకు సవాల్ విసిరారు.

**'మా నేతలు కొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. ర్యాలీ జరిగే ప్రదేశానికి వెళ్లనివ్వడం లేదు.**

కోర్టు అనుమతితోనే ర్యాలా నిర్వహిస్తున్నాం. ఇది సజావుగా సాగేలా చూడడం పోలీసులు,

**అధికార యంత్రాంగం బాధ్యత. కానీ వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.**

ప్రజాస్వామ్యదేశమైన భారత్‌లో ఇటువంటి దాడులు జరగడం సిగ్గుచేటు. ర్యాలీకి వెళ్లకుండా చేయడానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆగేదీ లేదు. సభకు వెళ్లి ప్రసంగిస్తాను. సాధ్యమైతే నన్ను ఆపండి' అని మమత పేర్కొన్నారు. సీఈసీ వివాదం.. 30న 'ఇండియా కూటమి' నేతల భేటీకునాల్ ఘోష్ కారుపై గుడ్లు..

**రాళ్ల దాడి..మమతా బెనర్జీ ర్యాలీకి వెళ్తున్న**

ఆమె వర్గం ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌ను కొందరు దుండగులు హుగ్లీ జిల్లాలో అడ్డుకున్నారు. నల్ల జెండాలు పట్టుకున్న కొందరు ఆయన కారుపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారు. దీంతో ముందుకు వెళ్లడానికి అవకాశం లేక ఆయన వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఘటనలో కారు అద్దాలు పగిలిపోయినట్లు తెలుస్తోంది.

## 'సర్' నోటీసులు: ఈసీ ఊరట

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (SIR)లో నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం తెలిపింది. 'సర్' కోసం ఫారం6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి నేడు దిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. 'సర్'పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అనంతరం ఎన్నికల సంఘం ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని తెలిపింది.

## ఉపాధికి రూ.2 లక్షల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి

- పట్టణ పేదలకూ ఉపాధి హామీ అమలు చేయాలి
- అక్టోబర్ 2న దేశవ్యాప్త ఆందోళనలు
- వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల జాతీయ వేదిక పిలుపు

**న్యూఢిల్లీ**



దేశంలోని గ్రామీణ ప్రాంతాలను కరువు విలయతాండవం చేస్తోందని, గ్రామీణ కూలీలు వ్యవసాయ పనులు లేక, ఉపాధి లేక పస్తులతో అల్లాడుతున్నారని వ్యవసాయ,

**గ్రామీణ కార్మిక సంఘాల జాతీయ వేదిక ఆందోళన వ్యక్తం చేసింది. కరువు, వర్షాభావం,**

ప్రకృతి వైపరీత్యాలతో ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్న గ్రామీణ ప్రజలను ఆదుకోవాల్సిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించింది. శుక్రవారం నాడిక్కడ వ్యవసాయ,

**గ్రామీణ కార్మిక సంఘాల జాతీయ వేదిక సమావేశం జరిగింది.**

ఈ సమావేశంలో బి. వెంకట్, విక్రమ్ సింగ్, వి. శివదాసన్, సాహిల్ (ఎఐఎడబ్ల్యుయు), గోరియా, నిర్మల్ (బికెఎంయు), దేవేంద్ర ఝూ (ఎఐఎఆర్ఎల్ఎ),

**ఇతర వ్యవసాయ కార్మిక సంఘాల నుంచి ఇకలోహ సింగ్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.**

గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కోసం

**అదనంగా రూ.2 లక్షల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని వెంటనే ప్రకటించి,**

దేశవ్యాప్తంగా విస్తృతంగా ఉపాధి పనులు చేపట్టాలని నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు, నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

**అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు**

**బి.వెంకట్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు,**

కరువు పరిస్థితులు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామీణ పేదలకు తక్షణ ఉపాధి కల్పించాల్సి ఉందని, మోదీ ప్రభుత్వం గ్రామీణ పేదల ఆకలి కేకలను పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటంలో మునిగిపోయిందని విమర్శించారు.

**గ్రామీణ పేదలకు చట్టబద్ధమైన ఉపాధి హక్కును కల్పించిన ఉపాధి హామీ 2005ను రద్దు చేసి,**

దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువచ్చి పనిదినాలను కుదించడం దుర్మార్గమని అన్నారు.

**ఏడాదికి కనీసం 200 రోజుల పని, రోజుకు రూ. 700 వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు.**

**ఎల్‌నినో ప్రభావం, వర్షాభావం, కరువు, ప్రకృతి**

వైపరీత్యాల కారణంగా వ్యవసాయ పనులు తీవ్రంగా తగ్గిపోయిన ప్రాంతాల్లో గ్రామీణ కూలీలకు వెంటనే అదనపు ఉపాధి కల్పించాలని కోరారు.

# నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చాం: ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**నూతన వంద పడకల ఏరియా ఆసుపత్రిలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఓపీ సేవల ప్రారంభం**

**హనుమకొండ/పరకాల, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి) :**

నిరుపేదలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రోజున పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఆయన ఓపీ (OP) సేవలను అధికారికంగా ప్రారంభించారు. ముందుగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం, ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఓపీ సేవలను శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఫార్మసీ, జనరల్ వార్డు, గైనిక్, ల్యాబోరేటరీ తదితర విభాగాలను కలెక్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ...నూతన ఏరియా ఆసుపత్రి ప్రారంభంతో పరకాల ప్రాంత ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా నాణ్యమైన వైద్యం ఉచితంగా అందుబాటులోకి వచ్చింది.వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. వైద్యులందరి సమష్టికృషితో ఈ ఆసుపత్రికి A+ కేటగిరీ దక్కేలా అభివృద్ధి చేస్తాం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలు, మౌలిక వసతులు కల్పించామని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నిర్వహణకు అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సమర్పించాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్ 26(వుదయం జిల్లా ప్రతినిధి):**

ప్రభుత్వ ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలు నిర్వహణ సందర్భంగా చేపట్టనున్న వివిధ అభివృద్ధి, రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు, అంచనాలను త్వరితగతిన సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం దేవాదాయశాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్ గోదావరి పుష్కర అభివృద్ధి పనులపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ, దేవాదాయ, ప్రణాళిక, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్తు తదితర శాఖల అధికారులతో పురోగతి, ప్రతిపాదనలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మంజూరైన రూ.92 లక్షల పనులతో పాటు రూ.5.08 కోట్లతో చేపట్టాల్సిన అదనపు రహదారి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. బ్యాలెన్స్ పనులకు కూడా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కు సంబంధించిన ప్రతిపాదనలకు నివేదిక రూపొందించి పంపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రతిపాదనలను వేగంగా పూర్తి చేసి నివేదికలు ఉన్నతాధికారులు పంపించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, దేవాదాయ, ప్రణాళిక, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్తు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రతిభావంతులకు అండగా లీగల్ ఎయిడ్ క్లినిక్



**కలెక్టరేట్ ఆవరణలో న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం - బాధితులు సద్వినియోగం చేసుకోవాలి**

**జడ్జి డా. శివరామ్ ప్రసాద్, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి ) :**

శారీరక, మానసిక వైకల్యాలున్న ప్రత్యేక ప్రతిభావంతులకు చట్టపరమైన రక్షణ, ఉచిత న్యాయ సేవలు అందించడమే లక్ష్యంగా సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ (న్యాయ సహాయ కేంద్రం) ఏర్పాటైంది. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, స్కీమ్ 2024 నిబంధనల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి డాక్టర్ పి. శివరామ్ ప్రసాద్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి భవ్య కోవిలతో కలిసి శనివారం ప్రారంభించారు.

హక్కుల రక్షణకు మార్గదర్శి: జిల్లా జడ్జి డాక్టర్ శివరామ్ ప్రసాద్ ఈ సందర్భంగా న్యాయమూర్తి డాక్టర్ పి. శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ... సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులు, మానసిక వైకల్యాలున్న వారికి అండగా నిలిచేందుకు ఈ క్లినిక్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాధితులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాలు, సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు చట్టపరమైన హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్క లెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ... సమీకృత కలెక్టరేట్ భవనంలోనే దివ్యాంగుల కోసం ప్రత్యేక న్యాయ సహాయ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమన్నారు.

ఎలాంటి న్యాయపరమైన సమస్యలున్నా బాధితులు సంకోచించకుండా ఈ క్లినిక్‌ను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ కేంద్రం ద్వారా లభించే సేవలపై దివ్యాంగులు, సాధారణ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. హసన్, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్యానెల్ న్యాయవాది దావుల చిన్న వీర ప్రసాద్, పారా లీగల్ వాలంటీర్ జయ, న్యాయ, సంక్షేమ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ హార్ట్ డే ఉచిత కమ్యూనిటీ సిపిఆర్ శిక్షణా శిబిరం




**హనుమకొండ సిటీ, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి) :**

వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ పిలుపు మేరకు "డోంట్ మిస్ ఎ బీట్" (గుండె జబ్బుల ముందస్తు గుర్తింపు) అనే థీమ్‌తో ఈ నెల 29న వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కమ్యూనిటీ సిపిఆర్ (CPR) శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నారు. 1999 నుండి కమ్యూనిటీ కార్డియాలజీ సేవలు, 2001 నుండి వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు అందిస్తున్న శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్‌కి ఇది 26వ సంవత్సరం.నేషనల్ CPR ఛాలెంజ్ క్యాంపెయిన్‌లో భాగంగా నిర్వహించే ఈ శిక్షణ ద్వారా ఆసుపత్రి వెలుపల వచ్చే అకస్మాత్ గుండెపోటు (Cardiac Arrest) బాధితులను కాపాడే 'బైస్టాండర్ CPR' ప్రమాణాలను పెంచడమే ప్రధాన లక్ష్యం.తేదీ, సమయం సెప్టెంబర్ 29 (ఆదివారం), ఉదయం 7 నుండి సాయంత్రం 7 గంటల వరకు ఎన్ఆర్ఐ పూర్వ విద్యార్థుల విద్యా కేంద్రం, కాకతీయ మెడికల్ కాలేజ్ (KMC), వరంగల్. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హైక్వాలిటీ CPR మరియు ఆటోమేటెడ్ ఎక్స్టర్నల్ డిఫిబ్రిలేటర్ (AED) వినియోగంపై ప్రత్యక్ష శిక్షణ. మొదటిసారిగా ప్రధాన భారతీయ భాషల్లో CPR అవగాహన సామగ్రి పంపిణీ. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సాఫ్ట్ కాపీ రూపంలో సర్టిఫికేషన్ అందజేత. ఈ కార్యక్రమానికి ఐఎంఏ (IMA) తెలంగాణ, తెలంగాణ కార్డియాలజికల్ సొసైటీ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, THANA, అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (వరంగల్) మరియు KMC అలుమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ సహకారం అందిస్తున్నాయి. మనదేశంలో హాస్పిటల్ వెలుపల గుండె పోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోందని, ప్రతి ఒక్కరూ CPR పై అవగాహన పెంచుకోవాలని నిర్వాహకులు కోరారు. ప్రజా ప్రదేశాల్లో AEDలను అందుబాటులో ఉంచడం మరియు రెగ్యులర్ శిక్షణ అందించడం ద్వారా గుండె ఆరెస్ట్ బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు నారాయణపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



మునుగోడు, సెప్టెంబర్ 26(వుదయం): నారాయణపూర్ మండల కేంద్రంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు.మునుగోడు నియోజకవర్గంలో ఇప్పటివరకు 16 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 12,306 మందికి కంటి పరీక్షలు చేయించారు. 2,673 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేయగా, 5,522 మందికి ఉచితంగా కండ్లజోళ్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. నియోజకవర్గంలోని ఏ ఒక్కరూ కంటి సమస్యలతో ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో శిబిరాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నారాయణపూర్‌లో నిర్వహించనున్న శిబిరం 17వదని పేర్కొన్నారు. కంటి సమస్యలున్న వారు శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# రూ. కోట్లతో అభివృద్ధి పనుల శంకుస్థాపన



**లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**జనగామ, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి) :**

పూరిగుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో రూ.1.77 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 16 చెత్త సేకరణ ఆటోలు, జేసీబీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపాలిటీకి చెందిన 54 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. రూ.38 కోట్ల మురుగు నీటి శుద్ధి ప్లాంట్ (ఎస్‌టీపీ), రూ.2 కోట్ల డంపింగ్ యార్డ్ షెడ్, రూ.2.25 కోట్లతో తరిగొప్పుల తహసీల్దార్ కార్యాలయం, పాఠశాలల మరమ్మతులు, రూ.1.92 కోట్లతో బాస్కెట్ బాల్ కోర్టులు సహా పలు సీసీ రోడ్లు, ఐడీఓసీ ప్రహరీ గోడల నిర్మాణ పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు.గృహ ప్రవేశాలు: వీవర్స్ కాలనీ (12వ వార్డు) లో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చేనేత కార్మికుల మగ్గాలను పరిశీలించి, వారి నైపుణ్యాన్ని ప్రశంసించారు.

ప్రెస్టన్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో 500 మంది పూరిగుడిసెల నిరుపేద లబ్ధిదారులకు రూ. 5 లక్షల విలువైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు రూ. 2 నుంచి 3 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. జనగామ మున్సిపాలిటీ అభివృద్ధికి తక్షణమే రూ. 25 కోట్లు, పాత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పూర్తికి రూ. 2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# అమ్మకు అక్షరమాల జిల్లాలో నేడు అక్షరాస్యత పరీక్ష



**ములుగు, సెప్టెంబరు 26 (వుదయం ప్రతినిధి) :**

'ఉల్లాస్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించనున్న 'అమ్మకు అక్షరమాల' మూల అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన మదింపు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. జాతీయ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 171 గ్రామ పంచాయతీలు, 20 పట్టణ వార్డుల పరిధిలో ఉల్లాస్ విద్యా కేంద్రాల ద్వారా 100 రోజుల శిక్షణ పొందిన 3,597 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు.

పరీక్ష వేళలు: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు అభ్యర్థుల సౌకర్యాన్ని బట్టి ఏదైనా రెండు గంటల పాటు పరీక్ష రాసే వెసులుబాటు కల్పించారు. పరీక్ష కేంద్రాలు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ములుగు పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్కులు, సర్టిఫికేట్ 150 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జాతీయ సార్వత్రిక విద్యాపీఠం నుంచి అక్షరాస్యత ధ్రువపత్రం అందజేస్తారు.

మండలాల వారీగా అభ్యర్థుల సంఖ్య వాజేడు (996), వెంకటాపురం (719), ఏటూరునాగారం (435), మంగపేట (421), వెంకటాపూర్ (325), గోవిందరావుపేట (223), కన్నాయిగూడెం (220), ములుగు పట్టణం (120), ములుగు మండలం (115), తాడ్వాయి (23). అక్షరజ్ఞానంతో ఆత్మవిశ్వాసం, స్వతంత్రత పెరుగుతాయని, ఇది నిత్యజీవితంలో బ్యాంకు లావాదేవీలు మరియు ప్రభుత్వ పథకాల అవగాహనకు ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. గుర్తించిన అభ్యర్థులందరినీ ప్రోత్సహించి పరీక్షకు హాజరయ్యేలా చూడాలని కుటుంబ సభ్యులకు, క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వసతులు సరిగ్గా ఉండాలని ఆదేశించారు.

# గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రాధాన్యత



**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ**

**జయశంకర్ భూపాలపల్లి,సెప్టెంబర్ 26(వుదయం జిల్లా ప్రతినిధి):**

గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.శనివారం జిల్లా ఐడిఓసి కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టడంతో పాటు గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ఎంపిక చేయాలని సూచించారు. డిఎంఎఫ్టి, సిఎస్ఆర్ నిధులను కూడా స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు గ్రామ సభల ద్వారా తీర్మానాలు చేయాలని తెలిపారు. జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉన్నందున ఆ ప్రాతిపదికన అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో నీరు, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కార్యాచరణ తయారు చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు జారీ చేసి కూలీలను పెంచాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతి, విఓ భవనాలు, పాఠశాలలకు ప్రహరి నిర్మాణంతో పాటు అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. భూ గర్భ జలాలు పెంపొందించేందుకు ఇంకుడు, ఫామ్ పాండ్స్ నిర్మాణం చేపట్టాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత మేరకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించే ప్రత్యేక గ్రామసభల్లో గ్రామాభివృద్ధి పనులపై ప్రజలతో చర్చించి తీర్మానాలు ఆమోదించాలన్నారు. ప్రతి గ్రామానికి అవసరమైన పనులపై ముందుగానే ఇన్వెంటరీ సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను పక్కాగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీఓ బాలకృష్ణ, డిఎంఓ కౌసల్య దేవి, డిపిఓ శ్రీలత ఎంపీడీవోలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దెందుకూరులో రైతుల సమస్యలను పరిశీలించిన కలెక్టర్ దివాకర




**మధిర, సెప్టెంబర్,26, (వుదయం ప్రతినిధి) :**

మధిర మండలం దెందుకూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ దివాకర పర్యటించి రైల్వే మూడో లైను నిర్మాణం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రైల్వే మూడో లైను ఏర్పాటు కారణంగా రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఇబ్బందికరంగా మారిన విషయాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా రైల్వే అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొలాలకు రాకపోకలు సాగించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు పలు సూచనలు చేశారు.ఈ పర్యటనలో మధిర తహసీల్దార్ రాంబాబు,సొసైటీ చైర్మన్ కోట వెంకట కృష్ణ,రైల్వే అధికారులు, పాల్గొన్నారు.

# గట్టు మహేష్ బాబుకు 'కళాబంధు' బిరుదు ప్రదానం



**హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి) :**

ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ రికార్డు గ్రహీత శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి 41వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 27న (ఆదివారం) హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో 1023వ అంతర్జాతీయ సాంస్కృతిక కళా మహోత్సవం "కాకతీయ కళా వైభవం" వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ సాంస్కృతిక సమ్మేళనంలో వరంగల్ ఆర్యవైశ్య సత్రం అధ్యక్షులు గట్టు మహేష్ బాబుకు అత్యుత్తమ "కళాబంధు" గౌరవ బిరుదును ప్రదానం చేయనున్నారు.

ఈ విశేష కార్యక్రమానికి బంధుమిత్రులు, కళాభిమానులు మరియు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా గట్టు మహేష్ బాబు ఆహ్వానించారు.

# చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా నివాళులు



**నల్గొండ జిల్లా వుదయం సెప్టెంబర్ 26**

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాజీ శాసనసభ్యులు, పార్టీ నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నల్గొండ మాజీ శాసన సభ్యుడు కంచర్ల భూపాల్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ శాసనసభ్యుడు గాదరి కిశోర్, మిర్యాలగూడ మాజీ శాసనసభ్యుడు భాస్కర్‌రావు, భువనగిరి మాజీ శాసనసభ్యుడు పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆలేరు మాజీ శాసనసభ్యుడు బిక్షమయ్యగౌడ్, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి కార్యక్రమంలో పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులు

**నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్**

**నల్గొండ జిల్లా వుదయం సెప్టెంబర్ 26**

నల్గొండ పట్టణం కేంద్రంలో ఏచూరి గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన రావిరాల లక్ష్మమ్మ దశదిన కార్యక్రమానికి నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్‌నేత హాజరై నివాళులర్పించారు. నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్తో కలిసి కార్యక్రమానికి హాజరైన ఆయన లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రావిరాల నర్సయ్య, ఐజీ రావిరాల వెంకటేశ్వర్లు మాతృమూర్తి రావిరాల లక్ష్మమ్మ దశదిన కార్యక్రమం సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు

# ప్రజా దరఖాస్తులు నిర్ణీత గడువులో పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**రీసర్వే చేసిన మొలుగుమాడు గ్రామ రెవెన్యూ డేటా ఎంట్రీ వివరాలను పరిశీలన**

**మండలంలోని మొదటి విడుతలో ఐదు గ్రామాలలో చేపట్టిన భూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి**

**ఎర్రుపాలెం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రీ సర్వే డేటా ఎంట్రీ పక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం వుదయం బ్యూరో(సెప్టెంబరు- 26) :**

ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం మధిర నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, కార్యాలయ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మండల పరిధిలోని మొలుగుమాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహించిన రీసర్వే వివరాలు, డేటా ఎంట్రీ పక్రియను పరిశీలించారు. రీసర్వే అనంతరం రైతులకు నూతన పాసుపుస్తకాల జారీ ప్రక్రియపై అధికారులతో చర్చించి సూచనలు చేశారు. ఎర్రుపాలెం మండలంలో మొదటి విడుదలతో ఐదు గ్రామాలలో చేపడుతున్న భూ సర్వే పంచనామ పత్రాలు, కంప్యూటర్ డెటా ఎంట్రీ విధానంను పరిశీలించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే ప్రతి అంశాన్ని పరిశీలించి నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమ పురోగతిపై ఆరా తీశారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానం, ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్లకు ఎదురైన సమస్యలను పరిషార్కంలో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల సంబంధించిన దరఖాస్తులను సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మండల కార్యాలయాలకు వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మధిర మండలంలోని దెందుకూరు గ్రామంలో రైల్వే మూడవ లైను వలన పలు రైతులకు పోలాలకు వెళ్ళే రోడ్డు ఇబ్బందుల విషయమై రైల్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి సూచనలు ఇచ్చి, తగువిధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మధిర మండల తహసీల్దారు రాంబాబు, ఎర్రుపాలెం మండల తహసీల్దార్ సునీత ఎలిజబెత్, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ శిరీష, సర్వేయర్ రాజశేఖర్, అధికారులు, పాల్గొన్నారు.

# జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు ఇవ్వాలి



**యాదాద్రి భువనగిరి జిల్లా.సెప్టెంబర్26(వుదయం):**

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు ఇవ్వాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం మినీ మీటింగ్ హాల్ లో టీయస్ ఐ ఐపాస్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పెండింగ్ లో ఉన్న వాటిని వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టీఎస్ ఐపాస్, TPRID స్కీం ల పథకం లో 8 మంది యస్ టి లబ్ధిదారులకు రాయితీ మంజూరీ ఇవ్వడం జరిగింది.ఒక్క పరిశ్రమకు రా మెటీరియల్ అలాట్ మెంట్ కు సంబదించి వివరించడం జరిగింది.

DIPC లో భాగంగా 8 మంది యస్. టి లబ్ధిదారులకు రాయితీ మరియు నాలుగు పరిశ్రమలకు సంబంధించి రా మెటీరియల్ మంజూరీ కి ఆమోదించడం జరిగింది. 8 మంది ఎస్టీ లబ్ధిదారులకు దాదాపు 19 లక్షల రాయితీ మంజూరీ కమిటీ సభ్యులతో చర్చించి అమోదించడం జరిగిందని తెలిపారు..ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవీందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వీరన్న,ట్రాన్స్పోర్ట్ అధికారి నరేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

**నీటి సరఫరా, విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి**

**పాఠశాలల్లో హాజరు శాతం పెంచేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి**

**ఏఐ (AI) ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు అధునాతన బోధన**

**కాల్వ శ్రీరాంపూర్ మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల పనితీరును సమీక్షించిన కలెక్టర్**




**పెద్దపల్లి, (కాల్వ శ్రీరాంపూర్) సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి)**

ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.శనివారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. విద్య, తాగునీటి సరఫరా,పారిశుధ్యం మహిళా శిశు సంక్షేమం, ఎలక్ట్రిసిటీ, వ్యవసాయం, తదితర కీలక అంశాలపై అధికారులకు పలు సూచనలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,,అభివృద్ధి పనులు, మౌలిక వసతులు,నీటి సరఫరా, ఎలక్ట్రిసిటీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, 'విబిజీ రాంజీ' పథకం కింద పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరు కావడం లేదని, విద్యార్థులు సరిగా హాజరు కాకపోవడం వల్ల ఉపాధ్యాయులకు బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సహాయంతో అడ్మిషన్ల సంఖ్య పెంచేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమస్య పరిష్కారానికి పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరును పకడ్బందీగా పర్యవేక్షించాలని తెలిపారు.విద్యార్థులు సౌలభ్యం కోసం ప్రత్యేక నిధులతో తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, చాలా పాఠశాలల్లో అధునాతన ఏఐ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశామని, సాధారణంగా ఆరు నెలల్లో నేర్చుకునే విషయాలను ఈ ల్యాబ్స్ ద్వారా కేవలం 45 రోజుల్లోనే నేర్చుకోవచ్చని, ఉపాధ్యాయుల ద్వారా ఈ ల్యాబ్స్‌లో అధునాతన బోధన అందిస్తున్నామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుడప్పుడు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడాలని, ఏఐ ల్యాబ్స్‌ను పరిశీలించాలని కోరారు. దీనివల్ల ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనా విధానం తల్లిదండ్రులకు అర్థమవుతుందని అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సపోర్టివ్‌గా ఉంటే, వారు మరింత ఉత్సాహంగా విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తారని పేర్కొన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని, ఆరోగ్యలక్ష్మి పథకం సేవలు సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని పురాతన ఆరోగ్య కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు ప్రామిక ఆరోగ్య కేంద్రం లోని సౌకర్యాల వైద్య సేవల గురించి పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీమాల, ఎంపీడీవో సురేందర్ కుమార్, తహసీల్దార్ రాముడు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# సీఎం రాక.. అధికార యంత్రాంగం సన్నద్ధం!

**అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..**

**మంత్రి తుమ్మల**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 26 (వుదయం ప్రతినిధి):**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్డు సమీపంలోని మైదానంలో బహిరంగ సభలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శాఖల వారీగా సమన్వయం చేసుకుంటూ నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని మంత్రి సూచించారు. పోలీసు అధికారులు ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.జిల్లా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రజలు చిరకాలం గుర్తుంచుకునేలా సేవలు అందిస్తూ జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.ఈసమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు,వృద్ధులసంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధర్మపురి ఆసుపత్రిలో డాక్టర్ అర్చన ఆకస్మిక తనిఖీ

**వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి**



**ధర్మపురి, సెప్టెంబర్26 (వుదయం ప్రతినిధి):**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ యంత్రాంగం అప్రమత్తమైంది.శనివారం జగిత్యాల జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ అర్చన ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీ ఆసుపత్రి వర్గాల్లో ఒక్కసారిగా చర్చనీయాంశమైంది.రికార్డులు, ఓపీ, ఐపీ,రిజిస్టర్లతో గత కొన్ని రోజులుగా నమోదవుతున్న జ్వరం కేసుల నివేదికలను డాక్టర్ అర్చన క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు చేసిన రక్త పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో వివిధ అనారోగ్య సమస్యలతో,ముఖ్యంగా జ్వరంతో బాధపడుతూ ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల దగ్గరకు డాక్టర్ అర్చన స్వయంగా వెళ్లారు.వారికి అందుతున్న వైద్యం, పారిశుద్ధ్య పరిస్థితుల గురించి రోగులతో మాట్లాడి వివరాలు సేకరించారు.రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని డాక్టర్ అర్చన ఆదేశించారు.జ్వరం లక్షణాలతో వచ్చే ప్రతీ రోగికీ సకాలంలో పరీక్షలు నిర్వహించి,తగిన మందులు అందించాలని స్పష్టం చేశారు.ఆసుపత్రి భవనం చుట్టూ తిరుగుతూ పరిసరాలను డాక్టర్ అర్చన పరిశీలించారు. అక్కడ నిల్వ ఉన్న నీటిని గుర్తించి,దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారకుండా వెంటనే లార్వా నిర్మూలన చర్యలు చేపట్టాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు.పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ అర్చనతో పాటు స్థానిక ఆసుపత్రి వైద్య అధికారి, ఇతర వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో వికసిత్ గ్రామ పంచాయితీ ప్లాన్ (వీజీపీపీ) పైన శిక్షణ...

**జగిత్యాల సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి)**





జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు మండల పంచాయితీ అధికారులకు సర్పంచులకు అదనపు కార్యక్రమ అధికారులకు ఇంజనీరింగ్ కన్సల్టెంట్ లకు సాంకేతిక సహయకులకు పంచాయితీ కార్యదర్శులకు వికసిత్ గ్రామ పంచాయితీ ప్లాన్ (వీజీపీపీ) పైన శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో భాగంగా ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడానికై జలసిరి పనులు అనగా పంటకుంటలు(ఫారం పాండ్) ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఊటకుంటలు బోరు బావుల రీచార్జ్ నిర్మాణాలు వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు మొదలగు పనులను చేపట్టుటకు అవగాహణ కల్పించడం జరిగింది. అదే విధంగా ప్రజా ప్రతినిదులు మండల గ్రామ స్థాయి అధికారులందరు కలిసి ప్రజలందరిని పూర్తి స్థాయిలో భాగస్వాములను చేస్తూ గ్రామ అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల పనులను (నీటి సంరక్షణ పనులకు ఎక్కువ ప్రాధాన్యతను) గుర్తిస్తూ అక్టోబర్ 2వ ప్రత్యేక గ్రామ సభ నిర్వహించి ఈ పనులంన్నింటిని ఆమోదించుకొనసినదిగా తెలుపడం జరిగింది ఇట్టి శిక్షణా కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి రాజ గౌడ్ జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి డిఆర్ డివో రఘువరణ్ డీపీవో మదన్ మోహన్ ఎంపిడిఓ లు ఎంపిఓ లు కార్యదర్శులు సర్పంచ్లు తదితరులు పాల్గొనడం జరిగింది.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి సమాజానికి ఆదర్శం: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి):**



కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆమె 131వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ తెలంగాణ చరిత్రలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు, నిబద్ధత, పోరాట పటిమ నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సామాజిక అసమానతలు, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం ప్రజాస్వామ్య విలువలను, సమానత్వ భావనను మరింత బలోపేతం చేసేలా ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, హక్కులు, గౌరవం కల్పించడమే చాకలి ఐలమ్మ ఆశయాలకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సమానత్వం, మహిళా సాధికారత, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ సేవలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడంతో పాటు, ఆమె ఆశయాల సాధన దిశగా సమాజం ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై.గిరి, తహసీల్దార్ హిమబిందు, బీసీ సంక్షేమ అధికారి నర్సయ్య, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఉప్పు ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ కాసర్ల గోదావరి స్వామి, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు నీల నాగరాజు, సాప శివరాములు, కొత్తపల్లి మల్లయ్య, మహేశ్, రాజయ్య, శ్రీకాంత్, గణేష్, విఠల్, వినోద్, నాగభూషణం, టీఎన్జీవోస్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, నరేష్, పవన్, స్వామి, సునీత, విజయశాంతి, శాంతయ్య, కృష్ణప్రసాద్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం

**-జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**మంచిర్యాల /సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి)**



భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూమికోసం,భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని తెలిపారు. ఆత్మగౌరవం కోసం నాటి దొరల రాచరిక పాలనను వ్యతిరేకిస్తూ ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని తెలిపారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, ధైర్యసాహసాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ద్వారా వారి త్యాగాలు, ఆశయాలు, పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కస్బా ఉన్నత పాఠశాల భవంతిని బీసీ బాలుర వసతి గృహంగా వినియోగించాలి

**త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా 26 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**

నిర్మల్ పట్టణంలోని కస్బా ఉన్నత పాఠశాల భవంతిని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంగా వినియోగించేందుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టర్ కస్బా ఉన్నత పాఠశాల భవంతిని పరిశీలించారు. ఖాళీగా ఉన్న భవంతిని బీసీ విద్యార్థుల వసతి గృహంగా మార్చి, వీలైనంత త్వరగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవంతిలో అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టి, విద్యార్థులకు అనుకూలమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహం అందుబాటులోకి వస్తే బీసీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. తకలెక్టర్ వెంట డీఈవో భోజన్న, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, సహాయ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, తహసిల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ స్టేట్ అండర్-23 క్రికెట్ జట్టుకు ఎంపికైన రాహుల్ యాదవ్‌కు ఘన సన్మానం



**కామారెడ్డి, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి):**

ఇటీవల తెలంగాణ స్టేట్ అండర్- 23 క్రికెట్ జట్టుకు ఎంపికైన ధనగర రాహుల్ యాదవ్ ను కామారెడ్డి మున్సిపల్ 10 వార్డు కౌన్సిలర్ కాసర్ల మాధవి రవీందర్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కాసర్ల మాధవి రవీందర్ మాట్లాడుతూ, రాహుల్ యాదవ్ తెలంగాణ స్టేట్ అండర్–23 జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి ఆడి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని, క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు. రాహుల్ యాదవ్ తన ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో క్రికెట్ టీం కెప్టెన్ పృథ్వీరాజ్, రామ్ యాదవ్, తిలక్, వెంకట రమణ, శ్రీను, కార్తీక్, నరేష్, నవీన్, మనోహర్ యాదవ్, రావుల్ యాదవ్, సాయి పవన్, సంపత్, అబ్దుల్ మాలిక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి):**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తికోసం భూస్వామ్య శక్తులకు ఎదురొడ్డి నిలిచిన అసమాన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళా చైతన్యానికి, ఆత్మగౌరవానికి ఆమె ప్రతీక అని, ఆమె ఆశయాలను, సమాజంలో ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# పర్యాటక అభివృద్ధికి జిల్లాలో అపార అవకాశాలు: కలెక్టర్

**మంచిర్యాల /సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి)**



ప్రకృతి వనరులు, పర్యావరణ సమతుల్యత, చారిత్రక, ఆధ్యాత్మిక, సాహస పర్యాటకానికి జిల్లాలో అపార అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వేడుకలకు జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, జిల్లా పర్యాటక నోడల్ అధికారి & ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు లతో కలిసి హాజరై మంచిర్యాల జిల్లా పర్యాటక స్థలాల గురించి జిల్లా టూరిజం నోడల్ ఆఫీసర్ & ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తయారు చేసిన మంచిర్యాల టూరిజం డిపార్ట్మెంట్ లోగోతో పాటు టూరిజం మ్యాగజైన్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు ఉన్న సామర్థ్యంతో పోలిస్తే ప్రస్తుతం పర్యాటకుల రాక తక్కువగా ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను విస్తృతంగా ప్రచారం చేసి పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరాలను మ్యాగజైన్‌తో పాటు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎకో టూరిజంతో పాటు టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామని, సాహస పర్యాటకానికి అనువైన ప్రాంతాలలో రాక్ క్లైంబింగ్ వంటి కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు, శివ్వారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వంటి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశాలను పరిశీలించాలని, తాడోబా వైపు వెళ్లే మార్గంలో మంచిర్యాల జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యాటకం ద్వారా వచ్చే ఆదాయాన్ని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సముచితంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యార్థులను వివిధ పర్యాటక ప్రదేశాలకు ఎక్స్కర్షన్‌లకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు పర్యాటకంపై క్విజ్‌లు, పోటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా పర్యాటక ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించవచ్చని, ప్రజలు, అధికారులు, సంబంధిత శాఖలు సమిష్టిగా కృషి చేస్తే జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు కొనసాగుతున్నాయని, గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# టి ఆర్ ఎస్ లోకి ఆధ్యాత్మిక గురువు నారాయణస్వామి చేరిక

**నారాయణపేట సెప్టెంబర్ 26(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా దామర్‌గిద్ద మండలం ఆశన్‌పల్లి గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక గురువు, శివశక్తి పీఠం అధిపతి నారాయణ స్వామి తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు.ఈ సందర్భంగా నారాయణ స్వామికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ సాదరంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో అనేక ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నారాయణ స్వామి పార్టీలో చేరడం సంతోషకరమైన విషయమన్నారు. గోశాల నిర్వహణతో పాటు ఆశన్‌పల్లి గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టడం, పేద కుటుంబాల వివాహాలకు తాళిబొట్లు అందించడం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సేవాభావం కలిగిన వ్యక్తులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం క్యాతన్‌పల్లి గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కవిత అక్క ముఖ్యమంత్రి కావాలని, ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉద్యోగాల కల్పన, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి అంశాలపై ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టే అవకాశం కల్పించాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత అక్క పేరుతో ప్రత్యేక అర్చన కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దామర్‌గిద్ద మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, ఆశన్‌పల్లి గ్రామ ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, యువ నాయకులు రమేష్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

# వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి జిల్లా ఎస్పీ డాక్టర్



- **సంగ్రామ్ సింగ్ జి పాటిల్**

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 26 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఎస్పీ ఘన నివాళులర్పించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, అన్యాయంపై ఆమె సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "ఈ భూమి నాది.. పండించిన పంట నాది.. తీసుకెళ్లడానికి దొర ఎవ్వడు.. నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు" అంటూ మాటల్ని తూటాలుగా మలచుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు .ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, పోలీస్ కార్యాలయ ఏవో కృష్ణయ్య, ఆర్ఐ జగన్, ఎస్ఐలు రమేష్, వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, గౌస్ పాషా, శివాజీలతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లాలో వినాయకు నిమజ్జనంలో విషాదం



- **రుద్రారం పెద్ద చెరువులో ఇద్దరు యువకులు గల్లంతు**
- **అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు**
- **యువకుల కోసం చెరువులో గాలింపు ముమ్మరం**

**దుబ్బాక/అక్బర్ పేట-భూంపల్లి సెప్టెంబర్ 26, వుదయం :**

సిద్దిపేట జిల్లాలో వినాయక నిమజ్జనం విషాదంగా మారింది. అక్బర్ పేటభూంపల్లి మండలం రుద్రారం పెద్ద చెరువులో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఇద్దరు యువకులు చెరువులో గల్లంతయ్యారు. రుద్రారం గ్రామానికి చెందిన పార రమేష్ (35), కలాల్ నవీన్ (25) అనే యువకులు శనివారం రెండు వినాయక విగ్రహాలను నిమజ్జనం కోసం చెరువు కట్టకు తీసుకెళ్లారు. నిమజ్జనం అనంతరం చెరువులో స్నానం చేస్తుండగా ఇద్దరూ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయారని స్నేహితులు తెలిపారు. గమనించిన తోటి స్నేహితులు వెంటనే గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. విషయం గ్రామస్తులకు తెలియడంతో చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. అయితే నిమజ్జనం కోసం చెరువు కట్టకు వచ్చే భక్తుల కోసం అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో ఇద్దరు యువకులు గల్లంత కావడంతో రుద్రారం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి.

# విద్యుత్ స్తంభాన్ని చుట్టుముట్టిన తీగజాతి మొక్కలు

నిజాంపేటమండల కేంద్రంలో విద్యుత్ స్తంభాన్ని తీగజాతి మొక్కలు చుట్టుముట్టడంతో పాటు స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. స్తంభం చుట్టూ పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలు పెరగడంతో విద్యుత్ లైన్ల నిర్వహణపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలే అవకాశం ఉండటంతో సంబంధిత అధికారులు స్పందించి స్తంభం చుట్టూ ఉన్న మొక్కలను తొలగించి, వైర్లను సక్రమంగా అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

- **కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దు**
- **అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల, సెప్టెంబర్ 26 (వుదయం కరస్పాండెంట్)**

2026-27 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు నిర్వహించిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలివస్తే అడ్డుకోవడంతో పాటు, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా తమకు నచ్చిన మిల్లులకు అధిక మొత్తంలో ధాన్యం కేటాయించడం, ఇతర అక్రమాలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ రైతులు ఎంతో కష్టపడి వరి సాగు చేశారని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను సంబంధిత ఇన్‌చార్జ్‌లు మాత్రమే నిర్వహించాలని, వారి స్థానంలో ఇతరులు కేంద్రాలను నిర్వహించినట్లు తేలితే సస్పెన్షన్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, ఓపీఎంఎస్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వివరాలను సకాలంలో నమోదు చేయడం ద్వారా రైతులకు చెల్లింపులు కూడా త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులు తరచూ తనిఖీ చేసి పర్యవేక్షించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, డీఏఓ వీరప్ప, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, సహకార శాఖ అధికారి టైటాస్ పాల్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల హక్కులు, వృద్ధాశ్రమాల నిర్వహణపై అవగాహన సదస్సు

**వనపర్తి సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి)**

వృద్ధాశ్రమాల నిర్వహణ, వయోవృద్ధుల హక్కులు మరియు చట్టాలపై అవగాహన కార్యక్రమంవయోవృద్ధులు తమకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు మరియు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి తెలిపారు.వనపర్తి జిల్లా సంక్షేమ శాఖ (DWO) ఆధ్వర్యంలో ఈరోజు రిటైర్డ్ పెన్షనరీ బిల్డింగ్‌లో వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం వృద్ధాశ్రమాలలో వయోవృద్ధులకు మెరుగైన సేవలు అందే విధంగా వాటి పనితీరు, నిర్వహణ మరియు పరిపాలన సక్రమంగా ఉండేలా చూడటం గురించి అవగాహన కల్పించడం జరిగింది. వృద్ధాశ్రమాలలో వయోవృద్ధులకు అవసరమైన సౌకర్యాలు, భద్రత, ఆరోగ్యం, ఆహారం మరియు సంరక్షణ వంటి అంశాలపై చర్చించడం జరిగింది. అదేవిధంగా తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, 2007 ప్రకారం వయోవృద్ధులకు కల్పించబడిన హక్కులు, రక్షణలు మరియు చట్టపరమైన సహాయాన్ని ఏ విధంగా వినియోగించుకోవచ్చనే అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.



వయోవృద్ధులు తమకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు మరియు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారీ శ్రీమతి.K. సుధారాణి , జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు శ్రీ సూర్యనారాయణ, శ్రీ నరసింహులు గౌడ్ , శ్రీ శ్రీనివాసు, శ్రీమతి చిన్నమ్మ తామస్, శ్రీ వీరయ్య పద్మావతి మరియు శ్రీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి శ్రీ అహ్మద్ అమీర్ , అమృతమ్మ CDPO వనపర్తి గారు పాల్గొని వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, వృద్ధాశ్రమాల నిర్వాహకులు మరియు సంబంధిత ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలి







- **బాల్య వివాహాలు నిర్వహించే మత పెద్దలపై చట్టపరమైన చర్యలు .**
- **బాల్య వివాహ రహిత జిల్లాగా సంగారెడ్డి .. జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి .**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 26:వు దయం:**

బాల్య వివాహల నిర్మూలనకు మత పెద్దలు తమవంతు సహకారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి కోరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, స్కోప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో బాల్య వివాహంతో బతుకు ఆగం-బాల్య వివాహ నిషేధ చట్టం2006 అంశంపై శనివారం జిల్లాలోని పూజారులు, పాస్టర్లు, ముస్లిం మత పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు నిర్వహిస్తే సంబంధిత మత పెద్దలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివాహాలు నిర్వహించే సమయంలో వధూవరుల పుట్టిన తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలని మత పెద్దలకు సూచించారు.

అన్ని మతాల మత పెద్దల సహకారంతో సంగారెడ్డి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు.

జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ రాజా రెడ్డి మాట్లాడుతూ .. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అన్ని శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, మత పెద్దలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.డీసీఆర్‌బీ సీఐ రమేష్ మాట్లాడుతూ .. బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరంగా శిక్షలు ఉంటాయని, రూ.1 లక్ష వరకు జరిమానా, రెండేళ్ల వరకు కారాగార శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీవో) రత్నం మాట్లాడుతూ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. బాల్య వివాహాల నివారణలో మత పెద్దల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. స్కోప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీ ఉప్పలయ్య మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు వెంకటేశం, విష్ణుమూర్తి, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ యాదగిరి, డీసీపీయూ సిబ్బంది లింగం, జిల్లాలోని సుమారు 100 మంది మత పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుండె నిబ్బరానికి 'కృత్రిమ మేధ' బలం!

- **నిశ్శబ్ద మరణాలకు కళ్లెం వేసేలా జమ్మలమడుగులో వైద్య విప్లవం**
- **29న 'కృత్రిమ మేధ శ్రవణ పరికరం'తో గుండె సంరక్షణ.. డిజిటల్ వైద్యానికి శ్రీకారం**
- **సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాణ రక్షణ.. పరికరాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**
- **వడ్డేపల్లిని వేధిస్తున్న ఇంజనీరింగ్ గ్రహణం.. త్వరలోనే 'సహాయ ఇంజనీర్' కేటాయింపునకు హామీ**

**వడ్డేపల్లి సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి)**

గుండె ఆగితే ఆయువు ఆగిపోతుంది.. కానీ, ఆ ఆగుతున్న గుండె చప్పుడు ముందే గ్రహిస్తే? ప్రాణాలు నిలుస్తాయి! జీవనశైలి మార్పులతో ముంచుకొస్తున్న గుండె జబ్బుల ముప్పును ముందే తుంచేసేందుకు కృత్రిమ మేధస్సు అస్త్రంగా మారుతోంది. కార్పొరేట్ వైద్యశాలలకే పరిమితమైన ఆ అత్యాధునిక సాంకేతికతను ఇప్పుడు నిరుపేద సామాన్యుడి ముంగిటకు తెస్తూ వడ్డేపల్లి పురపాలక సంఘం ఒక వినూత్న అడుగు వేసింది. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న 7వ వార్డు జమ్మలమడుగు ప్రాథమిక పాఠశాల వేదికగా 'కృత్రిమ మేధ శ్రవణ పరికరం' (ఏఐ స్టెతస్కోప్) సాంకేతికతతో భారీ ఉచిత హృదయ నిర్ధారణ శిబిరానికి వేదిక సిద్ధమైంది. కృత్రిమ మేధ గురి.. గుండెపై పక్కా నిఘా! సాధారణ శ్రవణ పరికరం వినలేని గుండె సంకేతాలను కూడా కృత్రిమ మేధస్సు నిమిషాల్లో విశ్లేషిస్తుంది. ఈ బృహత్తర కార్యక్రమానికి కలెక్టర్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించిన బీసీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాసులు, పురపాలక సంఘ అధ్యక్షుడు మంజుల ధర్మ, కౌన్సిలర్ డాక్టర్ విజయభాస్కర్.. ఉచిత పరీక్షలకు ఉపయోగించే కృత్రిమ మేధ శ్రవణ పరికరాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ "వైద్య నిర్లక్ష్యానికి చెక్ పెట్టి ముందస్తు పరీక్షలతో నిండు ప్రాణాలను కాపాడటమే తమ ప్రధాన ధ్యేయం" అని ఉద్ఘాటించారు. ప్రగతికి ఇంజనీరింగ్ గ్రహణం.. కలెక్టర్ కఠిన హామీ! ఒకవైపు ప్రజారోగ్య పరిరక్షణకు శ్రీకారం చుడు తూనే.. మరోవైపు వడ్డేపల్లి పురపాలక సంఘాన్ని పట్టి పీడిస్తున్న సమస్యపై ప్రజాప్రతినిధులు దండయాత్ర చేశారు. పురపాలక సంఘం ఏర్పడినా సహాయ ఇంజనీర్ (ఏ.ఈ) లేకపోవడంతో అభివృద్ధి పనులకు 'సాంకేతిక గ్రహణం' పట్టిందని కలెక్టర్ వద్ద ఘాటుగానే వెళ్లగక్కారు. రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి వ్యవస్థలు నాణ్యతా ప్రమాణాలు లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు.ఆరోగ్యానికి సాంకేతికత.. ప్రగతికి పాలనా బలం జోడిస్తూ ప్రజాప్రతినిధులు వేసిన ఈ అడు గులు స్థానికంగా ప్రకంపనలు సృష్టిస్తు న్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తిమ్మప్ప, ప్రతినిధులు నాగరాజు, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



# ఉపసర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడిగా దోర్నాల యాదగిరి ఏకగ్రీవం

**అక్బర్ పేట భూంపల్లి సెప్టెంబర్ 26 ( వుదయం ప్రతినిధి )**

అక్బర్‌పేట భూంపల్లి మండల ఉపసర్పంచుల ఫోరమ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు మాదుగూరి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అక్బర్ పేట భూంపల్లి మండల ఫోరమ్ అధ్యక్షుడిగా చిట్టాపూర్ ఉపసర్పంచ్ దోర్నాల యాదగిరి, ఉపాధ్యక్షుడిగా ఖాజీపూర్ ఉపసర్పంచ్ దక్షిణమూర్తి, జనరల్ సెక్రటరీగా పాతూరి నవీన్ గౌడ్, కోశాధికారిగా జీడిపల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారులుగా మాచపురం ప్రశాంత్, గుర్జాల చంద్రంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ..మండలంలో ఉపసర్పంచుల ఐక్యతను కాపాడుకుంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచులు ఎల్లం, అజయ్, రజినీకాంత్, కనకరాజు, స్వామి, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.





# గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యులదే కీలక పాత్ర ఎంపీడీవో వినోద్ కుమార్

- **అల్వాల రైతు వేదికలో వార్డు సభ్యులకు మూడు రోజుల శిక్షణ**
- **శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్ల అందజేత**

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 26, వుదయం:**

గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపీడీవో వినోద్ కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని వార్డు సభ్యులకు పంచాయతీరాజ్, గ్రామీణ శాఖ ఆధ్వర్యంలో అల్వాల రైతు వేదికలో మూడు రోజుల పాటు కొనసాగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వార్డు సభ్యులకు గ్రామాల అభివృద్ధిలో వారి పాత్ర, హక్కులపై అధికారులు అవగాహన కల్పించారు. వార్డు అభివృద్ధిలో సభ్యులదే కీలక పాత్ర అని, ప్రభుత్వం కల్పించే ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందేలా వార్డు సభ్యులు కృషి చేయాలని సూచించారు. వార్డు సభ్యులు కలిసికట్టుగా ఉండి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విన్నవించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు ఎంపీడీవో వినోద్ కుమార్, ఎంపీవో ఫహీం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వీరవనిత చాకలి ఐలమ్మకు నివాళి



**సంగారెడ్డి, వుదయం:**

సంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు జి.అంజయ్య, కార్యదర్శి ఎం.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. దొరల పాలనను ధిక్కరించి వెట్టి చాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం నిర్భయంగా పోరాడిన ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**మహబూబ్ నగర్**

మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పద్మావతి కాలనీ లో ఘనంగా నిర్వహించిన చాకలి ఐలమ్మ గారి జయంతి వేడుకల్లో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్ , డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఐలమ్మ గారి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన వీరోచిత పోరాటాలు, త్యాగాలు నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ గారు,గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి గారు,మార్కెట్ కమటి చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి గారు ,పలు డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 31వ చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా అన్నదానం

**వుదయం, సిద్దిపేట**

సిద్దిపేట రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షులు భూంపల్లి లింగస్వామి, నారాయణరావుపేట శ్రీనివాస్, మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ స్ఫూర్తిని



యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వారు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రాజలింగం, కనకరాజు,వైకుంఠం, శ్రీనివాస్, యాదగిరి, పోచయ్య,తో పాటు పలువురు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక శిక్షణ

- 35 రోజుల ఆన్‌లైన్ స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆంగ్ల భాషకు బలమైన పునాది వేయాలి
- పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు ఆంగ్ల భాష ఎంతో కీలకం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, సెప్టెంబర్ 26 (వుదయం బ్యూరో)**



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆంగ్ల భాషలో మాట్లాడే నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు నిర్వహిస్తున్న 35 రోజుల ఆన్‌లైన్ స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ సమావేశం ద్వారా విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, ఉన్నత విద్యతో పాటు వృత్తిపరమైన, సామాజిక రంగాల్లోనూ ఆంగ్ల భాషలో మాట్లాడే నైపుణ్యానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఉపాధ్యాయులు ముందుగా తమ ఆంగ్ల భాషా సామర్థ్యాలను పెంపొందించుకుని, ఆ నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలని సూచించారు. నిరంతరం సాధన చేస్తే ఆంగ్లంలో మాట్లాడటం క్రమంగా అలవాటుగా మారుతుందని పేర్కొన్నారు. పాఠశాలలో తెలుగు, హిందీ బోధించే ఉపాధ్యాయులను మినహాయించి మిగతా ఉపాధ్యాయులు సాధ్యమైనంత వరకు విద్యార్థులను ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులు ఈ శిక్షణలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థుల్లో చదవడం, అర్థం చేసుకోవడం, ఆంగ్లంలో మాట్లాడే సామర్థ్యాలను ప్రాథమిక స్థాయి నుంచే అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఆంగ్ల పఠన సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిరోజూ సాధన చేయించాలని, వారు సులభంగా ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో కలిసి ఫిన్లాండ్‌లోని విద్యా వ్యవస్థపై అధ్యయనం చేసేందుకు వెళ్లి వచ్చిన విషయాన్ని కలెక్టర్ ప్రస్తావించారు. ఇటువంటి విదేశీ పర్యటనలు, శిక్షణా కార్యక్రమాల్లోనూ ఆంగ్ల భాషా నైపుణ్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యంతో పాటు మంచి రాత, విషయాన్ని స్పష్టంగా వివరించే సామర్థ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అధికారిక లేఖలు, దరఖాస్తులు, అవార్డులకు సంబంధించిన ప్రతిపాదనలు, నివేదికలను సులభంగా, స్పష్టంగా రూపొందించేందుకు ఈ నైపుణ్యాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, భవిష్యత్ ఉద్యోగ అవకాశాల్లోనూ ఆంగ్ల భాషా పరిజ్ఞానం కీలకంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మారుతున్న కాలానికి, ఉద్యోగ రంగంలోని అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడంలో ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులను భవిష్యత్ అవకాశాలకు సిద్ధం చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో భాషా, కమ్యూనికేషన్ నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని కోరారు. హైదరాబాద్‌కు చెందిన ఇంగ్లీష్ శిక్షకుడు రామేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న 35 రోజుల శిక్షణలో ఉపాధ్యాయులు ప్రతిరోజూ చురుకుగా పాల్గొని, నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో ఆచరణలో పెట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రతిరోజూ కొత్త విషయాన్ని నేర్చుకునే అలవాటును కొనసాగిస్తూ, ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, శిక్షకులు రామేశ్వర్ గౌడ్, ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల రక్షణలో 'లేడీ సింగం'

- గణేష్ నిమజ్జనాల్లో ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల సమర్థ నాయకత్వం..
- అభినందనల వెల్లువ!

**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 26 సెప్టెంబర్**



నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గణపతి నిమజ్జన కార్యక్రమాలను అత్యంత ప్రశాంతంగా, క్రమబద్ధంగా, విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల, IPS చూపిన నాయకత్వ పటిమపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. భక్తి, ఆధ్యాత్మికత, విపరీతమైన ఉత్సాహంతో వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ ఉత్సవాల్లో శాంతిభద్రతలను కాపాడటంలో ఆమె వహించిన పాత్ర జిల్లా పోలీసు శాఖకే గర్వకారణంగా నిలిచింది.

**ముందస్తు ప్రణాళిక.. క్షేత్రస్థాయిలో ఉక్కు పర్యవేక్షణ**

భారీ రద్దీ ఉండే నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, ప్రాధాన్య ప్రాంతాలు, నిమజ్జన ఘాట్ల వద్ద భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేయడంలో ఎస్పీ చాకచక్యం వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకలు, ఊరేగింపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చేశారు. స్వయంగా రాత్రింబవళ్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు అందిస్తూ సమర్థవంతమైన పరిపాలనా దక్షతను చాటుకున్నారు.

**సమన్వయం - అంకితభావం**

గణపతి ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అంశాన్ని పర్యవేక్షించడంలో ఎస్పీ చూపిన చొరవ అభినందనీయం. పరిస్థితులకు అనుగుణంగా తక్షణ నిర్ణయాలు తీసుకుంటూ, పోలీసు సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచారు. ఒకవైపు భక్తుల భావోద్వేగాలు, విశ్వాసాలను గౌరవిస్తూనే.. మరోవైపు ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిచ్చి రెండింటినీ సమతుల్యంగా నిర్వహించారు.

**సున్నిత ప్రాంతాల్లో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన పోలీస్ యంత్రాంగం**

రాష్ట్రంలోనే భైంసా, నిర్మల్ వంటి ప్రాంతాలను సున్నితమైనవిగా పరిగణించే నేపథ్యంలో, గడిచిన కొన్నేళ్లుగా అక్కడ ఎలాంటి చిన్నపాటి అవాంఛనీయ ఘటనకూ తావులేకుండా శాంతిభద్రతలను కాపాడటంలో ఎస్పీ జానకి షర్మిల చూపిన ధైర్యసాహసాలు, వ్యూహాత్మక ఆలోచనలు విశేషంగా నిలిచాయి. హిందూముస్లిం మత పెద్దలతో ముందస్తుగా శాంతి సమావేశాలు నిర్వహించడం, అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చి "భాయ్ భాయ్" నినాదాలతో ఉత్సవాలను సోదరభావంతో జరుపుకునేలా ప్రోత్సహించడం ఆమెకే చెల్లింది. గతం కంటే భిన్నంగా ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకాన్ని పెంచుతూ, ప్రతి ఒక్కరిని కలుపుకుని పోయే విధానం వల్ల జిల్లా వ్యాప్తంగా మతసామరస్యం వికసించి, సున్నిత ప్రాంతాలు కూడా ప్రశాంతతకు నిలయాలుగా మారాయి.

**ప్రజల భద్రతే లక్ష్యంగా నిర్మల్ పోలీస్!**

ఆమె మార్గదర్శకత్వంలో రాత్రింబవళ్లు శ్రమించిన పోలీస్ అధికారులు, సిబ్బంది చూపిన క్రమశిక్షణ, అప్రమత్తత కూడా ప్రత్యేకంగా నిలిచాయి. "ముందస్తు ప్రణాళికతో భద్రత.. క్షేత్ర స్థాయి పర్యవేక్షణతో సమర్థ నిర్వహణ" అనే నినాదంతో విధి నిర్వహణలో నిబద్ధత చాటిన ఎస్పీ డాక్టర్ జానకి షర్మిలకు, జిల్లా పోలీసు యంత్రాంగానికి స్థానిక ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.

# అంగన్వాడీ సేవలకు ఘన సన్మానం

- పెద్దమారూర్ గ్రామంలో 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమం
- నాగర్ కర్నూలు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మ యాదవ్
- మండల బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య

**చిన్నంబావి మండలం 26 వుదయం రిపోర్టర్**



చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్దమారూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం చిన్నంబావి మండల బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలు, చిన్నారులు మరియు గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లను సన్మానించారు. అనంతరం పౌష్టికాహార ప్రాధాన్యతపై నిర్వహించిన 'మాటా ముచ్చట' కార్యక్రమంలో పాల్గొని, పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్యమైన పౌష్టికాహారం ఎంతో అవసరమని వివరించారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర సమాజం చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలలో పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారం విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను అభినందించారు. అంగన్వాడీ-ఆశా వర్కర్లకు సత్కారం గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య, పోషకాహారంపై అవగాహన కల్పించడంలో అంగన్వాడీ, ఆశా వర్కర్ల పాత్ర ఎంతో ముఖ్యమని కార్యక్రమంలో కొనియాడారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న వారిని గుర్తించి శాలువాల తో సన్మానించడం ద్వారా వారి సేవలకు ప్రోత్సాహం కల్పించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ చిన్నంబావి మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, అంగన్వాడీ సేవలపై అవగాహన కల్పిస్తూ ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య, మండల ఉపాధ్యక్షులు గణేష్‌రెడ్డి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు దాసరి నారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవ పోరాటానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తి ప్రతీక

- ఆమె పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శం : జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

**గద్వాల సెప్టెంబర్ 26 (వుదయం కరస్పాండెంట్)**




అన్యాయం, నిరంకుశత్వాన్ని ఎదిరించి ఆత్మగౌరవం కోసం వీరోచితంగా పోరాడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సామాజిక అన్యాయాన్ని, నిరంకుశత్వాన్ని ధైర్యంగా ఎదుర్కొని మొక్కవోని సంకల్పంతో పోరాడిన చాకలి ఐలమ్మ తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. ఆమె పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.

మహిళా చైతన్యం, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఎస్పీ తెలిపారు. మహిళలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధ దళ డీఎస్పీ నరేందర్ రావు, కార్యాలయ ఏఓ సాయికృష్ణ, ఆర్ఐలు నరేష్, వెంకటేష్, హరీఫ్, డీసీఆర్బీ సీఐ టాటా బాబు, ఐటీ, డీసీఆర్బీ, ఎస్బీ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వయోవృద్ధుల గౌరవం.. భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు
- వయోవృద్ధుల హక్కులు, రక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**గద్వాల సెప్టెంబర్ 26 (వుదయం కరస్పాండెంట్)**



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 సందర్భంగా నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వయోవృద్ధుల హక్కులు, రక్షణ, సంక్షేమానికి సంబంధించిన సమాచార సంచికను జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వయోవృద్ధులను గౌరవించడం, వారి భద్రతకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చట్టపరమైన హక్కులు, వారికి అందుబాటులో ఉన్న సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. హక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే వయోవృద్ధులు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వేధింపులకు గురిచేయడం వంటి చర్యలను సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యం లేదా వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వయోవృద్ధుల రక్షణ, భద్రత, సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వయోవృద్ధుల హక్కులు, రక్షణ, సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే ఉద్దేశంతో రూపొందించిన సమాచార సంచికలను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంచుతున్నట్లు ఎస్పీ తెలిపారు. అవసరమైన సమయంలో వయోవృద్ధులు పోలీసులను సంప్రదించి సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి డి. సునంద, గద్వాల సీఐ శ్రీ టంగుటూరి శ్రీను, జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీఓ) శ్రీ బి. నర్సింహులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న మందడి లలితమ్మను



- పరామర్శించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

**చిన్నంబావి మండలం 26 వుదయం రిపోర్టర్**

చిన్నంబావి మండల కేంద్రంలోని గడ్డబసాపూర్ గ్రామానికి చెందిన జూపల్లి కృష్ణారావు గారి ముఖ్య అనుచరులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చిదంబరం రెడ్డి మాతృమూర్తి గారైన మందడి లలితమ్మ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు గడ్డంబసాపూర్ లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. కష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలవడం, ఆప్యాయతతో పరామర్శించడం ద్వారా మానవతా విలువలను చాటుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు చిదంబరం రెడ్డి కుటుంబంతో జూపల్లి కృష్ణారావు గారికి ఉన్న సన్నిహిత అనుబంధాన్ని ఈ పరామర్శ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. అనారోగ్యంతో బాధపడుతున్న మాతృమూర్తి త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. మందడి చిదంబరం రెడ్డి కుటుంబానికి గ్రామ ప్రజలు, మండల ప్రజలు తమ ఆప్యాయతను, మద్దతును తెలియజేస్తూ ఈ కష్ట సమయంలో అండగా నిలుస్తున్నారు. కష్టకాలంలో ప్రజలతో, కార్యకర్తలతో, వారి కుటుంబాలతో కలిసి నిలబడటమే నిజమైన ప్రజాసేవ అనే భావనను ఈ పరామర్శ కార్యక్రమం ప్రతిబింబించింది. మాతృమూర్తి త్వరగా ఆరోగ్యంగా కోలుకుని కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా ఉండాలని ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు, ముఖ్య అనుచరులు, ప్రజలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం



- ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక శ్రేయస్సుకు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 26 (వుదయం బ్యూరో)**

భూమి కోసం, భుక్తి కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక శ్రేయస్సు కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అధికారులు, రజక సంఘం నాయకులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 1940వ దశకంలో తెలంగాణలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. దోపిడీ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ అలుపెరుగని పోరాటం సాగించారని కొనియాడారు. ఐలమ్మతో పాటు ఎందరో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగాల ఫలితంగా భూమిలేని నిరుపేదలకు భూమి లభించేలా అనేక కార్యక్రమాలు చేపట్టబడ్డాయని తెలిపారు. ఐలమ్మ జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ సమాజానికి ఐలమ్మ చేసిన సేవలను గుర్తిస్తూ హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీకి ఆమె పేరును పెట్టడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం పలువురు వక్తలు చాకలి ఐలమ్మ పోరాటం, ధైర్యసాహసాలు, సామాజిక సేవలను స్మరించుకుంటూ ఆమెకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, అదనపు కలెక్టర్ మధుమోహన్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, బీసీ అభివృద్ధి శాఖ అధికారి అక్బర్ పాషా, రజక సంఘం, వివిధ ప్రజా సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై డీఎంహెచ్ఓ సమీక్ష



**సంగారెడ్డి వుదయం :**

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. కె. లలితా దేవి అధ్యక్షతన వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు, పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్యం (MCH), అసంక్రమిత వ్యాధుల నియంత్రణ (NCD), క్షయ వ్యాధి నియంత్రణ (TB), VPD, ఇమ్యునైజేషన్ కార్యక్రమాల అమలు తీరు, నిర్దేశిత లక్ష్యాల సాధన, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (PHC) భవనాల మరమ్మతులు, నిర్వహణ పనుల పురోగతిని పరిశీలించిన డీఎంహెచ్ఓ.. అవసరమైన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే MeePramaan యాప్‌లో సిబ్బంది హాజరు నమోదు అంశంపై సమీక్షించారు. ప్రతి ఉద్యోగి క్రమం తప్పకుండా విధులకు హాజరై, నిర్దేశిత విధానాల ప్రకారం యాప్‌లో హాజరు నమోదు చేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం (సెప్టెంబర్ 28)*ను పురస్కరించుకుని డా. మురారి రాజేంద్రప్రసాద్, SMO, తెలంగాణ.. కుక్కకాటు, రేబీస్ వ్యాధి నివారణ చర్యలపై గూగుల్ మీట్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా అధికారులు, వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డా. కె. లలితా దేవి సూచించారు. సమావేశంలో డా. నాగనిర్మల, డా. అరుణ, డా. శశాంక్ దేశ్‌పాండే, డా. సౌజన్య, డా. సీతారాం, డా. నర్సింగ్ చౌహాన్, డా. మనోహర్ రెడ్డి, డా. రాజిని, డా. శశికర్ తదితర వైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి




- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాసులు

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 26 (వుదయం బ్యూరో):**

నాగర్ కర్నూల్ జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం నాగర్ కర్నూల్ లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పత్తి తీయడం ప్రారంభించి దాదాపు 20 రోజులు కావస్తున్నా ఇప్పటివరకు సీసీఐ అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, క్వింటాకు రూ.13 వేల మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వానకాలం సీజన్ లో వర్షాలు లేక పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఉన్న పత్తినైనా అమ్ముకుని పెట్టుబడి రాబట్టుకుందామని రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు, దళారులు ఇష్టారాజ్యంగా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి తడిసి రంగు మారిందనే సాకుతో మరింత తక్కువ ధరకు కొనేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వెంటనే సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులు తీసుకొచ్చిన ప్రతి పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈ. బాలరాజు, వి. వెంకటేష్, నాయకులు తాడూరు కాశన్న, ఏ. సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో కంటి స్క్రీనింగ్ శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన DM&HO డాక్టర్ కే. సుధాకర్ లాల్







**బొంరాస్ పేట, సెప్టెంబర్ 26 (పత్రికా ప్రకటన):**

నేడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. సుధాకర్ లాల్ గారు బొంరాస్ పేట మండలం లోని బోట్లవానికుంట తాండ లో ఉన్న ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల లో విద్యార్థినిలకు నిర్వహిస్తున్న కంటి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ కంటిచూపు సమస్యలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, మంచి పోషకాహారం తీసుకోవలసిన ఆవశ్యకత గురించి విద్యార్థినులకు మరియు ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలోని కిచెన్ ను సందర్శించి అక్కడి పరిశుభ్రతను పరిశీలించి, కిచెన్ లో వంట వారితో మాట్లాడుతూ వండిన ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించేంతవరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, వ్యక్తిగత పరిశుభ్రత, కిచెన్ పరిశుభ్రత గురించి మరియు ఆహార పదార్థాల నిల్వ గురించి తగు సూచనలు చేయడం జరిగినది.

పాఠశాలలో నిర్వహించిన కంటి స్క్రీనింగ్ కార్యక్రమంలో 350 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించి, 36 మంది విద్యార్థులకు కంటి చూపు లోపాలున్నట్లు నిర్ధారించి కళ్లద్దాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని, ఇద్దరి విద్యార్థినిలకు మెల్ల కన్ను సమస్య ఉన్నట్లు నిర్ధారించి వారిని తదుపరి పరీక్షల కొరకు ఉన్నత స్థాయి ఆసుపత్రికి పంపించి అవసరమైతే శస్త్ర చికిత్స ద్వారా సరిచేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ కుమార్, ఆర్ బి ఎస్ కే వైద్య బృందం పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

# బరువు తగ్గాలా... లింఫాటిక్ చేయండి!

ఆధునిక జీవనశైలిలో బరువు తగ్గుతూ ఫిట్‌గా ఉండాలనుకోవడం అమ్మాయిలకు పెద్ద సవాలే. పొద్దున్నే లేచి జిమ్‌కి వెళ్లి బరువులు ఎత్తడం, ఆయాసం తెప్పించే వర్కౌట్లు చేయడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఇల్లు, ఉద్యోగం, పిల్లల బాధ్యతలతో ఊపిరి సలపని పనులతో బిజీగా ఉండే ఆడవాళ్లకు అయితే ఇది మరీ కష్టం. అలాంటివాళ్లు ఎలాంటి శారీరక శ్రమ చేయకుండా కేవలం నడకతోనే బరువు తగ్గి ఆరోగ్యంగా ఉండొచ్చట. దాన్నే 'లింఫాటిక్ వాకింగ్' అంటున్నారు నిపుణులు... బాలీవుడ్ నటి ఆలియా భట్ నుంచి చాలామంది సెలెబ్రిటీలు ప్రస్తుతం ఈ పద్ధతినే అనుసరిస్తున్నారట. అసలు ఏంటీ లింఫాటిక్ వాకింగ్? దీనివల్ల కలిగే వాపు, కడుపు ఉబ్బరం... వంటి సమస్యలూ వస్తాయంటున్నారు నిపుణులు.

మనం రోజూ నడిచే సాధారణ నడకకు కాస్త భిన్నంగా నడుస్తూ... కొన్ని నియమాలు పాటించాలి.

ఈ వాకింగ్ చేస్తున్నప్పుడు తల దించడం, భుజాలు వాల్చి, ఫోన్ చూస్తూ నడవడం చేయకూడదు. వెన్నెముకను నిటారుగా ఉంచి భుజాలు ఫ్రీగా వదిలి, చేతులు వెనక్కీ ముందుకూ ఆడిస్తూ నడవాలి.

నడిచేటప్పుడు డయాఫ్రమ్ పద్ధతిలో దీర్ఘశ్వాస తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఛాతీ, ఉదర భాగాలపై ఒత్తిడి పడి, లింఫ్ ఫ్లూయిడ్స్ వేగంగా కదులుతాయి. అందుకే ఈ వాకింగ్ మరీ వేగంగానూ, నెమ్మదిగానూ చేయకూడదు.



ప్రయోజనాల గురించి నిపుణులు ఏమన్నారంటే...

మన శరీరంలో రక్త ప్రసరణ వ్యవస్థలాగే లింఫాటిక్ వ్యవస్థ కూడా ఒకటి. ఇది శరీరంలో వ్యర్థాల్నీ, విష పదార్థాల్నీ బయటకు పంపి మన శరీరానికి రక్షణగా ఉంటుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అయితే శరీరంలో రక్త సరఫరాకి గుండె ఉన్నట్లు... ఈ లింఫ్ ఫ్లూయిడ్స్ పంపిణీ చేయడానికి మన లోపల ప్రత్యేక వ్యవస్థ అంటూ ఏమీ ఉండదట. మనం నడిచేటప్పుడు కండరాల కదలికలు, తీసుకునే శ్వాస ద్వారా మాత్రమే శరీరంలో వీటి ప్రసరణ జరుగుతుంది. అయితే గంటల తరబడి కుర్చీలకే పరిమితమయ్యేవాళ్లల్లో దీని ప్రసరణ తగ్గి, శరీరంలో నీరు చేరడం, కాళ్ల

ఒక మోస్తరు వేగంతోనే నడవాలి.

ప్రయోజనాలేంటి...

రోజంతా కూర్చోవడం వల్ల వచ్చే కడుపు ఉబ్బరం, కాళ్ల వాపులు తగ్గుతాయి. శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలు చెమట రూపంలో సులభంగా బయటకు పోతాయి.

అలసట తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉంటారు.

డెస్క్ జాబ్స్ చేసేవాళ్లకీ, ప్రయాణాలు చేసేవాళ్లకీ, భారీ కసరత్తులు చేయలేం అనుకునే వారికి ఈ లింఫాటిక్ వాకింగ్ మంచి ఎంపిక. రోజుకు కనీసం 20–30 నిమిషాలు ఈ పద్ధతిలో నడిస్తే మంచిది అంటున్నారు నిపుణులు.

# మధ్య రాత్రి మెలకువ వస్తుంటే..!

కొంతమందికి ఇలా పడుకోగానే అలా నిద్ర పట్టినా.. మధ్య రాత్రి మెలకువ వచ్చేస్తుంటుంది. ఇక ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా అస్సలు నిద్ర పట్టదు. దీంతో ఒత్తిడి, చిరాకు ఆవహిస్తాయి. ఇలా నిద్రలేమితో మరుసటి రోజు ఏ పని పైనా దృష్టి పెట్టలేక పోతాం. మరి, మధ్య రాత్రి మెలకువ వచ్చినా తిరిగి నిద్రలోకి జారుకోవాలంటే కొన్ని చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. కొంతమందికి లైట్లన్నీ ఆర్పేస్తేనే నిద్ర పడుతుంది. మీక్కూడా అదే అలవాటుంటే బెడ్‌రూమ్‌లో సాధ్యమైనంత తక్కువ లైటింగ్ ఉండేలా చూసుకోండి. సులభంగా నిద్ర పడుతుంది. అలాగే మధ్య రాత్రి మెలకువ వచ్చే అవకాశాలూ తక్కువగా ఉంటాయి.

మధ్య రాత్రి మెలకువ వచ్చినప్పుడు పదే పదే గడియారంలో సమయం చూసుకోకుండా అలాగే నిద్రపోండి.. ఇలా అస్తమానం టైం చూసుకుంటూ ఉంటే ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో వచ్చే నిద్ర కూడా రాకుండా పోతుంది. కాబట్టి ఎలాంటి ఆలోచనలు పెట్టుకోకుండా ప్రశాంతంగా కళ్లు మూసుకుని నిద్ర పోవడానికి ప్రయత్నించండి.

కొంతమందికి నిద్రపోయే ముందు సంగీతం వినడం, పుస్తకాలు చదవడం.. వంటి అలవాట్లుంటాయి. ఒకవేళ మీకు మధ్య రాత్రి మెలకువ వచ్చి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టకపోతే.. వేరే రూమ్‌లోకి వెళ్లి మనసుకు ఆహ్లాదం కలిగించే మ్యూజిక్ వినడమో లేదా పుస్తకం చదవడమో చేయాలి. దీంతో తిరిగి నిద్రలోకి జారుకునే అవకాశం ఉంటుంది అంటున్నారు నిపుణులు.

ధ్యానం, యోగా.. వంటి ప్రక్రియలు మానసిక ప్రశాంతతను అందించి చక్కగా నిద్ర పట్టేందుకు సహకరిస్తాయి. అలాగే ప్రతి రోజూ సాయంత్రం ఓ అరగంట వ్యాయామం చేయడమూ మంచిదంటున్నారు నిపుణులు.



రాత్రుళ్లు సుఖంగా నిద్ర పట్టాలంటే రాత్రి తీసుకునే భోజనం పాత్ర కూడా కీలకమే! ఈ క్రమంలో తేలిగ్గా జీర్ణమయ్యే పోషకాహారం తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. అలాకాకుండా కొంతమంది డైటింగ్ పేరుతో కడుపు మాడ్చుకుంటారు. మరికొందరు మరీ తక్కువగా లేదా ఎక్కువగా ఆహారం తీసుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో కూడా నిద్ర సరిగ్గా పట్టదు. దీనివల్ల మరుసటి రోజంతా చిరాగ్గా ఉంటుంది. కాబట్టి రాత్రి పడుకునే ముందు పోషకాహారం మితంగా తీసుకోవడం మంచిది.

అలాగే పగటి పూట ఎక్కువసేపు నిద్ర పోయినా రాత్రి నిద్ర పట్టకపోవచ్చు. అయితే మధ్య రాత్రి మెలకువ రావడం, తిరిగి నిద్ర పట్టకపోవడం.. వంటి సమస్యలు ఎప్పుడో ఒకసారి ఎదురైతే పర్లేదు. కానీ తరచూ ఇదే ధోరణి కనిపిస్తే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల మీ నిద్రలేమికి అసలు కారణమేంటో పరిశీలించి.. దాన్ని బట్టి తగిన చికిత్స అందించే అవకాశం ఉంటుంది.

# వేడిగా తాగుతున్నారా?

ఉదయం లేవగానే వేడి వేడి టీనో, కాఫీనో తాగనిదే ఏ పనీ మొదలుపెట్టరు చాలామంది ఆడవాళ్లు. అంతలా అది మన జీవితంలో భాగమైంది మరి. దానివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలూ ఎక్కువే. అయితే, దాన్ని ఎంత ఉష్ణోగ్రతలో తాగుతున్నారన్నదీ



ముఖ్యమే. వాతావరణం చల్లగా ఉందనో, నిద్ర పోగొట్టుకోవాలనో వేడిగా ఉండే టీ, కాఫీలు తాగడం అలవాటు కొందరికి. కానీ, బాగా వేడిగా ఉన్నవి అంటే... 65 డిగ్రీల సెంటీగ్రేడ్ కన్నా ఎక్కువ వేడిగా ఉన్నవి తాగితే 'స్క్వామస్ సెల్ కార్సినోమా' అనే ఆహార నాళ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్యాన్సర్ అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికోసం పరిశోధకులు మిలియన్ ఉమన్ స్టడీ, యునైటెడ్ కింగ్‌డమ్ బయోబ్యాంక్‌ల డేటాను తీసుకొని విశ్లేషించారు. మరీ అంత వేడిగా తాగని వాళ్లతో పోలిస్తే వీళ్లలో ఈ ప్రమాదం మూడు రెట్లు అధికమట. కాబట్టి, ఏదైనా వేడిగా తాగేముందు కొద్ది నిమిషాలు వేచి ఉండడం మంచిదంటున్నారు నిపుణులు.

# చిప్స్ తినుకుంటూ కూల్ డ్రింక్స్ తాగితే యమ డేంజర్..

చల్లని పానీయాలలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. కొన్నింటిలో కెఫీన్ కూడా ఉంటుంది. ఇవి తాగినప్పుడు తాత్కాలికంగా దాహం తగ్గినట్లు అనిపించినా, వాస్తవానికి శరీరంలో నీరు తగ్గే



అవకాశం ఉంది. అంటే డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల నీరసం, తల తిరగడం, అలసట వంటి సమస్యలు రావచ్చు. వేసవిలో శరీరానికి తగినంత నీరు అవసరం కాబట్టి నీటిని శాతాన్ని తగ్గించ కూల్‌డ్రింక్స్ తాగడం మరింత ప్రమాదకరం. ఇక చిప్స్ విషయానికి వస్తే.. చిప్స్‌లో ఉప్పు, హానికరమైన కొవ్వులు (ట్రాన్స్ ఫ్యాట్స్) ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో నీటిని తగ్గించడమే కాకుండా, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కూడా దెబ్బతీస్తాయి. దాంతో దాహం మరింత పెరుగుతుంది. ఫలితంగా మళ్లీ మళ్లీ చల్లని పానీయాలు తాగే అలవాటు పెరుగుతుంది. దీర్ఘకాలంలో బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. అందుకే కూల్‌డ్రింక్స్ తరచూ తాగే అలవాటు ఉన్నవాళ్లు వాటికి బదులుగా నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి సహజ పానీయాలు తాగడం మంచిది. ఇవి శరీరానికి తేమను అందించి, ఆరోగ్యాన్ని కాపాడుతాయి. అదేవిధంగా కూల్‌డ్రింక్స్‌తోపాటు చిప్స్‌కు బదులుగా వేయించిన మఖానా, వేరుశెనగలు లేదా తాజా పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## గుండె ఆరోగ్యంగా ఉండేందుకు రన్నింగ్ వర్సెస్ బాడీవెయిట్ స్క్వాట్స్.. ఏవి ఉత్తమం..?

వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైనది. అయితే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఏ వ్యాయామం ఎక్కువగా ఉపయోగపడుతుందనే సందేహం చాలామందికి ఉంటుంది. ముఖ్యంగా బాడీవెయిట్ స్క్వాట్స్, రన్నింగ్ రెండూ శరీరానికి మేలు చేసినప్పటికీ, వాటి ప్రయోజనాలు భిన్నంగా ఉంటాయి. రన్నింగ్ ప్రధానంగా ఏరోబిక్ వ్యాయామం కాగా, స్క్వాట్స్ కండరాల బలాన్ని పెం వ్యాయామంగా పనిచేస్తాయి. అందువల్ల గుండె ఆరోగ్యం కోసం ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలనేది వ్యక్తి వయసు, శారీరక సామర్థ్యం, ఆరోగ్య పరిస్థితి, వ్యాయామాన్ని తట్టుకునే సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి. రన్నింగ్ చేసే సమయంలో గుండె వేగం కొంతసేపు పెరిగి ఉంటుంది. గుండె, ఊపిరితిత్తులు పనిచేసే కండరాలకు నిరంతరం ఆక్సిజన్ అందించాల్సి రావడంతో కార్డియో సామర్థ్యం, శ్వాసకోశ సామర్థ్యం మెరుగుపడతాయి. క్రమం తప్పకుండా మితమైన స్థాయిలో రన్నింగ్ చేయడం రక్తపోటును నియంత్రించడంలో, ఆరోగ్యకరమైన శరీర బరువును కొనసాగించడంలో కూడా సహాయపడుతుంది. అయితే చాలాకాలంగా వ్యాయామం చేయని వారు ఒక్కసారిగా తీవ్రంగా పరుగెత్తడం కంటే ముందుగా నడక, వేగంగా నడక వంటి తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలతో




ప్రారంభించి క్రమంగా పరుగుకు వెళ్లడం మంచిది. మరోవైపు బాడీవెయిట్ స్క్వాట్స్ ప్రధానంగా కాళ్లు, తొడలు, నడుము, పొత్తికడుపు కండరాలను బలోపేతం చేస్తాయి. కూర్చోవడం, నిలబడడం, మెట్లు ఎక్కడం, నడవడం వంటి రోజువారీ పనులను సులభంగా చేయడానికి అవసరమైన శారీరక సామర్థ్యాన్ని ఇవి పెంచుతాయి. స్క్వాట్స్ వరుసగా లేదా వేగంగా చేస్తే గుండె వేగం కూడా పెరుగుతుంది. అయినప్పటికీ వాటిని రన్నింగ్‌కు సమమైన ఏరోబిక్ వ్యాయామంగా పరిగణించలేం. కండరాల బలం, కండరాల సహనశక్తిని పెంచడం స్క్వాట్స్ ప్రధాన ప్రయోజనం కాగా, రన్నింగ్ నిరంతర కార్డియో వ్యాయామాన్ని అందిస్తుంది. అందువల్ల గుండె ఆరోగ్యం కోసం రన్నింగ్, స్క్వాట్స్‌లో ఒక్క దానినే ఎంచుకోవాల్సిన అవసరం లేదు.

# కంటినిండా నిద్ర కావాలా?



ఆరోగ్యకరమైన జీవనశైలికి రోజూ 8–9 గంటల నిద్ర అవసరం. మరి ఈ ఉరుకుల పరుగుల జీవితంలో అది సాధ్యమేనా అంటే కష్టమనే చెప్పాలి. కారణం... స్క్రీన్ టైమ్ పెరిగిపోవడం వల్ల చాలామంది మానసిక ఒత్తిడి, ఆందోళనలతో కంటినిండా నిద్రలేక ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారు. దాంతో దీర్ఘకాలిక వ్యాధులు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో... మంచి నిద్రను అందించే స్లీపింగ్ కిట్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. మరి ఇవి ఎంత వరకు నిద్రలేమికి పరిష్కారం చూపుతున్నాయి? వీటి ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతున్నారు నిపుణులు.

ఐ మాస్క్... గదిలో కొద్దిపాటి వెలుతురున్నా చాలు కొంతమందికి నిద్ర పట్టదు. దీనికి ఐమాస్క్‌లు ఉపయోగించమని చెబుతున్నారు. అయితే కాటన్‌తో చేసిన మాస్క్‌లు ఎంచుకుంటేనే ఫలితం ఉంటుంది. మెత్తగా ఉండి వెలుతురుని అడ్డుకునేందుకు సహాయపడతాయి.

ఇయర్ ప్లగ్స్... నిద్రపోతామా కొంతమందికి చిన్న శబ్దం అయినా మెలకువ వచ్చేస్తుంది. మళ్లీ నిద్రపోదామన్నా కంటి మీద కునుకు రాదు. అలాంటివాళ్లకి బాగా ఉపయోగపడతాయి. ఇవి బయట నుంచి వచ్చే శబ్దాలను తగ్గించి మనసుకూ, శరీరానికీ హాయిని అందిస్తాయి.

పిల్లో మిస్ట్... లావెండర్ లేదా చామంతి వంటి సువాసనలు నరాలను శాంతపరుస్తాయి. అందుకే వీటికోసం ప్రత్యేకంగా పిల్లో స్ప్రేలు వస్తున్నాయి. ఇవి నాడీ వ్యవస్థకు అరోమాథెరపీలా పనిచేసి మంచి నిద్రపట్టేలా చేస్తాయి. బరువుగా ఉండే బ్లాంకెట్లు... మందంగా ఉండే దుప్పట్లు శరీరంపై తేలికపాటి ఒత్తిడి కలిగిస్తూ భద్రతా భావాన్ని కలిగించి త్వరగా నిద్ర పట్టేలా చేస్తాయని చెబుతున్నారు. అయితే ఇవన్నీ వెలుతురు, శబ్దాలు, ఇతర ఆలోచనల్ని తగ్గించి నిద్రపోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని మాత్రమే కల్పిస్తాయి కానీ, నిద్రలేమిని నయం చేయలేవు అంటున్నారు నిపుణులు. నిద్ర రాకపోవడం... రాత్రివేళల్లో పదేపదే మెలకువ వస్తుంటే స్లీప్ ఆప్నియాగా గుర్తించాలంటున్నారు. ఒకవేళ ఇది ప్రారంభంలోనే ఉందనిపిస్తే ఇంట్లోనే స్లీప్ రొటీన్ అలవాటు చేసుకుంటే మంచిది అంటున్నారు. పడుకునే ముందు పాదాలకు నువ్వులు, కొబ్బరి నూనెతో మర్దన చేసుకోవాలి.

నిద్రకు కనీసం గంట ముందు టీవీ, ఫోన్‌లకు దూరంగా ఉండాలి.

# జంక్ ఫుడ్స్ మానలేకపోతున్నారా?

కొంతమందికి కడుపు నిండా ఆహారం తీసుకున్నా జంక్ ఫుడ్స్ పైకి మనసు లాగుతుంటుంది. ఈ అలవాటు దీర్ఘకాలంలో వివిధ రకాల అనారోగ్యాలకు దారితీస్తుంది. అందుకే ఇలాంటి ఆహారపు కోరికల్ని అదుపులో పెట్టుకోవాలంటే కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. సాధారణంగా గర్భం ధరించిన మహిళలకు ఈ తరహా ఆహారపు కోరికలు ఎక్కువగా కలుగుతుంటాయి. అలాగే మూడ్ స్వింగ్స్, పని ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యత.. మొదలైనవి కూడా దీనికి కారణమవుతుంటాయి. ఇలాంటి సమయాల్లో జంక్‌ఫుడ్స్ తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొవ్వులు, క్యాలరీలు పెరిగిపోతాయి. ఇవి దీర్ఘకాలంలో ఊబకాయానికి దారితీస్తాయి. పైగా గర్భిణులు ఇలాంటి ఆహార పదార్థాలు తీసుకోవడం తల్లీబిడ్డలిద్దరికీ మంచిది కాదు. కాబట్టి



జంక్‌ఫుడ్ తినాలనే కోరిక కలిగినప్పుడు.. వాటికి బదులుగా ఇష్టమైన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. తగినన్ని నీళ్లు తీసుకోవడం వల్ల ఆహార కోరికలు నియంత్రణలో ఉంటాయంటున్నారు నిపుణులు. అదేవిధంగా శరీరం తేమను కోల్పోకుండా కూడా జాగ్రత్తపడచ్చు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌ల మధ్య ఎక్కువ గ్యాప్ ఇవ్వకూడదు. తక్కువ మోతాదులో ఎక్కువసార్లు ఆహారం తినడం వల్ల చిరుతిండ్ల పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే మధ్యమధ్యలో బాదం, వాల్‌నట్స్, జీడిపప్పులు, పండ్లు.. వంటి ఆరోగ్యకరమైన స్నాక్స్ తీసుకోవాలి.

ఆహారాన్ని బాగా నమిలి మింగడం వల్ల ఆహార కోరికలు తగ్గిపోయే అవకాశం ఉంటుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కార్బోహైడ్రేట్లతో పోల్చితే ప్రొటీన్లు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి ప్రొటీన్లు పుష్కలంగా లభించే కోడిగుడ్లు, పాలు, పాల పదార్థాలు, నట్స్.. వంటివి తీసుకుంటే ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలుగుతుంది. ఇతర ఆహార పదార్థాల పైకి మనసు మళ్లే అవకాశం తక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు.

వీటితో పాటు కంటి నిండా నిద్ర, ఒత్తిడిని దూరం చేసుకోవడానికి యోగా, ధ్యానం, ఇతర వ్యాయామాలు చేయడం.. వల్ల కూడా ఆహారపు కోరికల్ని

# అరుగుదల తగ్గిందా..

మహిళల జీవితంలో మెనోపాజ్ సహజమైన దశ. ఈ సమయంలో శరీరంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. వేడి ఆవిర్లు, నిద్రలేమి, మూడ్ స్వింగ్స్, అలసట, ఎముకల బలహీనత వంటి లక్షణాలతో పాటు చాలామందిని ఇబ్బంది పెట్టే మరో సమస్య జీర్ణక్రియ మందగించడం. తిన్న ఆహారం సరిగా అరగకపోవడం, కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం, కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన వంటివి ఈ సమయంలో కనిపిస్తాయి.



మెనోపాజ్‌లో ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్ల స్థాయులు తగ్గుతాయి. ఈ హార్మోన్ల మార్పులు జీర్ణవ్యవస్థ పనితీరుపైనా ప్రభావం చూపుతాయి. శరీరంలో మెటబాలిజం వేగం తగ్గడం, కండరాల చలనం మందగించడం, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అంతేకాదు, ఈ దశలో ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటివి పెరిగి జీర్ణక్రియను ప్రభావితం చేస్తాయి.

ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు ఈ సమస్యను చాలావరకు తగ్గించగలవు. ఒకేసారి ఎక్కువగా తినొద్దు. బదులుగా రోజులో నాలుగైదుసార్లు కొద్దికొద్దిగా తీసుకోవడంతోపాటు నెమ్మదిగా నమిలి తినాలి. అన్నం, రొట్టెలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, మొలకలు, పండ్లు వంటివి తీసుకోవాలి. ఇవి మలబద్ధకాన్ని తగ్గించడమే కాకుండా పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మజ్జిగ, ఇడ్లీ, దోశ వంటి తేలికగా జీర్ణమయ్యే ఆహారాలు డైట్‌లో చేర్చుకోవాలి. అయితే పాలు లేదా పాల పదార్థాలు తీసుకున్న తర్వాత ఉబ్బరం, గ్యాస్ పెరిగితే వైద్యుల సలహా తీసుకోవాలి. రోజూ తగినన్ని నీళ్లు తాగడం కూడా అత్యంత అవసరం. ఉదయం గోరువెచ్చని నీరు, భోజనం తర్వాత కొద్దిసేపు నడక జీర్ణక్రియకు తోడ్పడతాయి. కనీసం 30 నిమిషాలు నడక, యోగా లేదా తేలికపాటి వ్యాయామం చేయడం మంచిది.

అధికంగా వేయించిన పదార్థాలు, మసాలా, ప్యాకేజ్డ్ ఫుడ్స్, చక్కెర పానీయాలు, ఎక్కువ కాఫీ, టీ, కార్బొనేటెడ్ డ్రింక్స్ తగ్గించాలి. ఇవి గ్యాస్, ఆమ్లత్వం, కడుపు మంటను పెంచే అవకాశం ఉంది.

## హైదరాబాద్‌లో ఓన్లీ సేవలు: ర్యాపిడో

రవాణా సేవలను అందించే ర్యాపిడో తన ఆహార డెలివరీ యాప్ 'ఓన్లీ' సేవలను హైదరాబాద్‌లో అందుబాటులోకి తెచ్చింది. బెంగళూరు తర్వాత ఈ యాప్ సేవలు ప్రారంభమైన రెండో నగరం ఇది. ఈ ఏడాది అక్టోబరు–డిసెంబరు నుంచి దేశంలోని అన్ని ప్రధాన మెట్రో నగరాలకూ ఈ సేవలు విస్తరించనున్నట్లు ర్యాపిడో, ఓన్లీ సహ వ్యవస్థాపకుడు అరవింద్ తెలిపారు. బెంగళూరులో ప్రవేశ పెట్టిన రెస్టారెంట్ అనుకూల, జీరో కమీషన్ నమూనానే హైదరాబాద్‌లోనూ అమలు చేస్తున్నట్లు చెప్పారు. బెంగళూరులో 25,000కు పైగా రెస్టారెంట్ భాగస్వాములతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

# 22 కంపెనీలకు ఐఐటీల అల్టిమేటం

మనదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ విద్యా సంస్థలంటే ముందుండేవి ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లే. అక్కడ సీటు రావడంతోనే, విద్యార్థులు ఉద్యోగం వచ్చినంత సంబరాలు చేసుకుంటారు. ఎందుకంటే ఐఐటీలో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు కంపెనీలు అత్యుత్తమ ప్యాకేజీలు ప్రకటిస్తున్నందునే. అయితే తమ క్యాంపస్ నియామకాల్లో పాలుపంచుకోరాదని 22 కంపెనీలకు ఐఐటీలు అల్టిమేటం జారీ చేశాయి. ఇందులో దిగ్గజ కంపెనీ ఒరాకిల్ కూడా ఉండటం గమనార్హం.
ఐఐటీల నిర్ణయానికి తగిన కారణం లేకపోలేదు. 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన విద్యార్థులకు, ఆఫర్ లెటర్లు ఇచ్చినా.. ఉద్యోగాలివ్వడంలో ఆయా కంపెనీలు విఫలం కావడమే ఇందుకు నేపథ్యం. అందుకే మరో రెండు ప్లేస్‌మెంట్ సీజన్ల వరకు ఆయా కంపెనీలకు తాము సహకరించబోమని ఐఐటీలు కుండబద్దలు కొట్టాయి. సాధారణంగా ఇంజినీరింగ్ చివరి సంవత్సరం మధ్యలోనే కళాశాలల ప్రాంగణాల్లో కంపెనీలు ఎంపికలు జరిపి, ఆఫర్ లెటర్లు ఇస్తుంటాయి. ఇప్పుడు కూడా ఈ ప్రక్రియకు కంపెనీలు సిద్ధమవుతున్న తరుణంలో ఐఐటీలు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ నెల మొదట్లో ఐఐటీ గువాహటిలో జరిగిన సమావేశంలో ఆల్ ఐఐటీస్ ప్లేస్‌మెంట్ కమిటీ (ఏఐపీసీ) ఈ నిర్ణయం తీసుకుంది. అన్ని ఐఐటీలకు కలిపి ప్లేస్‌మెంట్లు, ఇంటర్న్‌షిప్‌నకు బాధ్యత వహించే ఏఐపీసీ, ఈ నెలాఖరులో అధికారికంగా తమ నిర్ణయం




గురించి ఆయా కంపెనీలకు లేఖలు రాయనుందని సమాచారం. అయితే 'బ్లాక్‌లిస్టింగ్' పదానికి బదులుగా, 'నాన్ కోఆపరేషన్'ను ఎంచుకున్నట్లు తెలిసింది. 23 ఐఐటీల్లో 150కి పైగా ఉద్యోగ ఆఫర్ లెటర్లను ఈ కంపెనీలు, నెరవేర్చలేకపోవడమే ఇందుకు నేపథ్యం. కొన్ని కంపెనీలు 10–15 ఆఫర్లను ఉపసంహరించుకున్నట్లు ఏఐపీసీ కన్వీనర్ జాన్ జోస్ చెప్పినా, కంపెనీల పేర్లను వెల్లడించలేదు. క్యాంపస్ వర్గాల కథనం ప్రకారం, అందులో అమెరికా సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఒరాకిల్ కూడా ఉంది. ఈ దిగ్గజ సంస్థ 40 ఉద్యోగ ఆఫర్లను గౌరవించడంలో విఫలమైందని సమాచారం. ఈ సంస్థ మనదేశంతో పాటు అంతర్జాతీయంగా వేల కొద్దీ లేఆఫ్‌లను ప్రకటిస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటి దాకా ప్రాంగణ ఎంపికల కోసం ఐఐటీలను ఒరాకిల్ సంప్రదించలేదనీ జోస్ తెలిపారు. ఐఐటీల 'నాన్ కోఆపరేషన్' జాబితాలో పలు అంకురాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆఫర్ లెటర్లు ఇచ్చీ, ఉద్యోగాలు ఇవ్వని కంపెనీలను నేరుగా ఆయా ఐఐటీలు గతేడాది సంప్రదించాయి. 10–11 కంపెనీలు ఉద్యోగాలివ్వడంలో విఫలమయ్యాయని, ఈ ఏడాది మరిన్ని ఎక్కువ కంపెనీలు ఆ బాట పట్టడంతో అన్ని ఐఐటీలూ కలిసి ఏఐపీసీ ద్వారా సంప్రదింపులు చేపట్టాయని జోస్ వివరించారు. ఉద్యోగాలు రాకుండా ఉన్న విద్యార్థుల సీవీ (కరిక్యులమ్ విట)లను ఇతర కంపెనీలకు పంపామని, అందులో 20–30% మందికి ఉద్యోగాలు రావొచ్చని జోస్ చెబుతున్నారు. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల పూర్తి సమాచారం ఇంకా తమ వద్ద లేదన్నారు.

# బిజినెస్

## భారత్ ఇంధన అవసరాల వైపు.. అమెరికా చూపు




పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినప్పటి నుంచీ భారత్.. ఇంధన దిగుమతుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలోనే భారత్ అవసరాలకు తగ్గట్టు ఇంధనం సరఫరా చేయా లని ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు, ఇంధన ఆంక్షల విషయంలో అమెరికా (USA) కఠిన వైఖరి అనుసరిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో భారత్‌కు భారీగా ఇంధన అవసరాలు ఉన్నందున.. ఆ అవకాశాన్ని తాము వినియోగించుకోవాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. యుద్ధం వల్ల కొన్ని నెలలపాటు ఇరాన్, పశ్చిమాసియా దేశాల నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోవడంతో ప్రపంచ మార్కెట్‌లో ఇంధన లభ్యత పరిమితంగా ఉందని సదరు అధికారి పేర్కొన్నారు. అయితే వెనెజువెలాపై ట్రంప్ చేపట్టిన విజయవంతమైన ఆపరేషన్‌తో ప్రస్తుతం అమెరికా వద్ద పెద్ద మొత్తంలో చమురు నిల్వలు ఉన్నాయన్నారు. భారత్ వంటి మిత్ర దేశాలకు చమురు విక్రయించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అమెరికా కాంగ్రెస్ ఇటీవల 'ద లిండ్సే గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్–2026' బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనిపై ట్రంప్ సంతకం కూడా చేయడంతో ఇది చట్టరూపం దాల్చింది. రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం జరుపుతోన్న భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించేందుకు ఈ చట్టంతో ట్రంప్‌నకు అధికారం లభించినట్లయ్యింది. ఈ కొత్త చట్టం.. భారత్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపైనా ప్రభావం చూపుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

## ఆడిటింగ్ పనులు ముందుగానే పూర్తి చేసుకోండి




ఈనెల 28–30 తేదీల్లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకుల సమ్మె జరుగుతున్న నేపథ్యంలో.. చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ) తమ ఆడిటింగ్ పనులను ముందే పూర్తి చేసుకోవాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సూచించింది. సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాల్సిన పనులకు ఆటంకం కలగకుండా, ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకోవాలని వివరిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఆడిట్‌లకు అవసరమైన బ్యాంకు సమాచారం, ధ్రువీకరణ పత్రాలను త్వరగా సేకరించుకోవాలని ఐసీఏఐ కోరింది. చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదురుకాకుండా, ఖాతాదారుల నుంచి అవసరమైన బ్యాంకింగ్ వివరాలను ముందే తెప్పించుకోవాలని సీఏలకు ఐసీఏఐ స్పష్టం చేసింది.
ఆదివారం తమ శాఖలు తెరచి ఉంచుతున్నందున, ఖాతాదార్లు తమ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని ప్రభుత్వరంగ బ్యాంకులు కోరాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్‌బ్యాంక్, ఇండస్‌ఇండ్‌బ్యాంక్ 28–30 తేదీల్లో తమ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగించనున్నాయి.

## ఫెడరల్ బ్యాంక్ చేతికి జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్!




దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో మరో భారీ విలీనానికి రంగం సిద్ధమవుతోంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ)ను కొనుగోలు చేసేందుకు కేరళలోని అలువా కేంద్రంగా పనిచేసే ఫెడరల్ బ్యాంక్ తుది దశ చర్చలు జరుపుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందం షేర్ స్వాప్ (ఈక్విటీ షేర్ల మార్పిడి) పద్ధతిలో జరగనుంది. గతంలో కోటక్ మహీంద్రా బ్యాంక్– ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ (2015), ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్– ఫిన్‌కేర్ ఎస్ఎఫ్‌బీ (2023) విలీనాలు ఇదే తరహాలో జరిగాయి. ప్రస్తుతం ఫెడరల్ బ్యాంక్ మార్కెట్ విలువ దాదాపు రూ.82,000 కోట్లు కాగా, జన ఎస్ఎఫ్‌బీ మార్కెట్ విలువ రూ.5,600 కోట్లుగా ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం.. జన ఎస్ఎఫ్‌బీ షేరును రూ.620– 650 శ్రేణిలో, ఫెడరల్ బ్యాంక్ షేరును మార్కెట్ ధర కంటే కాస్త ఎక్కువగా దాదాపు రూ.350 వద్ద లెక్కకట్టి, స్వాప్ రేషియోను ఖరారు చేసేందుకు చర్చలు జరుగుతున్నాయి.
బ్యాంకుగా రద్దు కానున్న జన ఎస్ఎఫ్‌బీ: ఈ కొనుగోలు పూర్తయ్యాక, జన ఎస్ఎఫ్‌బీకి చెందిన మొత్తం ఆస్తులు, రుణాలు ఫెడరల్ బ్యాంక్‌లో విలీనమవుతాయి. తద్వారా జన ఎస్ఎఫ్‌బీ స్వతంత్ర బ్యాంకుగా ఉనికి కోల్పోతుంది. ఈ బ్యాంకు హోల్డింగ్ కంపెనీ అయిన జన హోల్డింగ్స్‌లో ప్రధాన పెట్టుబడిదారు అయిన అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం టీపీజీ.. ఈ ఒప్పందం ద్వారా నిష్క్రమించనుంది. ఫెడరల్ బ్యాంక్‌కే ఎక్కువ ప్రయోజనం: ఆర్‌బీఐ నిర్దేశించిన ప్రాధాన్యతా రంగ రుణాల లక్ష్యాలను చేరుకోవడానికి జన ఎస్ఎఫ్‌బీ మైక్రోఫైనాన్స్ పోర్ట్‌ఫోలియో, ఫెడరల్ బ్యాంక్‌కు దోహదపడనుంది. ఉత్తర, మధ్య భారత్‌లోని అట్టడుగు వర్గాలకు విస్తరించిన జన బ్యాంక్ ద్వారా ఫెడరల్ బ్యాంక్ లాభదాయకత పెరగడంతో పాటు సేవలూ విస్తరించనున్నాయి.
కొన్ని చిక్కులు కూడా ఉన్నాయ్: 2026 జూన్‌కు ఫెడరల్ బ్యాంక్ రుణాల పోర్ట్‌ఫోలియో రూ.2.77 లక్షల కోట్లు కాగా, బ్యాంక్‌లో 17,000 మంది ఉద్యోగులు ఉన్నారు. కేవలం రూ.37,600 కోట్ల రుణాల పోర్ట్‌ఫోలియో కలిగిన జన ఎస్ఎఫ్‌బీలో 26,000 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది మైక్రోఫైనాన్స్ రికవరీ–క్షేత్రస్థాయి విధుల్లో ఉండే ఫీల్డ్ ఉద్యోగులే. ఇంత మంది ఉద్యోగులను ఫెడరల్ బ్యాంక్‌లోకి ఎలా తీసుకురావాలన్న దానిపై ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంది. ఐడీబీఐ బ్యాంకులో వ్యూహాత్మక వాటా కొనుగోలు కోసం వచ్చిన ఆర్థిక బిడ్‌లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ ప్రక్రియ స్థిర వేగంతో ముందుకు సాగుతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఐడీబీఐ బ్యాంక్‌లో 60.72% వాటా కొనుగోలు నిమిత్తం జులైలో ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్, దుబాయ్‌కు చెందిన ఎమిరేట్స్ ఎన్‌బీడీ సవరించిన బిడ్‌లు దాఖలు చేశాయి. ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌లో ప్రముఖ బిలియనీర్ ప్రేమ్ వాత్సాకు పెట్టుబడులు ఉన్నాయి. ఈ రెండు సంస్థలకు ఇప్పటికే భారత బ్యాంకింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టిన అనుభవం ఉంది. ఆర్‌బీఎల్ బ్యాంకులో ఎమిరేట్స్ ఎన్‌డీబీ మెజార్టీ వాటా కొనుగోలు చేయగా.. సీఎస్‌బీ బ్యాంకులో ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ 40% వాటా కలిగి ఉంది. ఈ రెండు సంస్థలు ఇప్పటికే హోం శాఖ నుంచి భద్రతా అనుమతులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి 'ఫిట్ అండ్ ప్రాపర్' మదింపును పొందాయి. ఐడీబీఐ బ్యాంకులో వాటా కొనుగోలుకు ఆసక్తిగల సంస్థలు, ఆర్థిక బిడ్‌లను దాఖలు చేయడం ఇది రెండో సారి. ఈ బ్యాంకులో ప్రభుత్వం, ఎల్ఐసీ కలిసి 60.72% వాటా విక్రయించాలని అనుకుంటున్నాయి.

# క్రీడలు

## రెండో వన్డేలో లంక గెలుపు



ఇంగ్లాండ్ పర్యటనలో శ్రీలంక ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. శుక్రవారం రెండో వన్డేలో ఆతిథ్య జట్టుపై 16 పరుగుల తేడాతో గెలిచిన లంక.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. కెప్టెన్ కుశాల్ మెండిస్ (121; 118 బంతుల్లో 14×4, 3×6) సెంచరీతో చెలరేగడంతో మొదట శ్రీలంక 6 వికెట్లకు 321 పరుగులు సాధించింది. కమిందు మెండిస్ (54), పవన్ రత్నాయకే (48) రాణించారు. ఛేదనలో ఇంగ్లాండ్.. 9 వికెట్లకు 305 పరుగులు చేసింది. ఓపెనర్లు బాంటన్ (73), డకెట్ (67) అదరగొట్టినా.. వెల్లలాగె (3/49), మధుశంక (2/54), ఇషాన్ మలింగ (2/50) విజృంభించి లంకను గెలిపించారు. టీ20 సిరీస్‌లో 0–3తో లంక వైట్‌వాష్ అయిన సంగతి తెలిసిందే.

## ఇదే నా చివరి ప్రపంచకప్..
### సర్వశక్తులూ ధారపోస్తా: కోహ్లీ




టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచ కప్.. దేశం తరపున తాను ఆడే చివరి మెగా టోర్నీ అని స్పష్టం చేశాడు. ఆ ట్రోఫీని కైవసం చేసుకునేందుకు మైదానంలో తన సర్వశక్తులూ ధారపోస్తానని తెలిపాడు. ఈ నెల 27 నుంచి వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌కు ముందు 'జియోస్టార్'తో కోహ్లీ మాట్లాడాడు. వచ్చే ఏడాది సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ''భారత్ తరపున ఆడబోయే చివరి వరల్డ్‌కప్ ఇదే. టోర్నీని గెలవడమే నా ఏకైక లక్ష్యం. దాని కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు, మైదానంలో సర్వస్వం ధారపోసేందుకు సిద్ధంగా ఉన్నా'' అని కోహ్లీ వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్‌లో ఉండే ఇంటెన్సిటీ మరే ఇతర టోర్నమెంట్‌లోనూ ఉండదని చెప్పాడు. ''ఇందులో దాదాపు 10 మ్యాచ్‌లను టీ20 స్థాయి తీవ్రతతో ఆడాల్సి ఉంటుంది. ఒక వన్డే మ్యాచ్ అనేది 2.5 టీ20లతో సమానం. పెద్ద టోర్నమెంట్ లేదా ప్రపంచకప్‌లో వరుసగా 10 మ్యాచ్‌లపాటు ఆ ఇంటెన్సిటీని కొనసాగించడం చాలా పెద్ద విషయం.'' అని తెలిపాడు.
మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. ''నేను చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన ఎప్పుడూ రాదు. ఆడుతున్నంత కాలం.. ఏదో ఒక లక్ష్యం కోసం ఎదురుచూస్తూనే ఉంటాం. ప్రస్తుతం ప్రపంచకప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రపంచకప్ లేదా ఏదైనా ఐసీసీ టోర్నమెంట్ ఆడేటప్పుడు వేర్వేరు వేదికలపై.. వేర్వేరు ప్రత్యర్థులను ఎదుర్కొంటాం. కాబట్టి, అందుకు తగినట్లు విభిన్నంగా సిద్ధం కావాలి. కొత్తగా ఆలోచించాలి. అదే అసలైన సవాలు'' అని పేర్కొన్నాడు. రాబోయే వన్డే వరల్డ్‌కప్ వరకు ఆడతారా? లేదా? అనే సందేహాలకు ఈ ఇద్దరు తమ వ్యాఖ్యలతో తాజాగా చెక్‌పెట్టినట్లయ్యింది.

## కబడ్డీలో భారత్‌కు డబుల్ బొనాంజా.. అబ్బాయిలూ 'పసిడి' పట్టేశారు!




ఆసియా క్రీడల కబడ్డీలో మన అమ్మాయిలు, అబ్బాయిలు ఇరాన్‌ను గట్టిగానే ఢీకొట్టారు. ఇప్పటికే ఆ దేశాన్ని ఓడించి మహిళల జట్టు స్వర్ణాన్ని దక్కించుకోగా.. పురుషుల జట్టు అదే బాటలో నడిచింది. ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో పసిడి కూత పెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. ఇరాన్‌ను 40–34 పాయింట్ల తేడాతో ఓడించింది. దీంతో కలిపి ఆసియా క్రీడల చరిత్రలో కబడ్డీ జట్టు తొమ్మిదిసార్లు బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది నాలుగో స్వర్ణం 2026 ఆసియా క్రీడల్లో (Asian Games) ఇప్పటివరకు నాలుగు స్వర్ణాలతో భారత్ పతకాల పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. 11 రజతాలు, 13 కాంస్యాలతో కలిపి మొత్తం 28 పతకాలను సొంతం చేసుకుంది. మహిళల క్రికెట్ ఫైనల్‌లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో తొలి స్వర్ణాన్ని దక్కించుకోగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్, కమల్‌జీత్ జంట శుక్రవారం పసిడి సొంతం చేసుకున్నారు. ఇక, శనివారం కబడ్డీలో రెండు స్వర్ణాలు వచ్చాయి. 2022 ఆసియా క్రీడల్లో భారత్‌కు మొత్తం 106 పతకాలు వచ్చాయి. వాటిలో 28 గోల్డ్‌మెడల్స్. ఈసారి భారత్ నాలుగో స్థానంలో నిలవగా.. చైనా తొలి స్థానంలో నిలిచింది.

## అమ్మాయిల పసిడి కూత.. ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో గోల్డ్

జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్‌కు మూడో స్వర్ణం వచ్చి చేరింది. కబడ్డీ పోటీల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన మన అమ్మాయిలు.. ఫైనల్‌లో ఇరాన్‌ను ఓడించి బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ గేమ్‌లో 37–34 తేడాతో మన జట్టు ఇరాన్ నుంచి విజయాన్ని లాగేసుకుంది. మరోవైపు రైఫిల్ షూటింగ్‌లో రజతం దక్కగా.. స్క్వాష్ జోడీ సెమీస్‌లో తడబడి, కాంస్యంతో సరిపెట్టుకుంది. 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో తిలోత్తమా సేన్, విదర్సా వినోద్, ఆషి చౌక్సే రజతాన్ని సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో చైనా బృందం 1773 పాయింట్లతో పసడి పతకాన్ని దక్కించుకోగా.. భారత బృందానికి 1763 పాయింట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచింది. 1754 పాయింట్లు సాధించిన కజకిస్థాన్‌కు కాంస్యం దక్కింది. ఇక, స్క్వాష్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్ జోడి జోష్న చిన్నప్ప–సెంథిల్ కుమార్‌కు కాంస్య పతకం దక్కింది. సెమీస్‌లో హాంకాంగ్ ద్వయం లీ కా యి, తాంగ్ మింగ్ హాంగ్ చేతిలో ఓడింది.



## ఆసియా క్రీడల్లో సావన్ చరిత్ర..
### 44 ఏళ్ల తర్వాత మారథాన్‌లో రజతం



జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్, హవల్దార్ సావన్ బర్వాల్ చరిత్ర సృష్టించాడు. 44 ఏళ్ల తర్వాత భారత్‌కు మారథాన్‌లో పతకం తీసుకొచ్చాడు. శనివారం జరిగిన పురుషుల మారథాన్‌లో సావన్ 2:11:37 గంటల వ్యవధిలో రేసును ముగించి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో ఈ విభాగంలో భారత సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన 28 ఏళ్ల సావన్ బర్వాల్ భారత ఆర్మీలో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రేసు ప్రారంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన సావన్.. 35 కిలోమీటర్ల మార్క్ వరకు ముందంజలోనే ఉన్నాడు. చివరి 7 కిలోమీటర్లలో కాస్త నెమ్మదించడంతో రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ రేసులో జపాన్‌కు చెందిన ఇచితాకా యమషితా 2:10:49 గంటల వ్యవధిలో గమ్యం చేరుకొని సొంత గడ్డపై స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. కేవలం 48 సెకన్ల తేడాతో సావన్‌కు పసిడి పతకం చేజారడం గమనార్హం. ఇక, చైనాకు చెందిన పేయూ.. కాంస్య పతకం సాధించాడు. ఆసియా క్రీడల మారథాన్‌లో భారత్‌కు పతకం రావడం ఇది నాలుగోసారి. 1951లో దిల్లీలో జరిగిన క్రీడల్లో భారత్‌కు స్వర్ణం, కాంస్యం వచ్చాయి. ఆ తర్వాత 1982లోనూ మన దేశంలో ఆసియా క్రీడలు జరగ్గా.. సీతారాం కాంస్యం సొంతం చేసుకున్నాడు. మళ్లీ ఇప్పుడు 44 ఏళ్ల తర్వాత సావన్ విదేశీ గడ్డపై రజతంతో మెరిశాడు. ఇక, తాజా పోటీల్లో సావన్ 2:11:37 గంటల్లో రేసును పూర్తిచేశాడు. ఇది అతడి కెరీర్‌లోనే వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన కావడం విశేషం.




# 'సిగ్మా' ప్రీరిలీజ్ ఈవెంట్




**వుదయం సినిమా:** సందీప్ కిషన్ యాక్షన్–అడ్వెంచర్ హీస్ట్ కామెడీ ఎంటర్టైనర్ 'సిగ్మా'. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫారియా అబ్దుల్లా హీరోయిన్. ప్రతిష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రంపై ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది.ప్రీరిలీజ్ ఈవెంట్ లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ...అందరికీ నమస్కారం. నేను నేరుగా కాకా షూటింగ్ నుంచి వస్తున్నాను. ఏడు గంటల వరకు షూటింగ్ అయింది. త్వరగా ఫినిష్ చేయండి, ఈవెంట్ కి వెళ్లానని చెప్పాను. అక్కడ అందరూ రెస్ట్ తీసుకోవచ్చు కదా అని అన్నారు. వాళ్ల పాయింట్ ఆఫ్ వ్యూలో అది కరెక్టే. కానీ నేను మాత్రం ఒక వేడుకకు రావడం బాధ్యతగా ఫీల్ అవుతాను. ఇలాంటి యువ ప్రతిభావంతులు సినిమా చేసిన అది ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేటప్పుడు ఎంతోకొంత వాళ్లకి ఉపయోగపడాన్నారు.

## 'ప్యారడైజ్' రిలీజ్ తర్వాత రెస్పాన్స్ ఒక తుఫాన్‌లా వచ్చింది..



**వుదయం సినిమా:** 'ప్యారడైజ్' రిలీజ్ తర్వాత రెస్పాన్స్ ఒక తుఫాన్‌లా వచ్చింది. ఎవర్ని కలిసినా, ఎక్కడికి వెళ్లిన ఒకటే టాపిక్... అదే 'ప్యారడైజ్' గెలుపు. ప్రతి షోకి పాజిటివిటీ పెరుగుతుంది. ప్రేక్షకుల్లో పెరుగుతున్న ఆదరణ, ప్రేమని యాక్సెప్ట్ చేయాల్సిన టైం వచ్చింది: మీడియా ములాఖాత్ లో న్యాచురల్ స్టార్ నాని 'ప్యారడైజ్' సూపర్ డూపర్ హిట్ అయింది. నాని చాలా కష్టపడ్డాడు. జడలు వేసుకొని యాక్షన్ చేయడం మామూలు విషయం కాదు. నాని ఇంకా ఎన్నో గొప్ప విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను: కలెక్షన్ కింగ్ మోహన్ బాబున్యాచురల్ స్టార్ నాని లేటెస్ట్ బాక్సాఫీస్ తాండవం 'ది ప్యారడైజ్'. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కీలక పాత్ర పోషించారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు.

## అక్టోబర్ 2న 'ప్రేమనే ఊరిలో'



**వుదయం సినిమా:** మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివు, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. KGF, కాంతారా వంటి చిత్రాలకు డైలాగ్స్ అందించిన హనుమాన్ చౌదరి ఈ చిత్రానికి సంభాషణలు రాయగా ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల పాటలను రచించారు. సునద్ గౌతమ్ సంగీతం అందిస్తుండగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు.సెప్టెంబర్ 25న కన్నడలో విడుదలైన ఈ చిత్రానికి అనూహ్య స్పందన లభించగా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీన తెలుగులో విడుదలకు సిద్ధమవుతుంది. కర్ణాటకలో హౌస్ ఫుల్ అవుతున్న ఈ ప్రేమ కథ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు కూడా అదేవిధంగా ఆదరిస్తారని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుండి విడుదలైన పాటలకు, టీజర్ ఇంకా ట్రైలర్ అద్భుత స్పందన రావడంతో మేకర్స్ ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందని అంటున్నారు.

## 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రంలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి: ఫహాద్ ఫాజిల్



**వుదయం సినిమా:** ఫహాద్ ఫాజిల్ హీరోగా ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్ల మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్ఎస్ కార్తికేయ నిర్మించిన చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ ఏలేటి దర్శకుడు. అక్టోబర్ 2న మూవీ రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో శనివారం ఫహాద్ ఫాజిల్ మీడియాతో ముచ్చటించారు. సినిమా గురించి ఆయన చెప్పిన విశేషాలివే..

**'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమా చేయటానికి కారణమేంటి?** – కార్తికేయ నాకు ఫోన్ చేసిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' కథ గురించి చెప్పారు. శశాంక్ వచ్చి కథ చెప్పారు. నా జీవితంలో అసలు ఇలాంటి ఓ కథను వినలేదు. విన్న వెంటనే నాకు చాలా నచ్చింది. ఈ సినిమాని ఎలా అయినా సరే చేయాలని ఫిక్స్ అయ్యాను.

**సినిమాలో మ్యాజిక్ అనేది కీలకంగా ఉంటుందా?** – 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' అనే చిత్రంలో ప్రేమ, ఆప్యాయత, అనుబంధం వంటి చాలా ఎలిమెంట్స్ ఉంటాయి. మ్యాజిక్ అనే పార్ట్ ఒక అంశం మాత్రమే. ఈ సినిమాలో లోతైన అంశాలు, భావోద్వేగాలెన్నో ఉన్నాయి. చాలా మందికి చాలా విషయాల్ని అర్థమయ్యేలా చెప్పే చిత్రం అవుతుంది.

**'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమా చేసే క్రమంలో ఎలాంటి ఛాలెంజెస్ ఫేస్ చేశారు?** – మలయాళంలో కథను అర్థం చేసుకుని, డైలాగ్స్ నేర్చుకుని.. ఇంగ్లీష్‌లోకి మార్చుకుని.. తెలుగులో నటించడం నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. కాస్త కష్టంగానే అనిపించినా ఈ జర్నీ నాకు ఎంతో నచ్చింది.

**సినిమాను చాలా వరకు రియల్ లొకేషన్స్‌లో షూట్ చేయటం ఎలా అనిపించింది?**
– నాకు రియల్ లొకేషన్‌లో షూటింగ్ చేయడం అంటేనే ఇష్టం. కానీ 'పుష్ప' సినిమాకి మాత్రం అలా చేయడం కుదరలేదు. ఈ సినిమాని చాలా వరకు రియల్ లొకేషన్స్‌లోనే షూట్ చేశాం.

**విభిన్నమైన సినిమాల్లో నటిస్తుంటారు.. రైటర్స్‌కు ఉన్న ఇంపార్టెన్స్ గురించి చెప్పండి?**
– ఆర్టిస్టుల కంటే రచయిత, దర్శకులకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాలన్నది నా అభిప్రాయం.

## 'సిటీ ఆఫ్ గోల్డ్' ఫస్ట్ లుక్,

**వుదయం సినిమా:** మోస్ట్ ట్యాలెంటెడ్ విక్రమ్ ప్రభు 26వ చిత్రం 'సిటీ ఆఫ్ గోల్డ్'. ఈ చిత్రానికి సిద్ధార్థ్ దర్శకత్వం వహించారు. విక్రమ్ ప్రభు సరసన శివత్మిక రాజశేఖర్ కథానాయికగా నటిస్తుండగా, ఇంటర్నెట్ సంచలనం అమలా షాజీ ముఖ్య పాత్రలలో కనిపిస్తున్నారు. రోమియో పిక్చర్స్ బ్యానర్ పై రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ విడుదలయ్యాయి. విడుదలైన కొద్ది సేపటికే మంచి స్పందన లభించింది.ఫస్ట్ లుక్‌లో విక్రమ్ ప్రభు ఎంతో ఇంటెన్స్ లుక్‌తో కూర్చుని.. చాలా క్యాజువల్‌గా బంగారు కడ్డీలను పైకి విసురుతూ పట్టుకుంటూ కనిపించారు. బంగారం విలువతో పాటు దాని చుట్టూ ఉన్న మిస్టీరియస్ ప్రపంచాన్ని కలిపి చూపించిన ఈ విజువల్ ఆసక్తిని పెంచుతోంది. గ్లింప్స్ ప్రేక్షకులను మరింత ఆసక్తికరమైన ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. బంగారం మార్కెట్, అక్కడ పనిచేసే వ్యక్తులు, సామాన్య ప్రజలకు పెద్దగా తెలియని ఒక రహస్య వ్యవస్థను ఇందులో చూపించారు. ఆకట్టుకునే విజువల్స్ ద్వారా సినిమా నేపథ్యాన్ని, పాత్రలను పరిచయం చేయడం క్యూరియాసిటీ పెంచింది.విక్రమ్ ప్రభు ఇందులో ఇంటెన్స్ రోల్‌లో కనిపించనున్నారు. ఆయన కమాండింగ్ స్క్రీన్ ప్రజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అలగం పెరుమాళ్, జాఫర్ ఇడుక్కి, జీఎం సుందర్, వసుంధర, సునీల్ సుగత, జయకుమార్, మౌరిష్ దాస్, బాల హసన్, లిజ్జీ ఆంటోనీ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు.సినిమాటోగ్రాఫర్ కార్తీక్ శరాజ్ ఈ డార్క్ అండ్ మిస్టీరియస్ ప్రపంచాన్ని అద్భుతమైన విజువల్స్‌తో ఆవిష్కరించారు. యువన్ శంకర్ రాజా సంగీతం సినిమాకు మరింత డెప్త్‌ను తీసుకొచ్చింది.



**వుదయం సినిమా:** విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్‌సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "రణబాలి" సినిమా విడుదల వాయిదా పడుతుందనే రూమర్స్ కు చెక్ పెడుతూ ఈ రోజు మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీతో కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. తన మాతృభూమిని, తన ప్రజల్ని కాపాడేందుకు ప్రతిజ్ఞ చేసి వీరతిలకం పెట్టుకున్న యోధుడు రణబాలిగా విజయ్ దేవరకొండ మెస్మరైజింగ్ లుక్ తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. రీసెంట్ గా ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'ఏందయ్య సామీ..' ఫుల్ లిరికల్ సాంగ్కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈపాటలో విజయ్, రశ్మిక కెమిస్ట్రీ అందరినీ ఆకట్టు కుంది. త్వరలోనే "రణబాలి" సినిమా ట్రైలర్ ను, మిగతా లిరికల్ సాంగ్స్ ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## "రణబాలి" కొత్త పోస్టర్ రిలీజ్



## "చకోర – Lunar Love Bird" సినిమా ట్రైలర్ రిలీజ్



**వుదయం సినిమా:** High Joy Commercials బ్యానర్ పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, VIP – Vintage Iconic Pictures నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన–దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ "చకోర – Lunar Love Bird". శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రం శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా అక్టోబర్ 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హీరో ఆకాష్ జగన్నాథ్ అతిథిగా ఈ సినిమా ట్రైలర్ ను హైదరాబాద్ లో జరిగిన గ్రాండ్ ఈవెంట్ లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోడైరెక్టర్ మంగా శ్రీనివాస్ మాట్లాడుతూ – నాకు జీవితంలో పోరాటం నేర్పిన నా తండ్రికి, నాకు స్ఫూర్తిగా నిలిచిన మా అమ్మకు, నా ఇండస్ట్రీ గురువు పూరి జగన్నాథ్ కి థ్యాంక్స్. ఈ సినిమా రూపకల్పనలో నాకు అండగా నిలబడిన మా ప్రొడ్యూసర్ చింతాడ హేమారావుకు థ్యాంక్స్. ఇండస్ట్రీలో నాకున్న అనుభవంతో వీలైనంత తక్కువ బడ్జెట్ లో హై క్వాలిటీలో ఈ సినిమాను రూపొందించాను. పేరున్న హీరోలను అప్రోచ్ అయి వారితో సినిమా చేయడం సులువుకాదు. అందుకే కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకుని శ్రవణ్, మలైకా టి.వాసుపల్ ను హీరో హీరోయిన్స్ గా పరిచయం చేస్తున్నాం. వీరిద్దరు నేను అనుకున్న విజన్ కు తగినట్లు మంచి పర్ ఫార్మెన్స్ ఇచ్చారు. మా సినిమా అక్టోబర్ 9న థియేటర్స్ లోకి రాబోతోంది. ఇప్పటికే ఇండస్ట్రీ నుంచే కాక మీడియాలోని ఫ్రెండ్స్ కు కూడా సినిమా చూపించాం. అందరూ బ్యూటిఫుల్ మూవీ చేశావని ప్రశంసించారు. ప్రేక్షకుల ఆదరణ కూడా మా సినిమా పొందుతుందని నమ్ముతున్నాం. అన్నారు.హీరో శ్రవణ్ మాట్లాడుతూ – ఈ చిత్రంలో హీరోగా నటించే అవకాశం కల్పించిన మా ప్రొడ్యూసర్, డైరెక్టర్ గారికి థ్యాంక్స్. ఈ సినిమా కోసం సెలెక్ట్ అయినప్పుడు నేనొక రాయిలా ఉన్నాను. నన్ను ఈ పాత్రకు తగినట్లు శిల్పంలా చెక్కిన ఘనత మా డైరెక్టర్ గారికే దక్కుతుంది. మా మ్యూజిక్ డైరెక్టర్ ప్రిన్స్ హెన్రీ బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్, రొమాంటిక్ ఎంటర్ టైనర్ చూడాలనుకుంటే మీరు మా సినిమాకు రావొచ్చు.

## సినీ రంగానికి వన్‌స్టాప్ ప్లాట్‌ఫామ్‌గా 'N Media'



**వుదయం సినిమా:** సినిమా, షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌లు, క్యాస్టింగ్, ఈవెంట్స్‌తో పాటు డిజిటల్ ప్రమోషన్స్‌కు వేదికగా N Media వెబ్‌సైట్ ప్రారంభమైంది. సినీ దర్శకుడు శైలేష్ కొలను, నటుడు–నిర్మాత రాంకీ, తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ తదితరుల చేతుల మీదుగా N Media లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది.సినీ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌లకు అవసరమైన డిజిటల్ ప్రమోషన్స్, సోషల్ మీడియా ప్రమోషన్స్, పబ్లిసిటీ, బ్రాండింగ్, క్యాస్టింగ్, ఈవెంట్ ప్రమోషన్స్ వంటి సేవలను ఒకే వేదిక ద్వారా అందించాలనే లక్ష్యంతో N Mediaను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ, షార్ట్ ఫిలిమ్స్ ద్వారా కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ వస్తున్న రాము, N Media ద్వారా మరింత మంది టాలెంటెడ్ వ్యక్తులకు అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. సినీ రంగానికి N Media ఉపయోగపడాలని కోరుకుంటూ రాము, ఆయన టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియా సినిమాల ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యంగా చిన్న సినిమాలకు డిజిటల్ ప్రమోషన్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. N Media మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.నటుడు, నిర్మాత రాంకీ మాట్లాడుతూ, మీడియాకు సంబంధించిన వివిధ విభాగాలను ఒకే ప్లాట్ ఫామ్‌పైకి తీసుకురావడం అభినందనీయమన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.